


మా కలం - సామాన్యుడి బలం
# నంది పత్రిక
జాతీయ తెలుగు దిన పత్రిక
RNI-APTEL/2023/88162
GSTIN 37AMRPM5719R1ZX








ఎడిటర్: మహేష్ యాదవ్ | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 276 | గురువారం 15 - 10 -2026 | పేజీలు : 12 | వెల-3


# మోగిన నగారా!

## స్థానిక ఎన్నికలకు నగరా మోగింది.

- ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలకు గ్రీన్‌సిగ్నల్
- శ్రీకాకుళం, ఆముదాలవలసలో బ్రేక్
- రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- ఈ నెల 28న పోలింగ్
- నవంబరులో పంచాయతీలు, ఎంపీటీసీలకు..
- అమల్లోకి ఎన్నికల కోడ్

2లో

స్థానిక ఎన్నికలకు నగరా మోగింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలతో పాటు జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచా యతీల ఎన్నికలకు సంబంధించి బుధవారం




# మహానందిలో పెరిగిన రాజకీయ వేడి....!

## ఎంపీపీ పీఠం అన్ రిజర్వ్... జడ్పీటీసీ బీసీ మహిళకు కేటాయింపు...




2లో

**మహానంది అక్టోబర్ 14 (నంది పత్రిక):-** మహానంది మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) అధ్యక్ష పదవి రిజర్వేషన్ల ఖరారుతో స్థానిక రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈ పీఠాన్ని అన్‌రిజర్వ్‌డ్ (సాధారణ) కేటగిరీకి కేటాయించడంతో మండలంలో రాజకీయ సందడి నెలకొంది. ఈసారి రిజర్వేషన్ల పరిమితి లేకపోవడంతో, అన్ని వర్గాల వారికి పోటీ చేసే అవకాశం

# ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన..



సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో కార్యక్రమం
నిరసనకు 'లెహ్రా దో తిరంగా' పేరు
సారవ్ దాస్, అశుతోష్ రంకాల అరెస్టు నిరసనగా కార్యక్రమం
అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల
స్థానికంగా తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని ఢీప్పీ పిలుపు

2లో

# జనసేనలో చేరిన వంగవీటి రాధా..

కండువా కప్పి ఆహ్వానించిన పవన్ కల్యాణ్
విజయవాడ మేయర్ రేసులో రాధా పేరు
జనసేనలో చేరిన తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్
విజయవాడలో 35 డివిజన్లు జనసేన కోరుతున్నట్లు సమాచారం
కూటమి సీట్ల సర్దుబాటుపై కొనసాగుతున్న చర్చలు

2లో



మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారు. బుధవారం అమరావతిలోని జనసేన కేంద్ర కార్యాల యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కూడా జనసేనలో చేరారు. ఈ పరిణామంతో విజయవాడ మేయర్ అభ్యర్థిగా రాధాకృష్ణ పేరు తెరపైకి వచ్చింది.

# రియల్ హీరోలకు సన్మానం !

హుస్సేన్‌సాగర్‌లో ఆరేళ్ల బాలికను కాపాడిన ముగ్గురు
ప్రాణాలకు తెగించి చిన్నారిని రక్షించిన ఆటోడ్రైవర్ సహా ఇద్దరు పౌరులు
శాలువాలతో సత్కరించి నగదు పురస్కారాలు అందజేసిన సీపీ సజ్జనార్

2లో



ఆపదలో ఉన్న ఆరేళ్ల బాలిక ప్రాణాలను కాపాడి మానవత్వాన్ని చాటిన ముగ్గురు పౌరులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ బుధవారం సత్కరించారు. హుస్సేన్‌సాగర్‌లోకి బాలికను ఆమె తల్లి తోసివేసిన ఘటనలో.. ప్రాణాలకు తెగించి చిన్నారిని రక్షించిన ఆటోడ్రైవర్ ఫక్రుద్దీన్, కె. బాలకృష్ణ, మహమ్మద్ అఫ్సర్‌లను సజ్జనార్ అభినందించారు. వారికి శాలువాలు కప్పి నగదు పురస్కారాలు అందజేశారు.

**సమయస్ఫూర్తితో స్పందించి..** ట్యాంక్‌బండ్ రోడ్డుపై ఈ ఘటన చోటుచేసుకుంది. బాలిక కేకలు విన్న బాలకృష్ణ వెంటనే అప్రమత్తమై ఇతరులకు

# తీహార్ జైలుకు వెళ్లిన సీజేపీ నేతలకు బాసటగా రాహుల్ గాంధీ



జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన సీజేపీ నేతలకు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ
అరెస్టులను తీవ్రంగా ఖండించిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

2లో

# టీజీఎస్ఆర్టీసీలో 'దసరా' బాదుడు..!



ప్రత్యేక బస్సుల పేరిట ప్రయాణీకుల జేబులకు చిల్లులు
హైదరాబాద్ మంచిర్యాల రూట్ లో భారీ పెంపుదల
ఒక్కో టిక్కెట్ కు 230 రూపాయలు పెంచేసిన అధికారులు
ప్రయాణికుల అవసరం, ఆసరా చేసుకుని అదనపు బాదుడు
ఓ వందయితే పరవాలేదు మరీ రెండొందలా అంటున్న ప్రజలు
పేరుకే ప్రత్యేకం.. అంతా ఆర్థికంగా దండుకోవడమేనన్ విమర్శలు

2లో

# బొగ్గు పరిశ్రమలో భారీ కుంభకోణాలు




- సీబీఐ, విజిలెన్స్ విచారణ చేపట్టాలి..
- ఉత్పత్తి తగ్గడానికి కాంగ్రెస్ విధానాలే కారణం
- సైట్ విజిట్ పేరుతో అక్రమాలు..
- సింగరేణిని రక్షించే బ్రహ్మాస్త్రం కేసీఆర్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో



135 ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ భారీ కుంభకోణాలకు తెర తీశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. బుధవారం రాత్రి పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో నిర్వహించిన సింగరేణి కార్మిక సింహగర్జన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో సింగరేణి బొగ్గు ఉత్పత్తి తగ్గడంతోపాటు సంస్థకు రావాల్సిన లాభాలు, కార్మికుల హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతోందని విమర్శించారు. సింగరేణిలో రూ.10 వేల కోట్లకు పైగా కుంభకోణాలు జరిగాయని, వీటిపై సీబీఐ, విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.సింగరేణి కార్మికులు కేవలం బోనస్, హక్కుల కోసమే కాకుండా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కూడా ఉద్యమించారని నాయకులు గుర్తుచేశారు. కేసీఆర్ పిలుపుతో నిర్వహించిన సకల జనుల సమ్మెలో సింగరేణి బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయిందని, తెలంగాణ ఉద్యమంలో గోదావరిఖని ప్రాంత కార్మికుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో సింగరేణి సంస్థ మెరుగైన ప్రగతిని సాధించిందని, రైతులకు 24 గంటల విద్యుత్ అందించిన ఘనత



# కరెంట్ కోతలపై రేవంత్ రెడ్డి ఉగ్రరూపం..

పదేపదే చెప్పినా పరిస్థితి మారలేదని అధికారులపై అసహనం
నిర్లక్ష్యం చేస్తే స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జెన్కో సీఎండీని సస్పెండ్ చేస్తానని హెచ్చరిక
రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై యూకే మేయర్ల బృందంతో సీఎం చర్చలు

2లో



# బొగ్గు పరిశ్రమలో భారీ కుంభకోణాలు

తమ ప్రభుత్వానిదేనన్నారు. **రూ.10 వేల కోట్ల కుంభకోణం!** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన బావమరిది సృజన్‌రెడ్డిపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. సింగరేణి సంస్థలో టెండర్ల ప్రక్రియలో భాగంగా ప్రవేశపెట్టిన సైట్ విజిట్ విధానాన్ని అడ్డుపెట్టుకుని రూ.10 వేల కోట్లకు పైగా కుంభకోణం జరిగిందని, ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన బావమరిది సృజన్ రెడ్డి కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. టెండర్లలో అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనల ద్వారా కొందరు కాంట్రాక్టర్లకు అనుకూలంగా టెండర్ల ప్రక్రియను మార్చారని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. టెండర్ల నిబంధనల్లో మార్పులు, అంచనా వ్యయాలకు మించి కాంట్రాక్టులు కేటాయించడం వంటి అంశాలపై అనుమానాలు వ్యక్తం చేశారు. సింగరేణిలోని బొగ్గు గనులు, ఓవర్ బర్డెన్ పనులు, సౌర విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించిన టెండర్లన్నింటిపై విచారణ చేపట్టాలని కోరారు.

**బొగ్గు కొరత పేరుతో విద్యుత్ సరఫరాకు బ్రేకులు..** అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ కోతలు పెరిగాయని, బొగ్గు కొరత పేరుతో 24 గంటల విద్యుత్ సరఫరాపై సాకులు చెబుతున్నారని కేటీఆర్ విమర్శించారు. సుమారు 4,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టులో బొగ్గు సరఫరా సమస్యల కారణంగా ఉత్పత్తికి ఆటంకం కలుగుతోందని ఆరోపించారు. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు భారీగా పేరుకుపోయాయని, బొగ్గు ఎక్కడికి వెళ్తుందన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే 2023లో సింగరేణిలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగ్గా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 58 మిలియన్ టన్నులకు తగ్గిందని ఆరోపించారు. ఉత్పత్తి తగ్గడానికి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. సింగరేణిలో టెండర్ల ప్రక్రియలో సైట్ విజిట్ పేరుతో అక్రమాలు జరుగుతున్నాయని, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు టెండర్లను పలుమార్లు వాయిదా వేస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. **కార్మికుల సంక్షేమం పట్టదా..** గతంలో ప్రతి ఏడాది సింగరేణి లాభాల్లో కార్మికులకు వాటా పంపిణీ చేసేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని కేటీఆర్ ఆరోపించారు. గత రెండేళ్లలో రూ.6 వేల కోట్ల నిధులు పక్కదారి పట్టాయని విమర్శించారు. కార్మికులకు దసరా బోనస్ చెల్లింపుల విషయంలో కూడా బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని పేర్కొన్నారు. గతంలో వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించి, కేసీఆర్ హయాంలో సుమారు 16 వేల ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. సింగరేణిని కాపాడాలి..సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి ఆస్తులు, సంస్థలో ప్రభుత్వ వాటాల విషయంలో తీసుకుంటున్న నిర్ణయాలపై కార్మికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సింగరేణి సంస్థను పరిరక్షించడంతోపాటు కార్మికుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్ నాయకత్వాన్ని కార్మికులు గుర్తుంచుకోవాలని కోరారు. సింగరేణి సంస్థను బలోపేతం చేసి కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణిని ప్రైవేటుపరం చేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని, సంస్థను బతికించేందుకు ఉన్న ఏకైక బ్రహ్మాస్త్రం కె సీఆర్ అని స్పష్టం చేశారు.

# టీజీఎస్‌ఆర్టీసీలో ‘దసరా’ బాదుడు..!

టీజీఎస్ ఆర్టీసీలో దసరా బాదుడు మొదలైంది. పండుగ వాతావరణం షురూ అయ్యిందో లేదో.. ఆర్టీసీలో మాత్రం ఆర్థిక దోపిడీకి తెర తీశారు. ప్రత్యేకమనే పేరు పెట్టి ఆ బస్సుల్లో ప్రయాణించే వారి నుండి అదనపు చార్జీలు వసూలు చేస్తుండటమే దీనికంతటికి కారణం. సాధారణ చార్జీ కంటే రెండు వందలకు పైగా అదనంగా ముక్కుపిండి వసూలు చేస్తున్న ఘనత మాత్రం ఆర్టీసీ అధికారులకే దక్కుతోంది. ప్రయాణికులకు సేవలు అందిస్తున్నామన్న పేరుతో అందులో.. ప్రత్యేకమనే బోర్డు తగిలించి 2 వందల రూపాయలకు పైగా ప్రయాణికుల జేబులకు చెల్లెలు వేస్తున్నారని విమర్శలు ఈ సందర్భంగా లేకపోలేదు. నాలుగు రోజులుగా మొదలైన ఈ దండుకునే పర్వం పూర్తి వివరాల్లోకి వెళితేడ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దసరా పండగ కోలాహలం మొదలైన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోనే అతిపెద్ద తెలుగు ప్రజల అతిపెద్ద పండుగ ఈ దసరా. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపంగా జరుపుకునే బతుకు పండగ ఇది. అలాంటి పండగ సీజన్ ఆరంభం అవగానే ఆర్టీసీ ఆవురావురుమంటూ పైకి లేచింది. ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నామంటూ ఊదరగొట్టే ప్రచారానికి తెరతీసింది. ప్రత్యేకమని చేపట్టిన బస్సులకు ఒక్కొక్కరి నుండి అదనంగా వసూలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయమే ప్రయాణికుల పాలిట గుదిబండగా మారింది. హైదరాబాద్ మంచిర్యాల మార్గంలో ఒక్కో ప్రయాణీకుడి నుండి 230 రూపాయల చొప్పున టిక్కెట్ చార్జీ వసూలు చేస్తుండడం గమనార్హం. మహిళలకు పూర్తిగా ఉచితం కాగా కొద్దోగొప్పో బస్సులు ఎక్కుతున్న పురుష ప్రయాణీకులకు 230 రూపాయలు అదనంగా వసూలు చేస్తుండడం విమర్శలకు దారితీస్తోంది.

**శనివారం నుండే మొదలైన బాదుడు..!** దసరా పండగ.. ప్రయాణికులు, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకున్న ఆర్టీసీ అధికారులు ముందుగానే అప్రమత్తమయ్యారు. ప్రయాణికుల జేబులకు ఎలాగైనా చిల్లులు వేయాలని ఉద్దేశంతోటే కాబోలు ప్రత్యేక బస్సులను చేపట్టారు. పాఠశాలలు, కళాశాలలకు 10వ తేదీ నుండి దసరా సెలవులు ప్రకటించారని అలా చెవిన పడిందో లేదో ఇక ‘ప్రత్యేక’ నినాదానికి తెర తీశారు. ప్రయాణికుల రద్దీని ఆసరా చేసుకొని వారి అవసరాలు తీర్చుతున్నామనే కుంటి సాకులతో బస్సులను బూచిగా చూపెడుతున్న అధికారులు అదే సమయంలో ప్రయాణికుల జేబులకు చిల్లులు వేస్తున్నారనే సంగతి మాత్రం విస్మరించడం గమనించదగ్గ విషయం. గతంలో మంచిర్యాల నుండి హైదరాబాదు వెళ్లడానికి 500 రూపాయలు ఉన్న బస్సు టికెట్ చార్జికి ఇపుడు అదనంగా 230 రూపాయలు పెంచడం విశేషం. ఈ ధరలను కూడా సరిగ్గా పిల్లలకు సెలవు దినాలుగా ప్రకటించిన రోజు అంటే ఈనెల 10వ తేదీ శనివారం నుండి ఆర్టీసీ ఈ బాదుడు మొదలవడం గమనార్హం.

# కరెంట్ కోతలపై రేవంత్ రెడ్డి ఉగ్రరూపం..

తెలంగాణలో తరచూ తలెత్తుతున్న విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల పనితీరుపై ఆయన నిప్పులు చెరిగారు. ఎన్నిసార్లు ఆదేశాలు ఇచ్చినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సీఎం, అధికారులు తమ తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని, ఉన్నతస్థాయి అధికారులను సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడబోనని గట్టి హెచ్చరిక జారీ చేశారు. బుధవారం విద్యుత్ సరఫరా పరిస్థితిపై సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి, అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. భవిష్యత్తులో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ, ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు పూర్తిస్థాయిలో లింకేజీలు ఉన్నప్పటికీ, విద్యుత్ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో ఎందుకు జరగడం లేదని నిలదీశారు. “పదేపదే చెప్పినా మీలో చలనం రావడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? ఇదే నిర్లక్ష్యం కొనసాగితే ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ చీఫ్ సెక్రటరీ), జెన్‌కో సీఎండీ సహా ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు“ అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. విద్యుత్ కోతలకు గల కారణాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలని, సరఫరాను సాధారణ స్థితికి తెచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

**యూకే మేయర్లతో సీఎం భేటీ** అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మేయర్ల ప్రతినిధి బృందం కలిసింది. ఈ సమావేశంలో తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా హెల్త్‌కేర్, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్స్‌టైల్స్, పరిశోధన, తయారీ రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను సీఎం వారికి వివరించారు. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార అనుకూల వాతావరణం ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా “యూకే-ఇండియా సీఈటీఏ అండ్ రీజనల్ సినర్జీస్“ అనే అంశంపై యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన నివేదికను సీఎం ఆవిష్కరించారు. అనంతరం, డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న “ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026“కు హాజరు కావాల్సిందిగా యూకే ప్రతినిధులను ఆయన సాదరంగా ఆహ్వానించారు.

# ఢిల్లీలో అక్టోబర్ 16న ‘తిరంగా’ నిరసన..

తమ పార్టీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 16న ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో త్రివర్ణ పతాక ప్రదర్శన నిర్వహించనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. దేశభక్తులంతా జాతీయ జెండాలతో సెంట్రల్ పార్క్‌కు రావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదిక ‘ఎక్స్’లో విడుదల చేసిన వీడియో సందేశంలో ఈ నిరసనకు ‘లెహ్రావో దో తిరంగా’ అని పేరు పెట్టినట్లు దీప్కే తెలిపారు. కేవలం త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకే సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను జైలుకు పంపారని ఆయన ఆరోపించారు. అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌కు జాతీయ జెండాలతో చేరుకోవాలని కోరారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం నేరం కాదని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెబుతామని అన్నారు. ఢిల్లీకి రాలేని వారు తమ ప్రాంతాల్లో తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే విజ్ఞప్తి చేశారు. జాతీయ జెండా తమ గర్వకారణమని, దాన్ని ప్రదర్శించడం నేరం కాదనే సందేశాన్ని అందించాలని కోరారు. ఈ నిరసన తర్వాత తనను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని, అయినా ఆందోళన చెందడం లేదని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తానని స్పష్టం చేశారు.

**ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ** మరోవైపు, జంతర్ మంతర్‌లోకి అక్రమంగా ప్రవేశించిన కేసులో సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలకు బుధవారం ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. సీజేపీకి చెందిన మరో నేత అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. దాస్‌ను తీహార్ జైలులోని రెండో నంబర్ జైలులో, రంకాను నాలుగో నంబర్ జైలులో వేర్వేరుగా ఉంచినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. ముగ్గురు సీజేపీ సభ్యులను జంతర్ మంతర్‌లోకి చొరబడినందుకు ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు. జంతర్ మంతర్‌ను నిరసనలకు కేటాయించిన అధికారిక ప్రదేశాల జాబితా నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

# తీహార్ జైలుకు వెళ్లిన సీజేపీ నేతలకు బాసటగా రాహుల్ గాంధీ

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపినందుకు అరెస్టయిన కాక్‌రోచ్ జనతా పార్టీ (జక్రూ) నేతలకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మద్దతుగా నిలిచారు. శాంతియుతంగా నిరసన తెలుపుతూ జాతీయ జెండాను ఎగురవేయడం నేరం కాదని, ఇందుకోసం యువతను జైల్లో పెట్టడం పిరికిపంద చర్య అని ఆయన తీవ్రంగా విమర్శించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ... నిరసన ప్రదేశం కాదని ఇటీవల ప్రకటించిన జంతర్ మంతర్‌లోకి ప్రవేశించారనే ఆరోపణలపై సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు నిన్న అదుపులోకి తీసుకున్నారు. ఈ ఉదయం వారిని కోర్టులో హాజరుపరచగా... న్యాయస్థానం వారికి ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. గతంలో ఒకసారి అరెస్టయి, శాంతి ఒప్పందం (పీస్ బాండ్)పై సంతకం చేసి విడుదలైన వీరు... ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించినందున కస్టడీకి పంపినట్లు పోలీసులు తెలిపారు. వీరితో పాటు అరెస్టయిన అజింక్యా షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. ఈ అరెస్టులపై రాహుల్ గాంధీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. “జంతర్ మంతర్ భారత ప్రజలది. దానిని మేం తిరిగి స్వాధీనం చేసుకుంటాం. విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, ఇండియా కూటమి.. అందరిదీ ఒకే లక్ష్యం. అదే పౌరుల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ“ అని పేర్కొన్నారు. రాహుల్‌తో పాటు అరవింద్ కేజ్రీవాల్, ఎంకే స్టాలిన్, అభిషేక్ బెనర్జీ, ఆదిత్య ఠాకరే వంటి పలువురు విపక్ష నేతలు కూడా ఈ అరెస్టులను ఖండించారు. తమకు మద్దతు ప్రకటించినందుకు రాహుల్ గాంధీకి సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ధన్యవాదాలు తెలిపారు.

# రైతన్నలకేనా, రైతక్కలకేవీ హక్కులు?

గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న మహిళల్లో దాదాపు 80శాతం మంది వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపైనే ఆధారపడి బతుకుతున్నారు. కానీ, వారి పేరు మీద భూమి లేకపోవడం వల్ల వారికి రైతులుగా గుర్తింపు లేదు, హక్కులు లేవు. పంటల ఉత్పత్తి నుంచి ఆహార పదార్థాల శుద్ధి, తయారీ, పంపిణీ వరకు మహిళల శ్రమ వారి కుటుంబాలకు, సమాజాలకు, మొత్తం ప్రపంచానికి ఆహారాన్ని అందిస్తోంది. అయినప్పటికీ వారికి పురుషులతో సమానమైన గుర్తింపు, అధికారం లేదు. ఫలితంగా, వారు తక్కువ ఆదాయాన్ని పొందుతూ, తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. మొదటి అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవాన్ని 1995 అక్టోబర్ 15న ‘ఉమెన్స్ వరల్డ్ సమ్మిట్ ఫౌండేషన్’ రూపకల్పన చేసి నిర్వహించింది. ఆ తర్వాత 2007 డిసెంబర్ 18న ఐక్యరాజ్యసమితి ఈ తేదీని గ్రామీణ మహిళా దినోత్సవంగా గుర్తించింది. మన దేశంలో మహిళా రైతుల హక్కుల వేదిక (మకాం) చేసిన కృషి ఫలితంగా 2017లో అక్టోబర్ 15వ తేదీని ‘మహిళా రైతుల దినోత్సవం’గా ప్రకటించి, దీనిని దేశవ్యాప్తంగా జరుపుకోవాలని మన కేంద్ర వ్యవసాయ మంత్రి ఆదేశాలు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ కార్యకలాపాల్లో పాల్గొంటున్న మహిళలకు రైతులుగా గుర్తింపు లేదు. తాజా వ్యవసాయ జనాభా లెక్కల ప్రకారం జాతీయ స్థాయిలో మహిళలు మొత్తం సాగు విస్తీర్ణంలో 12శాతం భూమిని మాత్రమే కలిగి ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇది 20 నుంచి 22శాతం వరకు ఉండవచ్చునని క్షేత్రస్థాయి అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. తెలంగాణ స్టాటిస్టికల్ ఇయర్ బుక్ 2020 ప్రకారం రాష్ట్రంలో ఉన్న మొత్తం 57,81,888 మంది రైతులలో 40,46,969 మంది రైతులు (అంటే 71శాతం) 2.47 ఎకరాల (ఒక హెక్టారు) కంటే తక్కువ భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులే. వారిలో అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీలు. రాష్ట్రంలో వ్యవసాయంపై ఆధారపడిన గ్రామీణ కుటుంబాలలో 30శాతం మంది దగ్గర ఎటువంటి భూమి లేదు. ఎస్సీ సామాజిక వర్గం చేతిలో 9శాతం, ఎస్టీలు 13శాతం, బీసీలకు 47శాతం భూమి ఉంది. అంటే రాష్ట్ర జనాభాలో 15శాతం కంటే తక్కువగా ఉన్న ఓసీలకు 31శాతం భూమి ఉంది! ఓసీలలో అధిక శాతం వ్యవసాయం చేయరు. వారు వాణిజ్య, రాజకీయ రంగాలలో ప్రబలంగా ఉన్నారు. ఇలా వ్యవసాయం చేయని వారి దగ్గర వందల ఎకరాల భూమి పోగుపడి ఉండగా, అసలు సాగుదారులు, కౌలుదారులు, వ్యవసాయంపై ఆధారపడిన మహిళలు, వ్యవసాయ కూలీలకు భూమి చాలా తక్కువగా ఉంది. ఆ ఆదాయం వారి బతుకుదెరువుకు సరిపోక వేతన కూలీలుగా మారి, యాంత్రీకరణ, మోనో క్రాపింగ్ తదితర కారణాల వల్ల పని అందుబాటు తగ్గిపోవటం వల్ల నిత్యం ఉపాధి వెతుక్కోవలసిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. పంటలు సాగు చేయని భూమి యజమానులను మాత్రమే అధికారికంగా రైతులుగా గుర్తించటమూ, వ్యవసాయం కోసం శ్రమనంతా ధారపోస్తున్న వారిని మాత్రం రైతులుగా గుర్తించకపోవటమూ అన్యాయం. ఈ విధానం మారాలి. సాగుదారులు, మహిళా రైతులు, కౌలు రైతులు వ్యవస్థాగత రుణాలు అందక, అధిక వడ్డీలకు ప్రయివేటు అప్పులు తెచ్చి, పెట్టుబడి పెట్టి, పంట నష్టాలను భరించి సాగు చేస్తుంటే, ఈ కష్టమేమీ పడకుండా విత్తనాలు, ఎరువుల సబ్సిడీలు, పంట నష్టపరిహారం మొదలైనవన్నీ రికార్డులలో భూమి ఉన్న రైతులు మాత్రమే పొందుతున్నారు. ఇదెక్కడి న్యాయం?వ్యవసాయంలో కీలకపాత్ర పోషిస్తూ ప్రపంచ ఆహార ఉత్పత్తిలో దాదాపు 80శాతం దోహదం చేస్తున్న మహిళలకు రైతులుగా గుర్తింపు లేదు. ఆహార/ వస్తు ఉత్పత్తిలోనూ సామాజిక ఉత్పత్తిలోనూ ప్రధాన భాగస్వామిగా ఉన్న మహిళలకు భూమి వంటి సహజ వనరులపై అధికారం/హక్కులు లేవు. వ్యక్తిగత జీవితంలోనూ, కుటుంబంలోనూ వ్యవసాయంలోనూ నిర్ణయాధికారం లేదు. ఈ పరిస్థితిని సరిదిద్దటానికి ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరాన్ని ‘అంతర్జాతీయ మహిళా రైతుల సంవత్సరం’గా ప్రకటించింది. వ్యవసాయ రంగంలో మహిళలకు మద్దతుగా విధానాలలో సంస్కరణలను తేవడానికి, ఈ అంశంపై అందరిలో అవగాహనను పెంచడానికి ఇది ఒక కీలక అవకాశాన్ని కల్పిస్తుంది. మహిళా రైతుల హక్కుల వేదిక, ఎం.ఎస్.స్వామినాథన్ ఫౌండేషన్ కలిసి చేసిన నిరంతర కృషి ఫలితంగా 2026 జూలై మొదటి వారంలో ‘మహారాష్ట్ర మహిళా రైతుల సాధికారత చట్టం 2026’ను మహారాష్ట్ర అసెంబ్లీ ఆమోదించింది. ఈ చట్టం ప్రాథమిక ఉద్దేశం మహిళా రైతులకు చట్టపరమైన గుర్తింపును కల్పించటం. ఈ గుర్తింపు వారికి వివిధ ప్రభుత్వ పథకాలు, సామాజిక భద్రతా ప్రయోజనాలను పొందేందుకు వీలు కల్పిస్తుంది. తెలంగాణ రాష్ట్రం కూడా ఈ దిశగా అడుగు వేస్తే వ్యవసాయంలో నిమగ్నమైన గ్రామీణ మహిళలకు సాధికారత కల్పించగలం. ఈ అంతర్జాతీయ మహిళా రైతుల సంవత్సరంలో, గ్రామీణ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం, మొత్తం సమాజం ఈ దిశగా ఆలోచన మొదలుపెట్టాలి.

# మహానందిలో పెరిగిన రాజకీయ వేడి...!

లభించింది. దీనితో పదవిని ఆశిస్తున్న ఆశావాహుల సంఖ్య భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. ప్రధాన పార్టీలకు చెందిన సీనియర్ నేతలు, సామాజికంగా బలం ఉన్న అభ్యర్థులు ఈ ప్రతిష్టాత్మక పీఠాన్ని దక్కించుకోవడానికి ఇప్పటి నుంచే ముమ్మర ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అన్ని వర్గాలకూ అవకాశం ఉండటంతో ఈసారి పోటీ ఊహించని స్థాయిలో ఉండబోతోందని స్థానిక విశ్లేషకులు భావిస్తున్నారు. తీవ్ర ఉత్కంఠ రేపుతున్న ఈ ‘మహానంది ఎంపీపీ’ పీఠం ఎవరిని వరిస్తుందనేది మరికొద్ది రోజుల్లో స్పష్టం కానుంది..

**బీసీ మహిళకు జడ్పీటీసీ..** మరోవైపు, మహానంది మండల జడ్పీటీసీ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించారు. జడ్పీటీసీ స్థానం బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో, ఆయా పార్టీలలోని బలమైన బీసీ సామాజికవర్గ మహిళా నేతలు టికెట్ వేటలో పడ్డారు. అటు ఎంపీపీ సాధారణం కావడం, ఇటు జడ్పీటీసీ బీసీ మహిళకు దక్కడంతో మహానంది మండలంలో సరికొత్త రాజకీయ సమీకరణలు మొదలయ్యాయి..

# మోగిన నగారా!

నోటిఫికేషన్లు, షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఏపీఎస్ఈసీ) జారీ చేసింది. అయితే జిల్లాలో ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా, శ్రీకాకుళం కార్పొరేషన్, ఆమదాలవలస పురపాలక సంఘంలో ఎన్నికలకు బ్రేక్ వేసింది. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగిసే వరకూ ఈ కోడ్ అమలులో ఉంటుంది.

**అటు సందడి.. ఇటు నిరాశ** తాజా షెడ్యూల్ ప్రకారం జిల్లాలో ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇచ్ఛాపురంలో 28 వార్డులకు, పలాస-కాశీబుగ్గలో 36 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే, శ్రీకాకుళం కార్పొరేషన్, ఆమదాలవలస మున్సిపాలిటీకి సంబంధించి ముందస్తు ప్రక్రియ ఇంకా పూర్తి కానందున, ఈ రెండుచోట్ల ప్రస్తుతానికి ఎన్నికలు నిర్వహించడం లేదని ఈసీ స్పష్టం చేసింది. దీంతో ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘాల్లో సందడి నెలకొనగా, శ్రీకాకుళం, ఆమదాలవలస వాసుల్లో నిరాశ అలముకుంది.

**మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్..**

- అక్టోబరు 16 (శుక్రవారం): ఎన్నికల అధికారి ద్వారా వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రదర్శన, ఎన్నికల నోటీసు జారీ చేస్తారు. ఇదే రోజు ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది.
- 18న నామినేషన్ల దాఖలకు చివరి తేదీ. మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే.
- 19న నామినేషన్ల పరిశీలన (ఉదయం 11 గంటల నుంచి)
- 21న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ. పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ (మధ్యాహ్నం 3 గంటల తర్వాత)
- 28న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహణ.
- 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన
- నవంబరు 5 లేదా 6న మున్సిపల్ ఛైర్‌పర్సన్లను ఎన్నుకునే పరోక్ష ఎన్నికలు

**మూడు దశల్లో పంచాయతీ పోరు..** పట్టణ స్థానిక సంస్థలతో పాటు గ్రామీణ ప్రాంత ఎన్నికలకు కూడా ఎలక్షన్ కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 910 గ్రామ పంచాయతీలు, 538 ఎంపీటీసీ స్థానాలకు నవంబరులోనే ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. జిల్లాలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ఒకే విడతలో (సింగిల్ ఫేజ్) నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఈ నెల 19న నోటిఫికేషన్ వెలువడనుంది. నవంబరు 3న పోలింగ్ నిర్వహించి 5న ఫలితాలు ప్రకటిస్తారు.

- జిల్లాలోని 910 గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో పోలింగ్ జరగనుంది.
- మొదటి దశ : నవంబరు 13న నోటిఫికేషన్ విడుదల, 26న పోలింగ్, కౌంటింగ్.
- రెండో దశ : నవంబరు 16న నోటిఫికేషన్ విడుదల, 29న పోలింగ్, కౌంటింగ్.
- మూడో దశ : నవంబరు 19న నోటిఫికేషన్ విడుదల, డిసెంబరు 2న పోలింగ్, కౌంటింగ్.

# జనసేనలో చేరిన వంగవీటి రాధా..

విజయవాడ మేయర్ పదవికి రాధాకృష్ణ పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, మేయర్ సీటును కూటమిలో జనసేనకు కేటాయిస్తారా? అన్నది ఇంకా స్పష్టం కాలేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి రాధాకృష్ణ కృషి చేశారు. వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత టీడీపీతో కలిసి పనిచేస్తూ వచ్చారు. ఇప్పుడు జనసేనలో చేరడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. మరోవైపు, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, జడ్పీ ఛైర్మన్ల పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఇప్పటికే గెజిట్‌లు విడుదల చేసింది. ఈ తరుణంలో రాధా చేరికకు ప్రాధాన్యం ఏర్పడింది. స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై కూటమి నేతలు చర్చలు జరుపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో జనసేన నేతలు నాదెండ్ల మనోహర్, లింగమనేని రమేశ్, హరిప్రసాద్ సమావేశమయ్యారు. విజయవాడలోని 86 డివిజన్లలో 35 స్థానాలు తమకు కేటాయించాలని జనసేన కోరుతున్నట్లు సమాచారం. అయితే, 15 స్థానాలు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సీట్ల పంపకాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

# రియల్ హీరోలకు సన్మానం !

సమాచారం అందించారు. దీంతో ఆటోడ్రైవర్ ఫక్రుద్దీన్, వ్యాపారవేత్త మహమ్మద్ అఫ్సర్ ఏమాత్రం వెనుకాడకుండా హుస్సేన్‌సాగర్‌లోకి దూకి చిన్నారిని ప్రాణాలతో బయటకు తీసుకొచ్చారు. అనంతరం బాలికను చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

**వీడియోలు తీయడం కాదు.. సాయం చేయాలి** ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారిని కాపాడేందుకు ముగ్గురు పౌరులు చూపిన ధైర్యసాహసాలు, మానవతా దృక్పథం సమాజానికి ఆదర్శమని కొనియాడారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మొబైల్ ఫోన్లలో వీడియోలు తీయడానికే పరిమితం కాకుండా.. బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని సూచించారు. బాలకృష్ణ సమయస్ఫూర్తి, ఫక్రుద్దీన్, అఫ్సర్‌ల సాహసం వల్ల చిన్నారి ప్రాణాలు నిలిచాయని ప్రశంసించారు. మరోవైపు, బాలికను హుస్సేన్‌సాగర్‌లోకి తోసివేసిన ఆరోపణలపై దోమల్‌గూడ పోలీసులు ఆమె తల్లిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వివేకా హత్య కేసు.. ఈడీ విచారణకు హాజరైన వైఎస్ అవినాశ్ రెడ్డి

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ ఆరోపణలపై వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి ఈరోజు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో ఆయన అధికారుల ఎదుట హాజరయ్యారు. ఈ కేసులో ఆర్థిక లావాదేవీల కోణంలో ఈడీ అధికారులు ఆయన్ను ప్రశ్నిస్తున్నారు.

## మనసులను శాసించే స్థాయికి ఏఐ చేరితే..?

మానవ చరిత్రలో ఎన్నడూ లేనంతగా నేడు ప్రపంచం సాంకేతికత ద్వారా అనుసంధానమైంది. చేతిలోని స్మార్ట్‌ఫోన్‌తో ప్రపంచంలో ఎక్కడి వ్యక్తితోనైనా క్షణాల్లో మాట్లాడవచ్చు. కానీ విచిత్రమేమిటంటే, ఇదే కాలంలో డిజిటల్ అనుసంధానాల మధ్య ఒంటరితనం కూడా పెరుగుతోంది. ఈ మానసిక శూన్యతను ఆసరాగా చేసుకుని ఓ కొత్త సాన్నిహిత్యం ముందుకొస్తోంది. అదే ఏఐ సహచరి (ూ× జశీఎజూ్ఱఅఱశీఅ). ఈ సహచరి మనిషి ఒంటరితనానికి పరిష్కారమా, లేక మనిషికి మనిషి అవసరాన్ని క్రమంగా తగ్గించే కొత్త బంధమా? **మేడిగడ్డ ఏడో బ్లాకు కూల్చి.. మళ్లీ కట్టాల్సిందే** ఏ ఇద్దరి మధ్య బంధమైనా నిలవాలంటే ఓపిక, త్యాగం, సర్దుబాటు అవసరం. మన ఆలోచనలు ఎదుటివారి ముందు ఉంచడం, వారి అభిప్రాయాలతో విభేదిస్తూనే వారిని అర్థం చేసుకోవడం ఇదే మానవ సంబంధాల ప్రాథమిక సూత్రం. ఇక్కడ కోపాలు, అసంతృప్తులు, ఘర్షణలు, సంతోషాలు అన్నీ ఉంటాయి. కానీ ఈ చాట్‌బాట్‌లు అందించే ‘కల్పిత ప్రేమ’లో ఈ కష్టాలు కనిపించవు. అది మిమ్మల్ని ప్రశ్నించదు. మీ తప్పులను వేలెత్తి చూపదు.

# రావుస్ నూతన ఐఐటీ - జేఈఈ / నీట్ క్యాంపస్‌ను ప్రారంభించిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి






**విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులతో నాణ్యమైన విద్యనందించడం అభినందనీయం: మంత్రి ఫరూక్**

**లాభాపేక్ష లేకుండా పేద, మధ్యతరగతి విద్యార్థులకు సేవ చేస్తున్న అప్పారావు : మంత్రి ఫరూక్**

**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 14 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో అత్యాధునిక వసతులతో నూతనంగా నిర్మించిన “రావుస్ ఐఐటీ – జేఈఈ / నీట్ క్యాంపస్“ భవనాన్ని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీమతి బైరెడ్డి శబరి మరియు టీడీపీ నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ గార్లు ఘనంగా ప్రారంభించారు. కళాశాల చైర్మన్ ఏ.ఎం.వి. అప్పారావు గారి అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి ఎన్.ఎండి. ఫరూక్ మాట్లాడుతూ అప్పారావు గత 30 సంవత్సరాలుగా నాకు సుపరిచితులు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ నంద్యాల మరియు పరిసర ప్రాంత విద్యార్థుల కోసం పట్టణ నడిబొడ్డున అత్యున్నత ప్రమాణాలతో నూతన భవనాన్ని నిర్మించడం ఎంతో హర్షనీయమన్నారు . నంద్యాల విద్యా రంగానికి అప్పారావు ఒక ఆణిముత్యం లాంటివారని . మా బంధువుల పిల్లలు కూడా ఇక్కడే చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నారని తెలిపారు . విద్యార్థులకు చక్కటి భవిష్యత్తును అందిస్తున్న అప్పారావు ని, డైరెక్టర్ మోని చంద్ర ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను“ అని తెలిపారు .ఈ సందర్భంగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాలలో నాలుగు జూనియర్ కళాశాలలను సమర్థవంతంగా నిర్వహిస్తూ అప్పారావు అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని ప్రశంసించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఏఎంవి అప్పారావు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా స్థానిక విద్యార్థులకు మెరుగైన వసతులు అందించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు సౌండ్ పొల్యూషన్ లేకుండా ప్రశాంతంగా చదువుకునేందుకు పద్మావతి నగర్ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఏసీ రూమ్‌లు, అత్యాధునిక ల్యాబ్‌లు, రీడింగ్ రూమ్స్, లైబ్రరీ మరియు కంప్యూటర్ ల్యాబ్ వంటి సకల సదుపాయాలు కల్పించామని వివరించారు. స్థానిక విద్యార్థులు హైదరాబాద్, విజయవాడ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లి లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా, ఇక్కడే మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో జాతీయ స్థాయి అధ్యాపక బృందంతో ఐఐటీ – జేఈఈ / నీట్ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ఈ విద్యా సంవత్సరం నుంచి “శ్రీ చైతన్య ఇన్ఫినిటీ లెర్న్ (ఇన్ఫినిటీ లెర్న్ )“ ప్రోగ్రామ్ ద్వారా ప్రామాణికమైన స్టడీ మెటీరియల్, ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శులు రామచంద్రరావు, ఏవిఆర్ ప్రసాద్ , జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ రెడ్డి, సెంట్రల్ ఫుడ్ కమిటీ మెంబర్ విశ్వనాథరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రొడ్డా సుంకయ్య, అధ్యాపకులు సంగమేశ్వరయ్య, జగదీష్, నారాయణస్వామి, సుబ్రహ్మణ్యం తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో అధ్యాపక బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా పరిషత్ నూతన సీఈఓగా శివశంకర్



**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 14 ( నంది పత్రిక )** నంద్యాల జిల్లా పరిషత్ నూతన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా శివశంకర్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు కీలక దశలో ఉన్న నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. నూతన సీఈఓగా బాధ్యతలు చేపట్టిన శివశంకర్‌కు జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

# నూతన గృహప్రవేశ వేడుకకు ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి




**డోన్ నంది పత్రిక అక్టోబర్ 14** సంగారెడ్డిలో చంద్రపల్లె ఆనందరెడ్డి నిర్వహించిన నూతన గృహప్రవేశ వేడుకకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఆపాఋణజూ) చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెట్టిన ఆనందరెడ్డి కుటుంబ సభ్యులను ఆయన ఆత్మీయంగా పలకరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన గృహప్రవేశం సందర్భంగా నిర్వహించిన వేడుకలో పాల్గొన్న ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి, ఆనందరెడ్డి కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ఆప్యాయంగా ముచ్చటించారు. నూతన గృహంలోకి అడుగుపెట్టడం ప్రతి కుటుంబానికి ఎంతో ఆనందదాయకమైన సందర్భమని పేర్కొంటూ, ఈ శుభవేళ కుటుంబ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆనందరెడ్డి కుటుంబం నూతన గృహంలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఆ ఇంట్లో ఎల్లప్పుడూ శాంతి, సంతోషాలు వెల్లివిరియాలని, కుటుంబ సభ్యుల మధ్య అనురాగం, ఆప్యాయతలు మరింత పెంపొందాలని కోరుకున్నారు. నూతన గృహం కుటుంబ అభివృద్ధికి, ఆనందకరమైన భవిష్యత్తుకు వేదిక కావాలని ఆకాంక్షించారు.కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో గృహప్రవేశ వేడుక ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. ఆహ్వానం మేరకు వేడుకకు హాజరైన ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేయడంతో కార్యక్రమంలో ప్రత్యేక సందడి నెలకొంది. ఆయన రాకతో వేడుకకు మరింత ప్రత్యేకత చేకూరింది. కావాలంటే ఇదే వార్తను ఆంధ్రప్రభ పత్రికా శైలిలో మరింత బలమైన శీర్షికతో కూడా రూపొందించవచ్చు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలి





**మంత్రులు పయ్యావుల కేశవ్, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్థన్ రెడ్డి పిలుపు**

**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 14 ( నంది పత్రిక )** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణంలోని జయంత వెజ్ వరల్డ్ నందు స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై ముఖ్య నాయకుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నంద్యాల జిల్లా ఇంచార్జి మంత్రి పయ్యావుల కేశవ్, నంద్యాల జిల్లా స్థానిక సంస్థల టీడీపీ పరిశీలకులు ప్రభాకర్ చౌదరి, రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్థన్ రెడ్డి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కూటమి భాగస్వామ్య పక్షాల కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి స్థానిక సంస్థల్లో తిరుగులేని విజయం సాధించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి (టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలు) , భూమా అఖిలప్రియ రెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, గీతా జయ సూర్య, యువ నాయకులు ఎన్ఎండీ ఫిరోజ్, భూమా విఖ్యాత్ రెడ్డిలతో పాటు పలువురు కూటమి ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి ఆదేశిస్తే

## జెడ్పీటిసి అభ్యర్థిగా పోటీకి సై అంటున్న “ బిజ్జం“

**బండి ఆత్మకూరు నంది పత్రిక అక్టోబర్ 14:** బండి ఆత్మకూరు మండలంలో త్వరలో జరగబోతున్న ఎన్నికలకు సంబంధించి జడ్పీటిసి అభ్యర్థిగా పోటీ చేసేందుకు బిజ్జం సుబ్బారెడ్డి ఉత్సాహం కనబరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఆదేశిస్తే అభ్యర్థిగా పోటీ చేసేందుకు బిజ్జం సుబ్బారెడ్డి నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. బండి ఆత్మకూరు మండలంలో దాదాపు 30 సంవత్సరాలు గా విద్యాసంస్థలు నడుపుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలతో విజయం సుబ్బారెడ్డికి సన్నిహిత సంబంధాలు మెండుగా ఉన్నాయి. 2008వ సంవత్సరం నుండి భారతీయ జనతా పార్టీలో ప్రవేశించి కర్నూలు జిల్లాలో క్రియాశీలక సభ్యుడుగా ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. ప్రస్తుతం నంద్యాల జిల్లా బిజెపి కిషన్ మోర్చా అధ్యక్షులుగా, నంద్యాల జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షులుగా బిజ్జం సుబ్బారెడ్డి పనిచేస్తున్నారు. జిల్లాలో వికలాంగులకు చేయూతనిస్తూ పలు సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారు. జిల్లా బిజెపి కిసాన్ మోర్చా అధ్యక్షులుగా పనిచేస్తూ గ్రామాలలో భారతీయ జనతా పార్టీ కార్యవర్గం ఏర్పాటు విషయంలో తనదైన పాత్ర పోషిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో పనిచేస్తున్న బిజ్జం సుబ్బారెడ్డి కి శ్రీశైలం శాసనసభ్యుడు బుడ్డా రాజశేఖర్ రెడ్డి తో తోపాటు జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అభిరుచి మధుతో కూడా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అటు పార్టీలో పని చేస్తూ, మరోవైపు ప్రజా సంక్షేమం కార్యక్రమాలలో పాల్గొంటున్న బిజ్జం చురుకైన పాత్రను పోషిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నాయకులు తనను ఆశీర్వదిస్తే రాబోవు జడ్పీటిసి ఎన్నికలలో కూటమి అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు. బిజ్జంకు జెడ్పీటిసి అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే విజయవకాశాలు మెండుగా ఉంటాయని పార్టీ సన్నిహితులు శ్రేయోభిలాషులు కోరుకుంటున్నారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూద్దాం!



# రైతులు, కూలీలు, కార్మికులను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 26 నుండి దేశవ్యాప్తంగా జరుగు ఉద్యమాన్ని జయప్రదం

**సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు.**



**నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 14 . (నంది పత్రిక ):** సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతాంగం పండించిన పంటలకు మద్దతు ధర లు స్వామినాథన్ కమీషన్ సూచించిన విధంగా నిర్ణయించి, పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని ఢిల్లీ కేంద్రంలో రైతాంగం చేసిన పోరాటం సందర్భంగా ప్రధాని మోడీ ఇచ్చిన హామీలన్నీ ఏ ఒక్కటి అమలు ఇప్పటివరకు అమలు జరగలేదు. అంతేకాకుండారైతులకు నష్టదాయకమైన విద్యుత్ మరియు విత్తన, మార్కెట్ చట్టాలను తీసుకురావడం, కార్మిక వర్గానికి నష్టదాయకమైన లేబర్ కోడ్ లను అమలు పరచడం, కూలీలకు నష్టదాయకమైన ఉపాధి హామీ పథకంలో మార్పులు తీసుకురావటం మొదలగు అంశాలన్నింటినీ వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా రైతు, కార్మిక ,వ్యవసాయ కార్మిక సంఘాలన్నీ నవంబర్ 26 నుండి ప10 రోజులపాటు నిరవధికంగా దేశంలోని 100 ప్రధాన కేంద్రాలలో నిరవధిక ఆందోళనను నిర్వహించబోతున్నారు. అందుకు సన్నాహకమైన సమావేశం నాధుని నరసింహయ్య భవన్లో జరిగినది. . ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి. రామచంద్రుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మోడీ ఢిల్లీ ఉద్యమంలో రైతాంగానికి ఇచ్చినటువంటి హామీలు ఐదు సంవత్సరాలు పూర్తి అవుతున్న కూడా ఏ ఒక్కటి అమలు జరపకపోగా రైతాంగానికి అవసరమైన అన్ని రకాల విత్తనాలు ఎరువులు పురుగుమందుల ధరలు అన్నిటిని విపరీతంగా పెంచేశారు. తమకు ఉన్న అధికారాన్ని ఉపయోగించుకొని రైతులకు నష్టదాయకమైన కార్పొరేట్లకు మేలు చేకూర్చే విత్తన చట్టం, విద్యుత్ చట్టం, వ్యవసాయ మార్కెట్ కమిటీలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం, ఎలాంటి షరతులు, సుంకాలు లేకుండా అమెరికా దేశం నుండి పత్తి, మొక్కజొన్నలు, పండ్లు, పాలు మొదలగు ఉత్పత్తులను దిగుమతి చేసుకొని మన దేశ రైతాంగ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేకుండా చేశాడు. పేద ,మధ్యతరగతి రైతులు మరియు వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పిస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకంలో మార్పులు తీసుకువచ్చి కూలీల ఉపాధి లేకుండా చేస్తున్నాడు. కార్మికులకు ఇవ్వాల్సిన కనీస వేతన చట్టం 26 వేల రూపాయలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారు. ఉన్న పరిశ్రమలన్నింటినీ మూసివేస్తూ, ప్రైవేటు వాళ్ళ కు అప్పగిస్తూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మికచట్టాలను కాల రాస్తున్నారు. దేశవ్యాప్తంగా కార్మిక కర్షక , ప్రజాసంఘాలన్నింటినీ ఐక్యం చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా మరియు కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 26వ తేదీ నుండి నిరవధికంగా దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చారని, జిల్లాలోని అన్ని పక్షాలు మీ ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్మిక సంఘాల నాయకులు, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు యేసు రత్నం, సిపిఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, రైతు సంఘాల జిల్లా కార్యదర్శి సోమన్న, సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ. రాజశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహుడు ,సుధాకర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ నాయక్, సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మణ్, బాల వెంకట్, గౌస్, వెంకట లింగం, సీనియర్ నాయకులు తోట ముద్దులు తదితరులు పాల్గొన్నారు.

# మీరట్ బ్లూ డ్రమ్ హత్య కేసులో సంచలన తీర్పు.. భార్య, ప్రియుడికి మరణశిక్ష!

ఉత్తరప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మీరట్ బ్లూ డ్రమ్ హత్య కేసులో కీలక తీర్పు వెలువడింది. నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్‌ను హత్య చేసిన కేసులో ఆయన భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాకు స్థానిక కోర్టు మరణశిక్ష విధించింది. 126 విచారణల తర్వాత 22 మంది సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పు ఇచ్చింది.2025 మార్చి 3న ముస్కాన్ తన భర్తకు ఆహారంలో మత్తుమందు కలిపి ఇచ్చిందని, ఆ తర్వాత సాహిల్‌తో కలిసి కత్తితో పొడిచి హత్య చేసినట్లు ప్రాసిక్యూషన్ వెల్లడించింది. అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా చేసి, ఇసుక, నీరు, సిమెంట్‌తో నింపిన నీలిరంగు ప్లాస్టిక్ డ్రమ్‌లో దాచినట్లు దర్యాప్తులో తేలింది. హత్య జరిగిన మరుసటి రోజు ఇద్దరూ హిమాచల్‌ప్రదేశ్‌కు వెళ్లిపోయారు. సౌరభ్ బతికే ఉన్నట్లు నమ్మించేందుకు ముస్కాన్ ఆయన ఫోన్ నుంచి కుటుంబ సభ్యులకు సందేశాలు పంపినట్లు పోలీసులు గుర్తించారు. మార్చి 17న బంధువులు అనుమానంతో అధికారులతో కలిసి ఇంటికి వెళ్లగా డ్రమ్‌లో సౌరభ్ మృతదేహం బయటపడింది. అనంతరం పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. డ్రమ్, సిమెంట్, ఇసుక, కత్తులు కొనుగోలు చేసిన దుకాణదారుల వాంగ్మూలాలతో పాటు ఫోన్ కాల్ రికార్డులు, మొబైల్ లొకేషన్ వివరాలను పోలీసులు సాక్ష్యాలుగా సమర్పించారు. నిందితులు నేరానికి పాల్పడినట్లు ఈ ఆధారాలు నిరూపించాయని ప్రాసిక్యూషన్ వాదించింది.



# వైఎస్సార్‌సీపీతోనే బెస్తలు, మత్స్యకారులకు రాజకీయ సాధికారత

**రాజ్యాధికారంలో సముచిత వాటా కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**

**వైఎస్సార్‌సీపీ కర్నూలు నగర బెస్త విభాగం అధ్యక్షులు బెస్త శ్రీనివాసులు వెల్లడి**



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంప్రదాయ మత్స్యకారులకు, బెస్త సామాజిక వర్గానికి సముచిత గౌరవం కల్పించి, రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ కర్నూలు నగర బెస్త విభాగం అధ్యక్షులు బెస్త శ్రీనివాసులు స్పష్టం చేశారు. కర్నూలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మత్స్యకారులకే మత్స్యశాఖ అప్పగించిన చరిత్ర జగన్‌ది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల మనోభావాలను గుర్తించి వారికి కీలక బాధ్యతలు అప్పగించారని శ్రీనివాసులు గుర్తుచేశారు. రేపల్లెలో ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ మోపిదేవి వెంకటరమణను ఎమ్మెల్సీ చేసి, మత్స్యశాఖ మంత్రిత్వ శాఖను కేటాయించారని తెలిపారు. ఆ తర్వాత ఆయనను రాజ్యసభకు పంపి, బాపట్ల జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారని వివరించారు. అలాగే పలాస నియోజకవర్గం నుంచి గెలిచిన డాక్టర్ సీదిరి అప్పలరాజుకు సైతం రాష్ట్ర మత్స్యశాఖ మంత్రిగా అవకాశం ఇచ్చి మత్స్యకార సమాజానికి అగ్రతాంబూలం ఇచ్చారన్నారు. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు ఎన్నడైనా సంప్రదాయ మత్స్యకారులకు మత్స్యశాఖ కేటాయించారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

**రాజకీయంగా పెద్దపీట** కుప్పం నుంచి భరత్, తిరుపతి నుంచి డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, కాకినాడ నుంచి కర్రి పద్మశ్రీలను ఎమ్మెల్సీలుగా చేసి చట్టసభలకు పంపిన ఘనత జగన్‌దేనని కొనియాడారు. ముమ్మిడివరం శాసనసభ్యుడిగా పొన్నాడ సతీష్ కుమార్‌ను గెలిపించుకోవడమే కాకుండా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమించారని తెలిపారు. విశాఖపట్నంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి పాలైన కోలా గురువులును జిల్లా అధ్యక్షుడిగా నియమించి, డీసీసీబీ చైర్మన్ పదవిని కట్టబెట్టారని గుర్తుచేశారు.

**కార్పొరేషన్లతో సామాజిక న్యాయం** నెల్లూరుకు చెందిన అనిల్‌ను మత్స్య సహకార సంఘాల చైర్మన్‌గా నియమించడంతో పాటు బెస్త, వన్నెకుల క్షత్రియ, అగ్నికుల క్షత్రియ, మత్స్యకార ఫైనాన్స్ కార్పొరేషన్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్ల పదవులు కల్పించి సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపించారని పేర్కొన్నారు.

**టీడీపీ ద్వంద్వ వైఖరిని గమనించాలి** మత్స్యకారులకు చంద్రబాబు ఎన్ని ఎమ్మెల్సీలు, ఎన్ని చైర్మన్ పదవులు ఇచ్చారో బహిరంగంగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. "పదవులన్నీ తన సొంత వర్గానికి కట్టబెట్టి, ప్రయోజనం లేని పథకాలను మాత్రమే బీసీలు, మత్స్యకారులకు విదిల్చడం టీడీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనం" అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని మత్స్యకారులు, బీసీలు ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి, తమ వర్గాల సంక్షేమానికి కట్టుబడిన వైఎస్సార్‌సీపీ వెంట నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బెస్త నాయకులు బెస్త కమల, తెలుగు కన్న, తెలుగు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్లు ఎస్ సి లకు అన్యాయం చేసిన అధికారులు

**4 వార్డులగాను.. 1 వార్డు కేటాయించడం ....ఎస్సీల మనోభావాలుదెబ్బతీయడమే(మాల మహానాడు)**

**తీవ్ర సంతృప్తి వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు**

**మాల మహానాడు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం సమర్పించుట ఆత్మకూరు**



**నంది పత్రిక ఆత్మకూరు** మున్సిపల్ పరిధిలోని వార్డు రిజర్వేషన్లలో ఎస్సీలకు పూర్తిగా అన్యాయం జరిగిందంటూ మాల మహానాడు సంఘాల నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు. బుధవారం నాడు అంబేద్కర్ భవన్లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాల మహానాడు నాయకులు పెరుమాల చెన్న కేశవులు, మురహరి మల్లయ్య , సగినాల రవికుమార్ ,మేకల సుధాకర్, అబ్రహం , మొదలగు వారు మాట్లాడుతూ, గతంలో 2021 నాటి స్థానిక సంస్థల ఎన్నికల సమయములో 24 వార్డులు ఉన్న మున్సిపాలిటీ పరిధిలో, నాలుగు వార్డులు ఎస్సీలకు రిజర్వ్ చేశారు. ఈసారి మున్సిపాలిటీ పునర్విభజన కింద వార్డుల సంఖ్య 32 కు పెరిగాయి. కానీ ఎస్సీ వర్గానికి మాత్రం రిజర్వేషన్ వార్డుల సంఖ్య పెంచకపోగా, ప్రస్తుతం ఉన్న నాలుగు వార్డుల రిజర్వేషన్ సంఖ్య తగ్గిస్తూ, కేవలం ఒక్క వార్డుకే పరిమితం చేయడం పట్ల దళిత సంఘాల నాయకులు తీవ్రత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ అంశాన్ని ఎస్సీ నాయకులు రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని యోచనలో ఉన్నారని తెలిపారు. సాధారణంగా అటు సార్వత్రిక ఎన్నికల్లోను, ఇటు స్థానిక సంస్థల ఎన్నికల లోను, ఎస్సీల ఓట్లు గణనీయంగా ఉంటుందని, ఆయా రాజకీయ పార్టీల గెలుపు విషయంలోనూ ఎస్సీల ప్రభావము ఉంటుందని, ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆత్మకూరు మున్సిపాలిటీ రిజర్వేషన్ల ప్రక్రియలో ఎస్సీలకు పూర్తిగా అన్యాయం జరిగిందంటూ, మరొకసారి పునః పరిశీలించి ఎస్సీలకు న్యాయం చేయాలంటూ, మాల మహానాడు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ బేబీకి వినతిపత్రం సమర్పించడమైనది. ఈ కార్యక్రమంలో జి రాఘవేంద్ర,ఎస్ నాగరాజు, జయన్న, యేసురత్నం, సతీష్ కుమార్, మొదలగు వారు పాల్గొన్నారు

## కూష్మాండ అలంకరణలో శ్రీ చౌడేశ్వరి అమ్మవారు



**బనగానపల్లె అక్టోబర్ 14నందిపత్రిక** నందవరం దేవస్థానం నందు శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగం గా నాలుగోవ రోజు అమ్మవారు కూష్మాండ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

## మాజీ మంత్రివర్యులు పల్లె రఘునాథ్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్పర్సన్ కమ్మరి పార్వతమ్మ

**కర్నూల్ సిటీ నంది పత్రిక** పుట్టపర్తి నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు , మరియు పుట్టపర్తి నియోజకవర్గ పరిశీలకులు, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ ఇద్దరూ పల్లె రఘునాథ్ రెడ్డి ని కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూత్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి, అభ్యర్థుల ఖరారుపై విస్తృతంగా చర్చించడం జరిగింది. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ అభ్యర్థులందరి గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు సమిష్టిగా శ్రమించి, కూటమి ప్రభుత్వాన్ని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



## వీబీజీ రామ్ జీ పథకం కింద ఉపాధి కల్పించే శ్రామికుల సంఖ్యను పెంచాలి

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** వీబీజీ రామ్ జీ పథకం కింద చేపట్టిన పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయడంతో పాటు, శ్రామికులకు విస్తృతంగా ఉపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి డ్వామా పిడి ని ఆదేశించారు. బుధవారం గూడూరు మండలంలోని కె.నాగలాపురం గ్రామంలో జలధార – జలహారతి 2.0 కింద చేపడుతున్న నీటి సంరక్షణ పనులను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలోని అర్హులైన శ్రామికులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత వారం 80 నుంచి 90 మంది వరకు కూలీలు హాజరుకాగా, ప్రస్తుతం 110 మంది లక్ష్యానికి గాను 60 మంది మాత్రమే పనులకు వస్తున్నారని, శ్రామికులకు ఉపాధి హామీ పనుల ప్రాధాన్యతను వివరించి, పనులకు హాజరయ్యేలా అవగాహన కల్పించాలన్నారు.ప్రతి గ్రామంలో వీబీ జీ రామ్ జీ కింద శ్రామికులకు కచ్చితంగా పని కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రామికులతో మాట్లాడుతూ వారానికి ఎన్ని రోజులు పని లభిస్తోంది, వేతనాలు సక్రమంగా అందుతున్నాయా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందుతున్నాయా అనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు లేని అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి, వారికి గృహ నిర్మాణ పథకం కింద దరఖాస్తులు స్వీకరించేందుకు 3 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ హౌసింగ్ పిడి ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి నరసింహా రెడ్డి, డ్వామా ఎపిడి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత నిమజ్జనానికి ముమ్మర ఏర్పాట్లు

**ఈ నెల 21న నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి**

**అధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశాలు**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను ముమ్మరంగా చేపట్టి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. ఈ నెల 21న జరగనున్న నిమజ్జనాన్ని దృష్టిలో ఉంచుకుని బుధవారం తుంగభద్ర నది వద్ద సంకల్‌బాగ్‌లోని దుర్గామాత ఘాట్‌ను ఆయన పరిశీలించారు. ఘాట్ వద్ద గుర్రపు డెక్క తొలగింపు, పారిశుధ్య పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్న సిబ్బందిని కమిషనర్ అభినందించారు. మెటల్ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని, నిమజ్జనం కోసం రెండు క్రేన్లను సిద్ధంగా ఉంచడంతో పాటు అదనంగా మరో క్రేన్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ దీపాలు, వేదిక, తాగునీటి సరఫరా వంటి అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.అంతకుముందు ధర్మపేట, నరసింహారెడ్డి నగర్, వెంకటరమణ కాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. పరిమళ నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. వెంకటరమణ కాలనీలో విశాల్ మార్ట్ వెనుక ఉన్న జీటీఎస్ స్టేషన్‌ను కూడా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ రమేష్ బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## షూటింగ్‌లో పెను ప్రమాదం నుంచి బయటపడ్డ ఇమ్రాన్ హాష్మీ

బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హాష్మీ తృటిలో ఓ పెను ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆయన నటిస్తున్న కొత్త చిత్రం 'గున్‌మాస్టర్ జీ9' షూటింగ్ సెట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. బెంగళూరులో జరుగుతున్న క్లైమాక్స్ చిత్రీకరణలో భాగంగా ఓ కారు స్టంట్ చేస్తుండగా, సాంకేతిక లోపంతో అది ఒక్కసారిగా కిందపడిపోయింది. ఇమ్రాన్ హాష్మీకి కేవలం అడుగు దూరంలోనే కారు కూలిపోవడంతో సెట్‌లో అందరూ ఉలిక్కిపడ్డారు.

వివరాల్లోకి వెళ్తే, 'గున్‌మాస్టర్ జీ9' సినిమా క్లైమాక్స్‌లో భాగంగా ఓ భారీ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఓ కారును గాల్లోకి లేపి ఫ్లిప్ చేసే స్టంట్ ప్లాన్ చేశారు. అయితే, ఊహించని విధంగా సాంకేతిక సమస్య తలెత్తడంతో కారును పట్టి ఉంచిన మెకానిజం విఫలమైంది. దీంతో గాల్లో ఉన్న కారు వేగంగా కిందకు పడిపోయింది.

## బండి ఆత్మకూరు మండలంలో రిజర్వేషన్ల జాబితా

**బండి ఆత్మకూరు నంది పత్రిక అక్టోబర్ 14:** బండి ఆత్మకూరు మండలంలో ఎంపీటీసీ జడ్పిటిసి సభ్యులకు సంబంధించిన రిజర్వేషన్ల జాబితాను అధికారులు ప్రకటించారు. బండి ఆత్మకూరు మండల పరిషత్ అధ్యక్ష స్థానాన్ని బిసి మహిళకు కేటాయించారు. జడ్పిటిసి స్థానాన్ని జనరల్ కు కేటాయించారు. మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు కేటాయించారు. ఏ కోడూరు ఎస్సీ మహిళకు, బి కోడూరు జనరల్, బండి ఆత్మకూరు ఒకటవ ఎంపీటీసీ జనరల్, రెండవ ఎంపిటిసి కి జనరల్ మహిళకు, భోజనం ఎస్సీకి, చిన్నదేవలాపురం జనరల్, ఎన్నపాడు జనరల్, జి లింగాపురం జనరల్ మహిళకు, కడమల కాలువ బీసీ మహిళకు, పార్నపల్లి బీసీ మహిళకు, పెద్దదేవలాపురం ఎస్టీకి, సంత జుటూరు బీసీకి, సింగవరం ఎస్సీ మహిళకు, ఎర్రగుంట్ల జనరల్ మహిళకు కేటాయించారు.

## జూపాడుబంగ్లా ఎంపీపీ,జడ్పిటిసి స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు....

**11 గ్రామాల ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు విడుదల.**



**జూపాడు బంగ్లా అక్టోబర్ 14 ( నంది పత్రిక ):** జూపాడు మండల పరిషత్ అధ్యక్షుడు ఎంపీపీ జిల్లా ప్రాదేశిక సభ్యుడు జడ్పిటిసి స్థానాలకు జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల అధికారి రిజర్వేషన్లు ఖరారు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదలచేసింది. జూపాడుబంగ్లా ఎంపీపీ స్థానాన్ని (బీసీ జనరల్ ), జెడ్పిటిసి (ఎస్సీ మహిళలకు ), కేటాయిస్తూ మండలంలోని 11 గ్రామాల ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ప్రకటించారు. 80 బన్నూరు (బీసీ ),జూపాడుబంగ్లా 1( అన్ రిజర్వ్ మహిళ), జూపాడు బంగ్లా 2(బీసీ మహిళ), మండ్లేము– 1 1(అన్ రిజర్వ్ మహిళ), మండ్లేము– 2 (ఎస్సీ ),పారుమంచాల (బీసీ), తంగడంచ( అన్ రిజర్వ్ ),తరిగోపుల (ఎస్సీ ),తర్తూరు (ఆన్ రిజర్వ్ ),తాటిపాడు (ఎస్సీ మహిళా ),తుడిచెర్ల( ఆన్ రిజర్వ్ గా కేటాయించారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షునికి (ఎంపీపీ), జిల్లా పరిషత్ చైర్మన్ స్థానానికి ప్రజలు నేరుగా ఓట్ల వేయవలసి ఉంటుందని పేర్కొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కోడుమూరు నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు రూ. 7,80,370/– అక్షరాల ఏడు లక్షల ఎనభై వేల మూడు వందల డెబ్బై రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఇచ్చారు చెక్కులను తీసుకున్న లబ్ధిదారులు సీఎం నారా చంద్రబాబు నాయుడు కి డి.విష్ణువర్ధన్ రెడ్డి కి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కి ధన్యవాదాలు తెలిపారు.

**లబ్ధిదారుల పేర్లు మరియు సీఎం రిలీఫ్ ఫండ్ వివరాలు**

1. తెలుగు సుంకులమ్మ (చనుగొండ్ల )–36,739/–
2. కురువ సుజాత (నిర్జురు )–10,0000/–
3. ఈడిగ విక్రమ్ (కోడుమూరు ) 1,46,627/–
4. మాదిగ చిన్న తిక్కన్న (కోడుమూరు )–51,942/–
5. వా ప్రభుదాస్ (సి బెళగల్ )– 66,130/–6. మల్లెపోగు రాజమణి (కె.సింగారం ) –31,240/–

7.ఉప్పరి సుశీలమ్మ (కంపాడు ) –20,000/–

8. బోయ గోవిందు (సి బెళగల్ ) 32,101/–
9. శ్రావణి (చింతామనుపల్లె )– 34,255/–
10. కె లక్ష్మి రెడ్డి (పోలకల్ )– 41,539/–
11. సి వేదవతి (గోరంట్ల )–63,734/–
12. గొల్ల సరస్వతి (దిన్నె దేవరపాడు ) 23,920/–
13. బోయ సంగమేశ్వరుడు (గోరంట్ల ) –54,884/–

14.కాప దేవమ్మ (కిష్టపురం ) –35,000/–

15.పింజరి పెద్ద ఖాజన్న (ఉల్చాల )–21,795/–

16.షేక్ సన ఫర్వీన్ (అంబేద్కర్ కాలనీ )–20,464/– వీరందరూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఈ కేవైసీ తప్పనిసరి

**- మండల వ్యవసాయాధికారిణి అమిరున్నీసా బేగం**



**కొత్తపల్లి –నంది పత్రిక :** ఈ పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి అమిరున్నీసా బేగం సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో మండలంలోని ఆయా గ్రామాల్లో వివిధ రకాల పంటలను సాగుచేసుకొని వాటి వివరాలను ఈ పంటనమోదులో పొందుపరచుకున్నా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీని రైతులు స్వర్ణగ్రామం, స్వర్ణ వార్డు సిబ్బంది. రైతు సేవ సిబ్బంది దగ్గర ఓటీపీ, ఆధార్ ఫేస్ ద్వారా చేయించుకోవచ్చునన్నారు. ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు.

## దేవరగట్టు బన్ని ఉత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం



**కర్నూల్ సిటీ నంది పత్రిక** బుధవారం హోళగుంద మండలం దేవరగట్టు గ్రామంలో బన్ని ఉత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి , కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు.అనంతరం శ్రీ మాళ సహిత మల్లేశ్వరస్వామి వారిని జిల్లా కలెక్టర్ , ఎస్పీ దర్శించుకున్నారు.

# దేవరగట్టు బన్ని ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి





**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**
**జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**
**భక్తుల భద్రతకు ప్రాధాన్యత**
**30 పడకల వైద్య సదుపాయం,**
**8 అంబులెన్సులతో అత్యవసర సేవలు నిర్వహణ**
**సీసీ కెమెరాలు పర్యవేక్షణలో బన్నీ ఉత్సవాల నిర్వహణ**
**శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు**

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** హోళగుంద మండలం దేవరగట్టు గ్రామంలో నిర్వహించనున్న బన్ని ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. సుమారు 3 లక్షల నుంచి 5 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున భద్రత, వైద్య సేవలు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, రహదారులు, అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.బుధవారం దేవరగట్టు ఆలయ ప్రాంగణం లో సమీప గ్రామస్తులు, ఆలయ పెద్దలు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... బన్ని ఉత్సవాల నిర్వహణలో భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గతంలో ఉన్న 20 పడకల వైద్య సదుపాయాన్ని 30 పడకలకు పెంచాలని, అంబులెన్సుల సంఖ్యను రెండింటి నుంచి ఎనిమిదికి పెంచి నిరంతరం అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన వైద్య సిబ్బంది, మందులు, పరికరాలతో పాటు రెండు అగ్నిమాపక యంత్రాలు, ఫైర్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఇరుకైన మార్గాల్లోకి సైతం అత్యవసర వాహనాలు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు తాగునీటి కొరత లేకుండా నీటి సరఫరా సామర్థ్యాన్ని ఆరు లక్షల లీటర్లకు మించి పెంచాలని, పార్కింగ్ ప్రాంతాల్లోనూ ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని అందించాలని తెలిపారు. ఆలయ పరిసరాలు, ప్రధాన మార్గాల్లో తగినంత లైటింగ్ ఏర్పాటు చేసి, నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు అత్యవసర సమయాల్లో జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్వహణ, చెత్త తొలగింపు, పరిసరాల పరిశుభ్రతపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రహదారులపై గుంతలను తొలగించి మరమ్మతులు చేపట్టాలని, ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఉత్సవ ప్రాంతంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, అధికారుల ఫోన్ నంబర్లతో కూడిన జాబితాను సిద్ధం చేసుకుని సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలని తెలిపారు.

**బన్ని ఉత్సవాలకు వచ్చే భక్తులకు కలెక్టర్ సూచనలు:–**

ఉత్సవాలకు వచ్చే భక్తులు కర్రలు తీసుకుని రాకూడదు.మద్యం సేవించడం కానీ మద్యం తీసుకొని రావడం చేయరాదు. ఒకరిపై ఒకరు ద్వేషం తో దాడులకు పాల్పడ రాదు. ప్రశాంత వాతావరణంలో బన్ని ఉత్సవాన్ని జరుపుకోవాలని సూచించారు. 110 వీడియో కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, హింసాత్మక ఘటనలకు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కేసుల నమోదు, అరెస్టులు సహా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరిగిందని కలెక్టర్ హెచ్చరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనకు తావివ్వకుండా గ్రామస్తులు , భక్తులు పోలీసులకు అధికారులకు పూర్తిగా సహకరించాలని కలెక్టర్ కోరారు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ.... బన్ని ఉత్సవాలను సంప్రదాయాలకు అనుగుణంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, గ్రామస్థులు పోలీసులకు సహకరించాలని కోరారు. బారికేడింగ్, లైటింగ్, సీసీ కెమెరాలు, నెట్‌వర్క్ వ్యవస్థలను పటిష్టం చేయాలని, ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు గోల్డెన్ అవర్‌లోనే వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన వైద్యులు, ముఖ్యంగా స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. అంబులెన్సులు తిరిగి ఉత్సవ ప్రాంతానికి చేరుకుని సేవలందించడంలో ఆలస్యం జరగకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా పాత కక్షలు, వ్యక్తిగత వివాదాలు, గ్రామాల మధ్య విభేదాలకు తావివ్వరాదని ఎస్పీ స్పష్టం చేశారు. హింసాత్మక ఘటనలకు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కేసుల నమోదు, అరెస్టులు సహా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలని, భద్రతా నియమాలు, జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని పోలీస్ లకు ఎస్. పి.సూచించారు.ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, ఉత్సవాలు ముగిసే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. భక్తులందరూ సంయమనం పాటిస్తూ, సంప్రదాయాలను గౌరవించి, పోలీసులకు సహకరించి బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌లు మెట్ల మార్గం ద్వారా వెళ్లి శ్రీ మాళ మల్లేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆదోని ఆర్డీవో అరుణ దేవి, ఆదోని అడిషనల్ ఎస్పీ జయ శర్మ, ఆదోని డి.ఎస్.పి వంషీదర్ గౌడ్ , ఆర్ అండ్ బి ఎస్ ఈ మహేశ్వర రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ , ఎస్ ఈ పి ఆర్ చంద్రా రెడ్డి , డిఎంహెచ్ఓ కామేశ్వర ప్రసాద్ , డిసిహెచ్ఎస్ జఫ్రుల్లా , ఎక్సైజ్ డిసి శ్రీధర్ బాబు , ఎలక్ట్రికల్ డి ఈ సుబ్బన్న , దేవరగట్టు ఆలయ చైర్మన్ వీర నాగప్ప , ప్రధాన పూజారి గిరి మల్లేష్ , అగ్నిమాపక శాఖ , అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.



## ఆత్మకూర్ పట్టణాభివృద్ధి రాజన్నకే సాధ్యం:: సింగల్ విండో చైర్మన్ షహబుద్దిన్.



**నంది పత్రిక ఆత్మకూరు** శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాలతో ఈరోజు ఆత్మకూర్ మున్సిపాలిటీ లోని పలు ప్రాంతాల్లో శాసనసభ్యులు ప్రత్యేక నిధుల ద్వారా దాదాపు మూడు కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బేబీ మరియు ఆత్మకూర్ పట్టణ అధ్యక్షులు వేణుగోపాల్ గారితో కలిసి పాల్గొన్న సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దీన్ . ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మకూర్ పట్టణాభివృద్ధి శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి గారికే సాధ్యమన్నారు. దీనిని పట్టణ ప్రజలు ఆలోచించి రేపు జరుగు స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఆశీర్వదించి ఇంకా ఆత్మకూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా పురం బాషా, క్లస్టర్ ఇంచార్జ్ శంకర్, వార్డు అధ్యక్షులు హాశం, వలి ఖాన్, రమణ, కోయ మున్నా, కిరణ్, ఖాజావలి, ఖాజా, రహిమాని, టపాల్ అష్రఫ్ అలీ, లియా హత్ అలీ, సలాం, శ్రీను, మా భాష, అస్గర్, మాలిక్ మున్సిపల్ కాంట్రాక్టర్లు ఉపేంద్ర రెడ్డి, శ్రీధర్ రెడ్డి మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



## మనెకుర్తి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన... కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఎన్నికల నేపథ్యంలో ఆలూరు మండలం , మనెకుర్తి గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల నిఘా, మౌలిక వసతులను పరిశీలించి, ఓటర్లు స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆదోని ఏఎస్పీ జయశర్మ ఐపీఎస్, పత్తికొండ డిఎస్పి వంశీధర్ గౌడ్ ,సీఐలు మధుసూదన్ రావు, కేశవరెడ్డి, రవిశంకర్ రెడ్డి, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళపై విచక్షణారహితంగా దాడి







**నాలుగు తులాల బంగారు గొలుసు అపహరణ**
**రంగంలోకి దిగిన పోలీసులు**

**బండి ఆత్మకూరు నంది పత్రిక అక్టోబర్ 14:** పశువులు మేపుకునేందుకు వెళ్లిన ఓ మహిళపై గుర్తుతెలియని దుండగుడు విచక్షణారహితంగా దాడి చేసి ఆరు లక్షల రూపాయల విలువచేసే తాళిబొట్ల గొలుసును అపహరించుకొని వెళ్లిన సంఘటన బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. బాధితురాలు, ఆమె భర్త కథనం మేరకు సంఘటనకు సంబంధించి పూర్వాపరాలు ఈ విధంగా ఉన్నాయి. ఈర్నపాడు గ్రామానికి చెందిన ఎర్రం పార్వతమ్మ (మాజీ ఎంపీటీసీ సభ్యురాలు) బుధవారం పశువులను మేపుకునేందుకు వెళ్ళింది. పార్లపల్లె కేసీ కెనాల్ పరిసర ప్రాంతాల్లో పశువులు మేపుకుంటూ ఎండకు తాళలేక పార్వతమ్మ గొడుగు పట్టుకుని కూర్చొని ఉందని తెలుస్తోంది. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై గుర్తు తెలియని వ్యక్తి వచ్చినట్లుగా తెలుస్తోంది. ద్విచక్ర వాహనాన్ని దూరంగా ఆపి నడుచుకుంటూ ఆమె వద్దకు వచ్చి ఆమె తలపై రాతితో దాడి చేసినట్లుగా బాధితులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే దుండగుడు ఆమె మెడలో నాలుగు తులాల తాళిబొట్ల గొలుసును లాగివేసుకున్నట్లుగా తెలుస్తోంది. చెవి కమ్మలను దోచుకునే ప్రయత్నంలో బాధితురాలు పార్వతమ్మ తీవ్రంగా ప్రతిఘటించినట్లుగా బాధితుల బంధువులు పేర్కొంటున్నారు. దీంతో రెచ్చిపోయిన దుండగుడు ఆమెపై పిడుగులు కురిపించడంతో ఎడమ కన్ను పూర్తిగా వాచిపోయింది. కుడిచెవి కూడా సగం తెగిపోయింది. ఈ ఘటనతో భయకంపితురాలైన పార్వతమ్మ ఇంటికి వెళ్లి జరిగిన సంఘటన గురించి భర్త ఎర్రం గోపాల్ రెడ్డి తో చెప్పి బోరున విలపించింది. వెంటనే పార్వతమ్మ భర్త తో కలిసి బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు పార్వతమ్మ ను వైద్య చికిత్సల నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈర్నపాడు గ్రామానికి చెందిన పార్వతమ్మ దుండగుడి దాడిలో గాయపడిందన్న విషయం తెలిసిన వెంటనే గ్రామంలో ఆందోళనకరమైన వాతావరణం నెలకొంది.

**రంగంలోకి దిగిన పోలీసులు** ఈర్నపాడు గ్రామానికి చెందిన పార్వతమ్మ పై దాడి జరిగిందన్న విషయం తెలిసిన వెంటనే పోలీసులు స్పందించారు. నంద్యాల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, మహానంది గోస్పాడు, ఎస్ఐలు రామ్మోహన్ రెడ్డి ,సుధాకర్ రెడ్డి, బండి ఆత్మకూరు ఏఎస్ఐ మహబూబ్ భాష పోలీస్ సిబ్బందితోపాటు, సిసిఎస్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. జరిగిన సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు. పార్నపల్లి, బండి ఆత్మకూర్ పరిసర ప్రాంతాలలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## షార్ట్ సర్క్యూట్ తో కాలిపోయిన అమ్మవారు

**జనార్ధన స్వామి ఆలయంలో అపశృతి**



**బండి ఆత్మకూరు నంది పత్రిక అక్టోబర్ 14:** బండి ఆత్మకూరు లోని జనార్ధన స్వామి ఆలయంలో బుధవారం తెల్లవారుజామున అపశృతి చోటుచేసుకుంది. ఆలయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అన్నపూర్ణాదేవి అలంకారంలో ఉన్న వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి విగ్రహం కాలిపోయింది. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే విగ్రహం కాలిపోయినట్లుగా తెలుస్తోంది. బుధవారం ఉదయం ప్రత్యేకంగా పండితులను పిలిపించి హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మవారు లలితా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు.

## ఆదోని పట్టణంలోని సమస్యాత్మకమైన కల్లుబావి పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసినకర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



**కర్నూల్ సిటీ నందిపత్రిక** మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ఆదోని పట్టణంలోని సమస్యాత్మకమైన కల్లుబావి పురపాలక ఆదర్శ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాలను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఏఎస్పీ జయశర్మ ఐపీఎస్ , సీఐలు మధుసూదన్ రావు, కేశవరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 16న బనగానపల్లె లో కల్చరల్ మెజీషియన్

**బనగానపల్లె అక్టోబర్ 14నందిపత్రిక** బనగానపల్లె పట్టణంలో ఈనెల 16వ తేదీన అరుణ భారతి సాంస్కృత సంస్థ ఆధ్వర్యంలో సాంస్కృతిక మరియు మెజీషియన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు, బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బనగానపల్లె బిసి గుర్రెడ్డి కాలనీలోని ప్రియదర్శి స్కూల్ ఎదురుగా శుక్రవారం సాయంత్రం 6 గంటల నుండి సాంస్కృతిక మరియు ఇంద్రజాలం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కడపకు చెందిన గోల్డ్ మెడలిస్ట్ డాన్స్ మాస్టర్ డి.చిన్నారెడ్డి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. శ్రీ సాయి నటరాజ డాన్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో జానపద నృత్యములు, మహిషాసుర మర్దిని, కూచిపూడి నృత్యాలు, వెస్టన్ డ్యాన్సులు, లంబాడి నృత్యములు ఉంటాయన్నారు. మాస్టర్ శంకర్ గారి ఆధ్వర్యంలో మెజీషియన్ ప్రోగ్రాం ఉంటుందన్నారు. ముఖ్యంగా స్త్రీలకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణ ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణ భారతి సాంస్కృతిక సంస్థ సభ్యులు బలరామయ్య , జ్యోతిష్యం వెంకటరాముడు,భరతుడు, బచ్చు భాస్కరయ్య, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



# ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిద్దాం



**ఎన్నికల నిర్వహణ యంత్రాంగానికి ప్రత్యేక శిక్షణ**

**అశ్రద్ధ, అజాగ్రత్త ఏమాత్రం తగదని హితవు**

**అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు సూచనలు**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది సమర్థవంతంగా పనిచేస్తూ, ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, విధుల్లో అశ్రద్ధ, అజాగ్రత్తకు ఏమాత్రం తావివ్వకూడదని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. బుధవారం ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో రిటర్నింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బందికి శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు సంబంధించి వార్డుల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, మరమ్మతులు, రిజర్వేషన్లు, కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు తదితర ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషనర్ తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో 68 వార్డులు ఉండగా, మొత్తం 4,79,861 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. వీరిలో 2,32,508 మంది పురుషులు, 2,47,295 మంది మహిళలు, 58 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారని వివరించారు. ప్రతి నాలుగు వార్డులకు ఒక రిటర్నింగ్ అధికారిని నియమించి, ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మేయర్, కార్పొరేటర్ పదవులకు పోటీ చేసే అభ్యర్థులకు కనీస వయస్సు 21 ఏళ్లు ఉండాలని పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియను చిత్రీకరించేందుకు వీడియో గ్రాఫర్లను నియమిస్తున్నట్లు, ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసినట్లు తెలిపారు. రిటర్నింగ్ అధికారులు తమ లాగిన్‌ల ద్వారా సంబంధిత అధికారిక వెబ్‌సైట్‌లో ప్రతిరోజూ నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన హ్యాండ్‌బుక్‌లను పూర్తిగా చదివి, నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని,



సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులకు సంబంధించిన బ్యాలెట్ పత్రాలను ఓటర్లు ఒకే బ్యాలెట్ బాక్స్‌లో వేయాల్సి ఉంటుందని వివరించారు. పోలింగ్ అనంతరం ప్రత్యేక బందోబస్తు మధ్య బ్యాలెట్ బాక్సులను తరలించేందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేస్తునట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ఖర్చు పరిమితులను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ సూచించారు. మేయర్ అభ్యర్థి గరిష్ఠంగా రూ.25 లక్షలు, కార్పొరేటర్ అభ్యర్థి రూ.10 లక్షల వరకు ఖర్చు చేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల నోడల్ అధికారి, అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని స్ట్రాంగ్ రూములను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదోని మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. స్ట్రాంగ్ రూముల భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, పటిష్టమైన నిఘా, భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆదోని ఏఎస్పీ జయశర్మ ఐపీఎస్ , ఆదోని మున్సిపల్ కమిషనర్ నయిం అహమ్మద్ , సీఐలు మధుసుధన్ రావు, కేశవరెడ్డి, చంద్రశేఖర్, నల్లప్ప, రాజశేఖర్ రెడ్డి, రామలింగమయ్య, మహమ్మద్ గౌస్ లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మారుతీ నగర్ లో టీడీపీకి షాక్ – వైఎస్సార్సీపీలోకి 15 కుటుంబాల చేరిక



**నందికొట్కూరు అక్టోబర్ 14(నంది పత్రిక )**మున్సిపాలిటీ పరిధిలోని మారుతి నగర్ కాలనీకి చెందిన గౌరు వెంకటరెడ్డి అనుచరుడు మాబాషా తన అనుచరులతో కలిసి టీడీపీని వీడి వైఎస్సార్సీపీలో చేరారు గత 30 సంవత్సరాలుగా టీడీపీలో కొనసాగుతున్న మాబాషా బుధవారం రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీ కండువా కప్పుకున్నారు.ఆయనతో పాటు ప్రసాద్,రహీమ్, మహమ్మద్ బాషా తదితరులతో కలిపి మొత్తం 15 కుటుంబాలు పార్టీలో చేరాయి.వీరందరికీ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీ లోనికి సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో 26వ వార్డు అభ్యర్థి సునీత కుమారి మరియు పట్టణ అధ్యక్షులు మన్సూర్ అహ్మద్, వార్డు ఇంచార్జ చరణ్,జబ్బార్,మదుసూదన్ రెడ్డి,భాష వైసిపి పార్టీ నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# విజ్ఞాన శిఖరం, భావితరాల దీపస్తంభం అబ్దుల్ కలాం

**బొల్లు రామమెహన్**

**కడప అక్టోబర్ 14 (నంది పత్రిక రిపోర్టర్)**డాక్టర్ కలాం కలల నుంచి క్షిపణుల వరకు.. విజ్ఞానం నుంచి దేశాభివృద్ధి వరకు!"పట్టుదల ఉంటే కొండనైనా పిండి చేయవచ్చు" అన్న సామెతకు నిలువెత్తు నిదర్శనం భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం. పేదరికాన్ని పునాదిగా చేసుకుని, కృషిని నిచ్చెనగా మలచుకుని, విజ్ఞానాన్ని ఆయుధంగా ధరించి భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటిన మహనీయుడాయన. ఆయన జీవితం ఒక వ్యక్తి విజయగాథ మాత్రమే కాదు.. శాస్త్రీయ ఆలోచనకు, క్రమశిక్షణకు, దేశభక్తికి చిరస్మరణీయ పాఠం.

**పేదరికం నుంచి ప్రగతి శిఖరాల వరకు!** 1931 అక్టోబర్ 15న తమిళనాడులోని రామేశ్వరంలో సాధారణ కుటుంబంలో జన్మించిన కలాం బాల్యం ఆర్థిక ఇబ్బందుల మధ్య గడిచింది. కుటుంబానికి తోడ్పడేందుకు చిన్నతనంలోనే వార్తాపత్రికలు పంపిణీ చేశారు. అయితే పేదరికం ఆయన ఆశయాలకు అడ్డుగోడ కాలేదు. చదువుపై ఆసక్తి, గురువుల ప్రోత్సాహం, నిరంతర శ్రమ ఆయనను ఉన్నత శిఖరాలకు చేర్చాయి."కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు" అన్న మాటను ఆయన తన జీవితంతో నిరూపించారు. పరిస్థితులు అనుకూలంగా లేవని ఆగిపోకుండా, ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగారు. ఎందుకంటే ప్రతిభకు పేదరికం అడ్డుకాదు.. పట్టుదలకు పరాజయం శాశ్వతం కాదు!

**ఓటమి.. విజయానికి తొలి మెట్టు!** విమాన చోదకుడిగా దేశానికి సేవ చేయాలన్నది యువ కలాం ఆశయం. అయితే వైమానిక దళ ఎంపికలో ఎనిమిది స్థానాలకే అవకాశం ఉండగా, ఆయన తొమ్మిదో స్థానంలో నిలిచారు. ఆశించిన అవకాశం చేజారడంతో నిరాశకు గురైనా, జీవిత ప్రయాణాన్ని అక్కడితో ముగించలేదు. ఆ అనుభవం నుంచి పాఠం నేర్చుకుని శాస్త్రసాంకేతిక రంగంలో తన ప్రతిభను నిరూపించుకున్నారు. "పడిన చోటే లేచి నిలబడినవాడే నిజమైన విజేత"అనే జీవనసత్యాన్ని ఆయన ఆచరణలో చూపించారు. విజ్ఞానశాస్త్రంలోనూ ఇదే సూత్రం వర్తిస్తుంది. ఒక ప్రయోగం ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోతే, శాస్త్రవేత్తలు కారణాలను పరిశీలిస్తారు. లోపాలను గుర్తిస్తారు. పద్ధతులను సరిదిద్దుతారు. మళ్లీ ప్రయోగిస్తారు. ఇలా పరిశీలన, ప్రయోగం, విశ్లేషణ, సవరణల ద్వారా కొత్త ఆవిష్కరణలకు మార్గం ఏర్పడుతుంది.అందుకే వైఫల్యం అంతిమ తీర్పు కాదు.. అది విజయానికి దారి చూపే అనుభవం!

**అంతరిక్ష పరిశోధనలో భారతదేశానికి కొత్త రెక్కలు!**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థలో కలాం అందించిన సేవలు దేశ శాస్త్ర చరిత్రలో ప్రత్యేక స్థానం పొందాయి. దేశీయ ఉపగ్రహ ప్రయోగ వాహనమైన ఎస్ఎల్‌వీ-3 అభివృద్ధిలో ప్రాజెక్టు సంచాలకుడిగా కీలక పాత్ర పోషించారు. 1980లో రోహిణి ఉపగ్రహాన్ని భూకక్ష్యలోకి ప్రవేశపెట్టడంలో ఈ ప్రయోగ వాహనం విజయం సాధించింది.

**ఇందులో దాగి ఉన్న శాస్త్రీయ సూత్రం ఏమిటి?**

భూమి గురుత్వాకర్షణను అధిగమించి ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి చేర్చాలంటే తగిన వేగం, దిశ, ఇంధన శక్తి అవసరం. రాకెట్ ఇంధనాన్ని మండించినప్పుడు వెలువడే వాయువులు అధిక వేగంతో వెనుకకు బయటకు వస్తాయి. ప్రతిచర్య ఫలితంగా రాకెట్ ముందుకు దూసుకుపోతుంది. ఈ ప్రక్రియ న్యూటన్ మూడవ గమన నియమానికి ఉదాహరణ."చుక్కలను చేరాలంటే నేల విడిచి ఆకాశాన్ని చూడాలి" అన్న భావనకు కలాం జీవితం ప్రతీక. అంతరిక్ష విజయం ఒక్కరి కృషితో సాధ్యం కాదు. శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు, కార్మికులు సమన్వయంతో పనిచేసినప్పుడే అసాధ్యం అనుకున్న లక్ష్యాలు సుసాధ్యమవుతాయి.

**క్షిపణి సాంకేతికతలో స్వదేశీ స్వావలంబన!**

భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థలో కలాం పలు కీలక కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. సమగ్ర మార్గదర్శక క్షిపణి అభివృద్ధి కార్యక్రమం ద్వారా పృథ్వి, అగ్ని, ఆకాశ్, త్రిశూల్, నాగ్ వంటి క్షిపణుల అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషించారు. ఈ కృషి ఆయనకు 'క్షిపణి పితామహుడు' అనే గుర్తింపును తెచ్చింది. క్షిపణి సాంకేతికతలో దిశానిర్దేశ వ్యవస్థలు, చలన నియమాలు, ఇంధన శాస్త్రం, పదార్థ విజ్ఞానం, కంప్యూటరీకరణ వంటి అనేక శాస్త్ర విభాగాలు పరస్పరం అనుసంధానమై ఉంటాయి. లక్ష్యాన్ని గుర్తించడం నుంచి ప్రయాణ మార్గాన్ని నియంత్రించడం వరకు ప్రతి దశలో ఖచ్చితత్వం కీలకం.1998 పోఖ్రాన్ అణు పరీక్షల్లోనూ కలాం ప్రముఖ పాత్ర పోషించారు. ఈ విజయాలు భారతదేశ సాంకేతిక సామర్థ్యాన్ని చాటాయి.అయితే విజ్ఞానం విలువ విధ్వంసంలో కాదు.. మానవాళి భద్రతకు, శాంతికి, అభివృద్ధికి ఉపయోగపడటంలో ఉంది. శాస్త్రీయ పురోగతితో పాటు బాధ్యతాయుతమైన ఆలోచన కూడా సమాజానికి అవసరం."స్వదేశీ పరిజ్ఞానం దేశానికి వెన్నెముక"అనే సత్యాన్ని కలాం కృషి గుర్తుచేస్తుంది. ఇతరులపై ఆధారపడకుండా మన సమస్యలకు మనమే పరిష్కారాలు కనుగొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి.

**ప్రజల రాష్ట్రపతి.. నిరాడంబరతకు ప్రతిరూపం!**

2002 నుంచి 2007 వరకు భారతదేశ పదకొండవ రాష్ట్రపతిగా పనిచేసిన కలాం, అత్యున్నత పదవిలో ఉన్నప్పటికీ నిరాడంబర జీవనాన్ని కొనసాగించారు. విద్యార్థులతో సంభాషించడం, యువతలో ఆశయాలను రగిలించడం, దేశ భవిష్యత్తుపై వారికి నమ్మకం కల్పించడం ఆయనకు ఎంతో ఇష్టమైన కార్యాలు. పదవులు మనిషికి గౌరవాన్ని తెచ్చిపెట్టవచ్చు. కానీ వ్యక్తిత్వం, నిజాయితీ, సేవాభావమే ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం కల్పిస్తాయి."వినయం విద్యకు వన్నె.. సేవ జీవితానికి సొబగు" అనే మాటలకు కలాం జీవితం అద్దం పడుతుంది. విజ్ఞానం పెరిగేకొద్దీ అహంకారం పెరగకూడదు. జ్ఞానం మనిషిని ఉన్నతుడిని చేయాలి; ఆ ఉన్నతత్వం సమాజానికి ఉపయోగపడాలి.

**విజ్ఞానం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి!**

శాస్త్రసాంకేతిక అభివృద్ధి ప్రయోగశాలలకే పరిమితం కాకూడదన్నది కలాం ఆలోచన. వైద్యరంగంలోనూ తక్కువ ఖర్చుతో ఉపయోగపడే పరిష్కారాల అభివృద్ధికి ఆయన ప్రోత్సాహమిచ్చారు. వైద్య నిపుణుడు డాక్టర్ బి. సోమరాజుతో కలిసి తక్కువ ఖర్చుతో కూడిన గుండె రక్తనాళ విస్తరణ పరికరం రూపకల్పనలో భాగస్వాములయ్యారు. పోలియో బాధిత పిల్లలు సులభంగా నడిచేందుకు తేలికపాటి కృత్రిమ కాలి పరికరాల అభివృద్ధికి కూడా కృషి చేశారు.ఇక్కడ మనం గుర్తించాల్సిన శాస్త్రీయ సూత్రం అవసరమే ఆవిష్కరణకు మూలం అనేది. సమాజంలో ఎదురయ్యే సమస్యలను పరిశీలించడం, వాటి మూలకారణాలను తెలుసుకోవడం, తక్కువ ఖర్చుతో మెరుగైన పరిష్కారాలను రూపొందించడం శాస్త్రవేత్తల ప్రధాన లక్ష్యం కావాలి.రైతుకు ఉపయోగపడే వ్యవసాయ పద్ధతులు, రోగికి అందుబాటులో ఉండే వైద్య పరికరాలు, గ్రామాలకు స్వచ్ఛమైన నీరు, పర్యావరణానికి మేలు చేసే ఇంధన పరిష్కారాలు.. ఇవన్నీ విజ్ఞానం ప్రజల జీవితాలను ఎలా మెరుగుపరచగలదో తెలియజేస్తాయి. "పరోపకారార్థమిదం శరీరం" అనే సూక్తి మానవ జీవితానికి సేవే పరమార్థమని చెబుతుంది. మనం సంపాదించిన జ్ఞానం ఇతరుల కష్టాలను తగ్గించినప్పుడే దానికి నిజమైన సార్థకత లభిస్తుంది.

**విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలి!**

కలాం దృష్టిలో విద్య అంటే కేవలం పాఠ్యపుస్తకాలను చదివి మార్కులు సాధించడం కాదు. ప్రశ్నించడం, పరిశీలించడం, ప్రయోగించడం, కొత్త విషయాలను అన్వేషించడం, తప్పుల నుంచి నేర్చుకోవడం కూడా విద్యలో అంతర్భాగాలే.విద్యార్థులు పరిసరాల్లో కనిపించే ప్రతి విషయాన్ని ఆసక్తిగా గమనించాలి. వర్షం ఎందుకు కురుస్తుంది? ఇంద్రధనుస్సు ఎలా ఏర్పడుతుంది? మొక్కలు సూర్యకాంతి సహాయంతో ఆహారాన్ని ఎలా తయారు చేసుకుంటాయి? విద్యుత్తు ఎలా ఉత్పత్తి అవుతుంది? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు వెతికే ప్రయత్నమే శాస్త్రీయ ఆలోచనకు పునాది. ఉదాహరణకు, మొక్కలు కిరణజన్య సంయోగక్రియ ద్వారా సూర్యకాంతి శక్తిని ఉపయోగించి నీరు, కార్బన్ డైఆక్సైడ్ నుంచి ఆహార పదార్థాలను తయారు చేసుకుంటాయి. ఈ ప్రక్రియలో ఆక్సిజన్ విడుదలవుతుంది. ఈ ఒక్క ప్రక్రియే భూమిపై జీవరాశుల మనుగడకు మొక్కలు ఎంత ముఖ్యమో తెలియజేస్తుంది.

అలాగే నీటిని మరిగిస్తే ఆవిరిగా మారడం, ఆవిరి చల్లబడితే మళ్లీ నీటిగా మారడం నీటి స్థితి మార్పులకు ఉదాహరణ. మన చుట్టూ జరిగే ఇటువంటి సహజ ప్రక్రియలను అర్థం చేసుకోవడం ద్వారా విద్యార్థుల్లో పరిశీలనా శక్తి పెరుగుతుంది."విన్నది కొంత.. కన్నది కొంత.. పరిశీలించినదే సంపూర్ణ జ్ఞానం" అనే భావనను విద్యార్థులు అలవర్చుకోవాలి. ఏ విషయాన్నైనా ఆధారాలతో పరిశీలించాలి. నిరాధారమైన ప్రచారాలను గుడ్డిగా నమ్మకుండా, నిజానిజాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

**నేటి యువతకు కలాం అందించిన ఐదు జీవన సూత్రాలు**

1. ఓటమికి భయపడకూడదు:

పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చినా, ఆశించిన ఫలితం దక్కకపోయినా నిరాశ చెందకూడదు. ఎక్కడ పొరపాటు జరిగిందో తెలుసుకుని సరిదిద్దుకోవాలి. లి"వైఫల్యమే విజయానికి సోపానం"లి అన్న మాటను గుర్తుంచుకోవాలి.

2. ప్రశ్నించే తత్వాన్ని పెంచుకోవాలి:

ఏ విషయాన్నైనా కారణాలతో అర్థం చేసుకోవాలి. శాస్త్రీయ ఆధారాలను పరిశీలించాలి. ప్రశ్నించడం అజ్ఞానానికి గుర్తు కాదు; జ్ఞానాన్వేషణకు తొలి అడుగు.

3. నిరంతరం నేర్చుకోవాలి:

విజ్ఞానం నిరంతరం విస్తరిస్తోంది. నిన్నటి ఆవిష్కరణ నేటి కొత్త పరిశోధనకు పునాదిగా మారుతోంది. అందువల్ల విద్యార్థులు పుస్తక పఠనం, ప్రయోగాలు, పరిశీలన ద్వారా తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి.

4. సమాజానికి ఉపయోగపడాలి:

తాము నేర్చుకున్న విషయాలను ప్రజల సమస్యల పరిష్కారానికి వినియోగించాలి. పర్యావరణ పరిరక్షణ, నీటి పొదుపు, ఆరోగ్య అవగాహన, గ్రామాభివృద్ధి వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి.

5. ఉన్నత లక్ష్యంతో నిరంతరం శ్రమించాలి:

కలలు కనడం మాత్రమే సరిపోదు. వాటిని కార్యరూపంలోకి తీసుకురావడానికి ప్రణాళిక, క్రమశిక్షణ, పట్టుదల అవసరం. లి"కష్టే ఫలి"లి అనే నానుడి శ్రమకు తగిన ఫలితం ఉంటుందని గుర్తుచేస్తుంది.

ముగింపు: కలాం చూపిన దారిలో విజ్ఞాన భారతం!

2015 జులై 27న మేఘాలయలోని షిల్లాంగ్‌లో విద్యార్థులకు పాఠం చెబుతుండగానే డాక్టర్ కలాం కన్నుమూశారు. జీవితపు చివరి క్షణం వరకు బోధనకే అంకితమైన ఆయన ప్రస్థానం ప్రతి తరానికి స్ఫూర్తిదాయకం.

ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు మనకు మార్గదర్శకాలు. శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మక ఆలోచన, స్వదేశీ పరిజ్ఞానం, నైతిక విలువలు, సమాజ సేవ.. ఇవన్నీ కలాం కలలుగన్న అభివృద్ధి చెందిన భారతదేశానికి పునాదులు."విత్తిన విత్తనమే మహావృక్షమవుతుంది"అన్నట్లుగా, నేడు విద్యార్థుల్లో నాటే జ్ఞానబీజాలే రేపటి దేశాభివృద్ధికి మహావృక్షాలవుతాయి. ప్రతి తరగతి గది ఒక పరిశోధన కేంద్రంగా, ప్రతి విద్యార్థి ఒక జ్ఞానాన్వేషిగా, ప్రతి ఆవిష్కరణ ప్రజల సంక్షేమానికి సాధనంగా మారాలి.కలాం ఆశయాలను కేవలం జయంతి రోజున స్మరించుకోవడం కాదు.. మన ఆలోచనల్లో, ఆచరణలో ప్రతిబింబించాలి. కలలు కనాలి.. ప్రశ్నించాలి.. పరిశోధించాలి.. ఆవిష్కరించాలి.. దేశానికి ఉపయోగపడాలి! అదే డాక్టర్ కలాంకు మనం సమర్పించే నిజమైన నివాళి. అదే విజ్ఞాన భారత నిర్మాణానికి బాట!



## అభివృద్దే లక్ష్యంగా 21 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, పార్కుల అభివృద్ధి పనులకు శ్రీకారం: ఎమ్మెల్యే గిత్త జయసూర్య





**నందికొట్కూరు అక్టోబర్ 14(నంది పత్రిక )**పట్టణంలో నిర్వహించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవాలు, నూతన అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 9.70 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.17.50 కోట్లు, అలాగే పట్టణంలోని మూడు పార్కుల అభివృద్ధికి రూ.3.50 కోట్లు కేటాయించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలు సేదతీరేందుకు పార్కులను అభివృద్ధి చేయడమే ఈ పనుల ప్రధాన లక్ష్యం అన్నారు. నాణ్యమైన రహదారులు, మెరుగైన పార్కులు, ఆధునిక మౌలిక సదుపాయాలతో నందికొట్కూరు పట్టణాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పనులు దోహదపడనున్నాయి అని అన్నారు.పట్టణ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. మును పెన్నడు లేనివిధంగా నందికొట్కూరు మున్సిపాలిటీ ప్రగతి పథంలో నడిపిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో చేపడుతున్న సంక్షేమం అభివృద్ధి కి ప్రజలు విశ్వాసం చూపిస్తారని, మున్సిపాలిటీ ఎన్నికలలో ప్రజల మద్దతు టిడిపికేనని ఆయన ధీమా వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వ పాలనను ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు పట్టణ నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు మున్సిపాలిటీ అధికారులు పాల్గొనడం జరిగింది



## సిరివెళ్ల పట్టణానికి చెందిన 40 కుటుంబాలు వైసీపీని వీడి టిడిపిలోకి రావడం చేరిక

**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల పట్టణానికి చెందిన మౌలా కరీమ్, బీలాల్, అబూభకర్, షేర్, ఫరీద్ బాబు, వహీద్ బాబు, హఫీజ్,బురు అస్లాం, బురు బీలాల్, మౌలా ఇమ్రాన్, తో సహా 40 కుటుంబాలు టిడిపిలోకి రావడం చాలా సంతోషమని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ గారు..మొన్న ఏదో వైసిపి నాయకులు నలుగురికి కండువాలు కప్పి టిడిపికి బిగ్ షాక్ అని చెప్పడం జరిగింది, బిగ్ షాక్ అంటే గతంలో మీతో పాటు ఉండి మళ్ళీ మీ దగ్గరికి వచ్చిన వాళ్లకు కండువాలు కప్పి బిగ్ షాక్ కాదు, ఈరోజు మాతోపాటు వచ్చారు చూడు ఇది మీకు బిగ్ షాక్ అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు తెలియజేశారు... సిరివెళ్ల ఎప్పటికైనా మా కంచుకోట అని గతంలో మా అమ్మానాన్న బ్రతికున్నప్పుడు ముస్లింల కోసం మసీదు కట్టించారని ఇప్పటికి ఎన్నోసార్లు నేను వచ్చినప్పుడు నాతో చెబుతుంటారు, నేను వైసీపీ నాయకులకు ఒకటే చెబుతున్న, సిరివెళ్ల ఎప్పటికైనా మా కంచుకోటగా మార్చుకుంటామని ప్రజలందరి సమక్షంలో తెలియజేస్తున్న అన్నారు.



## శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 14 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని లోని అమ్మవారిశాలలో జరుగుతున్న శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 4 వ రోజు అయిన బుధవారం రాత్రి శ్రీ వాసవాంబ అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేవిశెట్టి హరీష్ బాబు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన మూర్తి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారితో పాటు ఉత్సవ మూర్తిని పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారిని దర్శించేందుకు మహిళలు భారీగా తరలివచ్చారు. అమ్మవారి శాల ప్రాంగణం నుంచి మెయిన్ బజార్ వరకు ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుత్ దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆర్యవైశ్య సంఘం తో పాటు యువజన, వాసవి, దసరా పండుగ కమిటీ, మహిళా సంఘాలు, తదితర సంఘాలు ఏర్పాట్లలో భాగస్వాములై కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు



# స్థానిక సంస్థలఎన్నికల నిర్వహణకు సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలి...!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి
### సమాంతరంగా పట్టణ, ప్రాదేశిక, గ్రామ పంచాయతీ ఎన్నికలు
### అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి

**కడప, బ్యూరో చీఫ్ అక్టోబరు 14: నంది పత్రిక** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమావేశంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తోపాటు.. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు, అదనపు ఎస్పీ ప్రకాష్ బాబు, కేఎంసి కమిషనర్ భవానీ ప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ శివరామిరెడ్డి, జెడ్పి సీఈవో సుబ్రమణ్యం, జిల్లా పంచాయతీ అధికారి రామచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిమిత సమయంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలంటే ముందస్తు సన్నద్ధత, శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలపరిమితికి అనుగుణంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

పట్టణ స్థానిక సంస్థలు, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, గ్రామ పంచాయతీల ఎన్నికల ప్రక్రియలు వరుసగా, కొన్ని దశల్లో సమాంతరంగా కొనసాగనున్న నేపథ్యంలో ప్రతి అధికారి తన విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహనతో ఉండాలని స్పష్టం చేశారు.రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తొలిదశలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, రెండో దశలో మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలు, మూడో దశలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియ డిసెంబరు 2వ తేదీ వరకు కొనసాగనున్న నేపథ్యంలో ప్రతి దశకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.



**పట్టణ (మున్సిపల్) స్థానిక సంస్థల ఎన్నికలు...**

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా అక్టోబరు 14న రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటన, అక్టోబరు 16న ఎన్నికల అధికారి నోటీసు, నామినేషన్ల స్వీకరణ, అక్టోబరు 18న నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ, అక్టోబరు 19న నామినేషన్ల పరిశీలన, అక్టోబరు 21న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీగా నిర్ణయించారు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. అక్టోబరు 28న పోలింగ్, అక్టోబరు 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన జరగనున్నాయి.

**మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలు..**

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా అక్టోబరు 19న నోటిఫికేషన్, అక్టోబరు 21న ఎన్నికల అధికారి నోటీసు జారీ, నామినేషన్ల స్వీకరణ చేయనున్నారు. అక్టోబరు 23న నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ, అక్టోబరు 24న నామినేషన్ల పరిశీలన చేపడతారు. తిరస్కరించిన నామినేషన్లపై అక్టోబరు 25, 26 తేదీల్లో అప్పీళ్లు స్వీకరించి పరిష్కరిస్తారు. అక్టోబరు 27న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీగా నిర్ణయించారు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. నవంబరు 3న పోలింగ్, నవంబరు 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన జరుగుతాయి.

**మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు..**

గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి విడత పోలింగ్ నవంబరు 26న, రెండో విడత నవంబరు 29న, మూడో విడత డిసెంబరు 2న జరగనుంది. జిల్లాలో ఏ ప్రాంతాలను ఏ విడతలో చేర్చాలనే అంశాన్ని సంబంధిత అధికారులతో చర్చించి త్వరలో ఖరారు చేస్తామని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో వార్డు సభ్యులు, సర్పంచ్ పదవులకు సంబంధించి రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను కూడా పూర్తి చేయాలని సూచించారు.ప్రత్యక్ష ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం సంబంధిత స్థానిక సంస్థల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించేందుకు ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు.

**ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి...**

పంచాయతీరాజ్, పురపాలక శాఖల పరిధిలో ఓటర్ల జాబితాల ఖరారు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వాటి ప్రకటన, వివిధ పదవులకు రిజర్వేషన్ల ఖరారు వంటి ముందస్తు ప్రక్రియలను పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామ పంచాయతీల వార్డులు, సర్పంచ్ పదవులకు సంబంధించిన రిజర్వేషన్లను కూడా ఖరారు చేయాలని సూచించారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పరిషత్, జిల్లా పంచాయతీ అధికారులు, పోలీసు శాఖ అధికారులు ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా పోలీసు అధికారి సహా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికలకు ముందు చేపట్టాల్సిన ఏర్పాట్లు, పోలింగ్ సమయంలో అనుసరించాల్సిన విధానాలు, ఎన్నికల అనంతరం పూర్తి చేయాల్సిన ప్రక్రియలపై అధికారులు స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ పెట్టెలు, పోలింగ్ సిబ్బంది నియామకం, రవాణా, భద్రత, సున్నితమైన పోలింగ్ కేంద్రాల గుర్తింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఎన్నికల విధులు కేటాయించిన ఆర్వోలు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తదితర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.

### కమిషనర్ ఎం.జయకృష్ణ





**తిరుపతి బ్యూరో చీఫ్ అక్టోబర్ 14 నంది పత్రిక** తిరుపతి నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికలను ఎన్నికల నియమావళి, నిబంధనలకు అనుగుణంగా అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై బుధవారం ఆర్.ఓలు, ఏ.ఆర్.ఓలతో నగరపాలక సంస్థ కార్యాలయం లో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నేటి నుండి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ నుండి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అధికారులు అందరూ ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పకుండా పాటించాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద అప్రమత్తతతో వ్యవహరిస్తూ, ఎన్నికల ప్రక్రియలో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. ప్రిసైడింగ్ ఆఫీసర్స్ నిబందనలకు సంబంధించిన పుస్తకాలను శ్రద్ధగా చదివి ఎలాంటి తప్పిదాలకు తావు ఇవ్వకుండా నామినేషన్ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు . ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, భరత్ నాయక్, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, తహసీల్దార్ సురేష్ బాబు, ఆర్.ఓ లు, ఏ.ఆర్.ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు..!

### ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, భద్రతా చర్యలపై జిల్లా కలెక్టర్, ఎస్పీ సమీక్ష

**కడప, బ్యూరో చీఫ్ అక్టోబర్ 14: నంది పత్రిక** వైఎస్ఆర్ కడప జిల్లాలో గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సభాభవన్ లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సామగ్రి, సిబ్బంది నియామకం, పోలీసు బందోబస్తు, ఎన్నికల సామగ్రి, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తదితర అంశాలపై చర్చించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేపట్టి, ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు. వివిధ ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, తదుపరి కార్యాచరణను అధికారులు దృశ్య ప్రదర్శన ద్వారా వివరించారు. మున్సిపల్ కమిషనర్లు పట్టణ ఎన్నికల ఏర్పాట్లను, డీఎస్పీలు భద్రతా చర్యలను వివరించారు.

**గ్రామ పంచాయతీ ఎన్నికలకు 11.70 లక్షల మంది ఓటర్లు..**

జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు 11,70,375 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. వీరిలో 5,74,609 మంది పురుషులు, 5,95,707 మంది మహిళలు, 59 మంది ఇతరులు ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా ఎస్టీలు 28,581 మంది, ఎస్సీలు 2,18,487 మంది, బీసీలు 4,97,414 మంది, ఓసీ, ఇతర వర్గాలకు చెందిన వారు 4,25,893 మంది ఉన్నట్లు వివరించారు. ఓటర్ల జాబితాల తయారీకి 2026 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలోని 619 గ్రామ పంచాయతీలకు సుమారు 5,930 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు వెల్లడించారు. న్యాయస్థానం ఆదేశాల కారణంగా గతంలో ఎన్నికలు జరగని సి.గోపులాపురం, నూకినేనిపల్లి, టి.సుందుపల్లి, ఏడిగపల్లి గ్రామ పంచాయతీలకు కూడా ఓటర్ల జాబితాలను సిద్ధం చేసినట్లు తెలిపారు.

**ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఏర్పాట్లు...** ఎంపీటీసీ స్థానాల విభజనను ఆగస్టు 22న పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలతో పాటు జిల్లా పరిషత్‌కు సంబంధించిన తుది ఫొటో ఓటర్ల జాబితాలను సెప్టెంబర్ 14న ప్రచురించినట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాలపై క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం పటాలతో కూడిన తుది జాబితాను సెప్టెంబర్ 19న విడుదల చేసినట్లు తెలిపారు.జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు, మండల పరిషత్ అధ్యక్ష పదవులకు రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసి అక్టోబర్ 13న గెజిట్‌లో ప్రచురించినట్లు వెల్లడించారు. పాత పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో సెప్టెంబర్ 24న అన్ని మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ఎన్నికలకు అవసరమైన పత్రాలు, కవర్లను అక్టోబర్ 11న అన్ని మండలాలకు పంపిణీ చేసినట్లు వివరించారు.

**మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష...**

మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణకు సంబంధించి మున్సిపల్ కమిషనర్లు తమ



పరిధిలో చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది నియామకం తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఓటర్ల జాబితాల తయారీ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, శిక్షణ, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా, గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పత్రాల ముద్రణ వంటి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సమయాన్ని తప్పనిసరిగా పాటించాలని, అధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని తెలిపారు.

**పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు...** ఒక్కో పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,000 మంది ఓటర్లకు అవకాశం కల్పించాలని, కనీసం 20 చదరపు మీటర్ల విస్తీర్ణం ఉన్న భవనాలను ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ కేంద్రాలు కింది అంతస్తులోనే ఉండాలని, ఓటర్లు రెండు కిలోమీటర్లకు మించి ప్రయాణించాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని తెలిపారు. పాఠశాలలు, వార్డు కార్యాలయాలు, సామాజిక భవనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రులు, ప్రార్థనా స్థలాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, నీడ, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు, ర్యాంపులు, చక్రాల కుర్చీలు వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. బలహీన వర్గాల ఓటర్లు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

**ప్రజాప్రతినిధులతో సమన్వయం ముఖ్యం..** మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుతో పాటు.. ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమన్వయం అత్యంత ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. చట్టం, ఎన్నికల నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవసరమైన సమావేశాలు నిర్వహించి, వాటి వివరాలను, చర్చించిన అంశాలను, నిర్ణయాలను తప్పనిసరిగా సమావేశపు మినిట్స్ రూపంలో నమోదు చేయాలని ఆదేశించారు.పోలింగ్ నిర్వహణ, ఎన్నికల ప్రణాళిక, సమస్యాత్మక లేదా అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలపై రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు వ్యక్తం చేసే అభిప్రాయాలు, అభ్యంతరాలను నమోదు చేసి, వాటిని సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. వాస్తవ పరిస్థితులు, నిబంధనలు, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా స్వతంత్రంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవడం అధికారుల బాధ్యత అన్నారు.

**ఎన్నికల భద్రతపై జిల్లా ఎస్పీ సమీక్ష...** ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీసు అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. గత ఎన్నికల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న, తిరిగి పోలింగ్ నిర్వహించాల్సి వచ్చిన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సంబంధిత డీఎస్పీలు తమ పరిధిలో చేపట్టనున్న భద్రతా ఏర్పాట్లను వివరించారు. అవసరమైన చోట అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర నిఘా ఉంచాలని ఎస్పీ సూచించారు. ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండి, ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

**ఎన్నికల సామగ్రి, సిబ్బంది నియామకం...** ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ పెట్టెల లభ్యతపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమాచారం అందించామని, అదనపు పెట్టెల కోసం ప్రతిపాదనలు పంపామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బంది నియామకానికి కూడా ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. రూట్ అధికారులు, ఎగిరే తనిఖీ బృందాలు, స్థిర నిఘా బృందాలు, వీడియో నిఘా బృందాల నియామ కానికి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎన్నికలకు అవసరమైన వాహనాలు, బస్సుల సమీకరణ, భద్రత కలిగిన గదులు, ఓట్ల లెక్కింపు కేంద్రాల గుర్తింపు వంటి ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. మేయర్, చైర్‌పర్సన్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యుల ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పత్రాల ముద్రణ, భద్రపరిచే ప్రక్రియను నిబంధనల ప్రకారం చేపట్టాలని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచించారు.

# సిపిఐ పార్టీ చేపట్టిన దీక్షలు తాత్కాలికంగా వాయిదా



**కర్నూల్ సిటీ నంది పత్రిక** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు పదవ రోజుకు చేరుకున్నాయి ఈ కార్యక్రమానికి వి నాగరాజు అధ్యక్షత వహించగా, సిపిఐ పార్టీ నగర కార్యదర్శి కామ్రేడ్ పి రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దీక్షలుతాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలియజేశారు గత పది రోజులుగా కూటమి ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలు నెరవేర్చాలని పేదోడి సొంతింటి కలను నెరవేర్చాలని గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో అర్హులైన వారికి మూడు, రెండు సెంట్లు స్థలం ఇవ్వాలని జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు దీక్షలు చేపట్టింది. పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు కడుతున్న ప్రత్యక్ష,పరోక్ష పన్నుల రూపంలో చెల్లించిన డబ్బుల ద్వారా జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వ అధికారులు ప్రజల కోసం పనిచేస్తా ఉన్నారా లేక ప్రభుత్వాల కోసం పనిచేస్తున్నారా అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎందుకంటే అనునిత్యం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం కి కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారి, మరియు ఇతర అధికారులు. కార్లలో వస్తున్నారు పోతున్నారు తప్ప పేదలను అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు కనీసం రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం దీక్షలు చేస్తా ఉంటే మీకు పరిష్కరించాల్సిన బాధ్యత లేదా, లేదంటే పేద ప్రజలు అంటే మీకు చులకన అని ప్రశ్నించారు. భూములను బడా బాబులకు కట్టపెట్టాలంటే రాత్రికి రాత్రి జీవోలను తీసుకుని వచ్చి విలువైన భూములను తక్కువ ధరలకే కట్ట పెట్టడం లేదా అని వారు తెలియజేశారు. పేదోడి సొంతింటి కలలు నెరవేర్చాలంటే గత్యంతరం లేని పరిస్థితులలో బాధలను అర్థం చేసుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ గత నాలుగైదు ,సంవత్సరాల క్రితం భూ పోరాటం పేరుతోరెండు చోట్ల ప్రభుత్వ భూములను పేదలకు భూ పంపిణీ చేసింది కనీసం వాటికైనా మీ ప్రభుత్వానికి పేరు వచ్చే విధంగా పట్టాలు ఇవ్వండి అంటే మీరు జాప్యం చేస్తా ఉన్నారు దీన్ని బట్టి అర్థమవుతోంది స్థలం,ఇల్లు లేని వారు అంటే ప్రభుత్వానికి, ప్రభుత్వ అధికారులకు ఎంత చిన్నచూపునని, కావున భారత కమ్యూనిస్టు పార్టీగా, పేద బడుగు బలహీన వర్గాల ప్రజలుగా చట్టాలను, ప్రభుత్వాన్ని గౌరవిస్తూ ఎన్నికలు సజావుగా జరగాలనిదీక్షలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు ఆయన తెలియజేశారు. ఇది ఆరంభం మాత్రమే భవిష్యత్తులో చేయబోయే దీక్షలకు ప్రభుత్వము, ప్రభుత్వ అధికారులు బాధ్యత తీసుకోవాలని పేదోడి సొంతింటి కల మరియు పట్టాలు ఇచ్చేవరకు పోరాటాల ఆగవని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జిల్లా కార్యవర్గ సభ్యుడు కే శ్రీనివాసులు సిపిఐ పార్టీ నగర కార్యవర్గ సభ్యులు ఎం బీసన్న, భద్ర కుమార్, గిడ్డెమ్మ,నల్లన్న , అశోక్, ఇళ్ల స్థలాలు, పట్టాలు లేని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు, గౌరవం

### తడకనపల్లె వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డుల పంపిణీ
### మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కల్లూరు మండలం తడకనపల్లె గ్రామానికి చెందిన వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులను వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రతి నాయకుడికి, కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలనే ఉద్దేశంతో ఈ గుర్తింపు కార్డులను అందజేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తడకనపల్లె గ్రామ నాయకులు కృష్ణ రెడ్డి, వేణు గోపాల్ రెడ్డి, చిన్న స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని అధికారంలోనికి తీసుకుని రావడమే మన ఆశయం

**కర్నూలు మేయర్ స్థానాన్ని హస్తగతం చేసుకుంటాం**

**68 వార్డులకు కాంగ్రెస్ పార్టీ పోటీ**

**కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఏఐసీసీ సభ్యులు జే లక్ష్మీ నరసింహ యాదవ్**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కాంగ్రెస్ పార్టీని అధికారంలోనికి తీసుకుని రావడమే మన ఆశయమని ఏఐసిసి సభ్యులు, నంద్యాల మాజీ డిసిసి అధ్యక్షులు కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జే లక్ష్మీనరసింహ యాదవ్ అభిప్రాయపడ్డారు. ఏఐసిసి సూచన మేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఉదయం కర్నూల్ కార్పొరేషన్ పరిధిలోని 68 వార్డుల కాంగ్రెస్ నాయకులతో సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగినది. ఈ సమావేశమునకు ముఖ్య అతిథులుగా చేసిన కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఏఐసీసీ సభ్యులు జె లక్ష్మీ నరసింహ యాదవ్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వము అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను జగన్ పార్టీ కట్టడి చేయలేక పోయిందని, దళితులు, ముస్లింలు కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంక్ అని కార్పొరేషన్ లో ఎక్కడ ఓటు ఉన్నా ఏ వార్డు నుంచైనా పోటీ చేసే అవకాశం ఉంటుందని ముఖ్యంగా పార్టీలో పని చేసే వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని త్వరలో అభ్యర్థుల జాబితా జిల్లా కమిటీ రాష్ట్ర కమిటీకి పంపిస్తుందని, రాష్ట్ర కమిటీ అభ్యర్థులను ఎంపిక చేస్తుందని రాష్ట్ర కమిటీ నిర్ణయించిన తర్వాతనే బీఫారాలు అభ్యర్థులకు ఇవ్వబడునని కర్నూలు కార్పొరేషన్ నందు మేయర్ మరియు కార్పొరేటర్ అభ్యర్థులుగా నిలబడేందుకు చాలామంది కాంగ్రెస్ పార్టీ తరపున ముందుకు వస్తున్నారని కానీ ముందు ప్రాధాన్యత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఉంటుందని ఇప్పటికే చాలామంది అభ్యర్థులు ముందుకు వచ్చారని అందరం కష్టపడి కర్నూలు కార్పొరేషన్ మేయర్ స్థానాన్ని హస్తగతం చేసుకుంటామని అందరం కలిసి పనిచేసి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని పోటీ చేసే అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలని కర్నూలు కార్పొరేషన్ లో ప్రతి వార్డుకు అభ్యర్థులను పోటీకి దింపుతామని, గెలుపోటములు దైవాధీనం అని అధిష్టానం నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని లక్ష్మీ నరసింహ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యులు ఎం సుధాకర్ బాబు, నియోజక వర్గాల కోఆర్డినేటర్లు ఎం కాశీం వలి, అనంతరత్నం, అనుబంధ సంఘాల చైర్మన్లు ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు కిసాన్ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ ఈ సూర్య ప్రకాష్ రెడ్డి మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐ ఎన్ టి యు సి రాష్ట్ర కార్యదర్శి ఎం సుంకన్న, ఐ ఎన్ టి యు సి ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సయ్యద్ ఖాద్రి భాష, పిసిసి సభ్యులు కే బాలస్వామి, కర్నూల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అలీ ఖాన్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రజాక్ వలి, కార్యదర్శి సయ్యద్ వాషీ బాషా, ఐ ఎన్ టి యు సి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, ఎస్సీ సెల్ మాజీ జిల్లా చైర్మన్ ఈ లాజరస్ మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు బి హైమావతి, కాంగ్రెస్ నాయకులు షేక్ రియాజుద్దీన్, సయ్యద్ నవీద్, మాలిక్ భాష, జాన్ సదానందం, విజయ భాస్కర్, జోసెఫ్ నోయల్, జోసెఫ్ నోయల్, ఓబిసి నాయకురాలు భాగ్యలక్ష్మి, వార్డు ఇన్చార్జీలు షేక్ షబ్బీర్, జావీద్, హుస్సేన్, ఎం అహ్మద్ అలీ ఖాన్, హుస్సేన్, ఎల్లమ్మ మొదలగు వారు పాల్గొన్నారు.

# బండి ఆత్మకూరు మండలంలో సర్పంచు పదవుల రిజర్వేషన్ వివరాలు

**బండి ఆత్మకూరు నంది పత్రిక అక్టోబర్ 14:** బండి ఆత్మకూరు మండలంలో సర్పంచి పదవులకు సంబంధించి రిజర్వేషన్ వివరాలను అధికారులు ప్రకటించారు. ఏ కోడూరు జనరల్ మహిళ, బి కోడూరు జనరల్ అల్, బండి ఆత్మకూరు బిసి ఆల్, భోజనం ఎస్సీ మహిళ, చిన్న దేవులాపురం జనరల్ మహిళ, ఈర్నపాడు జనరల్ ఆల్, జి సీ పాలెం జనరల్ ఆల్, జి లింగాపురం జనరల్ అల్, కడమల కాల్వ బీసీ మహిళ, కాకనూరు ఎస్సీ మహిళ, నారాయణపురం ఎస్సీ ఆల్, పరమటూరు బి సి మహిళ, పార్నాపల్లి మహిళా జనరల్,పెద్దదేవలాపురం ఎస్టి మహిళ ,రామాపురం జనరల్ మహిళ , సంత జూటూరు జనరల్ మహిళా,సింగవరం ఎస్సీ ఆల్ ,సోమయాజుల పల్లె బి సి ఆల్ వెంగలరెడ్డి పేట జనరల్ ఆల్ యర్రగుంట్ల బి సి అల్ లకు కేటాయించారు.

# మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**మున్సిపల్ ఎన్నికల బందోబస్తు విధుల పై అధికారులకు దిశా నిర్దేశం చేసిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** రాబోయే మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ పోలీసు అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా బుధవారం ఆదోని మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ లో మున్సిపల్ ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల బందోబస్తు స్కీమ్‌ను సమీక్షించి, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బందోబస్తు విధుల్లో అప్రమత్తంగా ఉంటూ, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఏఎస్పీ జయశర్మ ఐపీఎస్ , సీఐలు మధుసుధన్ రావు, చంద్రశేఖర్, నల్లప్ప, రాజశేఖర్ రెడ్డి, రామలింగమయ్య, మహమ్మద్ గౌస్ లు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

**నాయకులకు, కార్యకర్తలకు కాటసాని పిలుపు**





**కర్నూలు సిటి నంది పత్రిక** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కల్లూరు అర్బన్ 35వ వార్డుకు చెందిన వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలతో వైయస్సార్సీపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సన్నద్ధత, పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావడం, వార్డులో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయడం వంటి అంశాలపై చర్చించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని, పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే కార్యాచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వార్డు వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యాపర్లపాడులో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణం

**రూ 40 లక్షలు నిధులు మంజూరు చేసిన శ్రీవాణి ట్రస్టు**

**భూమి పూజ నిర్వహించిన స్థల దాత గ్రామ పెద్దలు**



**కర్నూలు సిటీ నంది పత్రిక** పాణ్యశీ ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ఆదేశాల మేరకు శ్రీవాణి ట్రస్టు ద్వారా కల్లూరు మండలం యాపర్లపాడు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి రూ 40 లక్షలు మంజూరు చేశారు. కొత్త దేవాలయ నిర్మాణానికి స్థల దాత పివి రమణ గ్రామ పెద్దలు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయానికి భూమి ఇచ్చిన పి వి రమణ, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు వెంకటరమణ, శివారెడ్డి, ఎం వెంకటేశ్వర రెడ్డి వెంకటేశ్వర్లు, మహేశ్వర్ రెడ్డి పెద్ద సోమన్న, పెద్ద గుడిసె వెంకటేశ్వర్లు, వడ్డే గోవిందు, కృష్ణ, రాముడు, రోశన్న , ఎన్ శివన్న, ఎం గోవిందు మరియు గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ మద్దిలేటి లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం సన్నిధిలో శరణ్నవరాత్రి ఉత్సవాలు.

**శ్రీ అన్నపూర్ణేశ్వరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చిన శ్రీ మహాలక్ష్మి అమ్మ వారు.**



**బేతంచెర్ల అక్టోబర్ 14 ( నందిపత్రిక ).** బేతంచెర్లమండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలసి ఉన్న ప్రముఖ వైష్ణవ క్షేత్రం శ్రీ ఘన మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం శరణ్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నాల్గవ రోజు శ్రీ మహాలక్ష్మి అమ్మవారి కి పూజలు నిర్వహించారు. శ్రీ అన్నపూర్ణేశ్వరి దేవి గా పట్టు వస్త్రాలు ఆభరణాలు మరియు పూలతో అలంకరించారు. ఈ కార్యక్రమాలు డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఉన్నం ఎల్ల నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు,వేద పండితులు,అర్చక స్వాములు,ఆలయ సిబ్బంది మరియు భక్తులు ఘనంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

# 41 వ వార్డు టిడిపి అభ్యర్థిగా పూల శివశంకర్

**టిడిపి అభ్యర్థి పూల శివశంకరును అభినందిస్తున్న గ్రామ నాయకులు దేవేందర్ రెడ్డి శేఖర్ చౌదరి**





**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూల్ కార్పొరేషన్ పరిధిలోని 41 వ వార్డు బీసీ జనరల్ కు రిజర్వ్ చేశారు. ఈ సీటుకు టిడిపి అభ్యర్థిగా బోయ పూల శివ శంకర్ కి కేటాయించారు. దీంతో పందిపాడు గ్రామానికి చెందిన పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి, టిడిపి సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డికి ముకమ్మడిగా వెళ్లి ఘన సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# అహోబిలంలో వైభవంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 14 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ వైష్ణవ పుణ్య క్షేత్రమైన అహోబిలంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు తిరుమంజన సేవను ఘనముగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాల స్వామి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారికి పవిత్ర జలాలతో, వేదమంత్రోచ్చారణల నడుమ తిరుమంజన సేవ నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ దివ్య సేవను దర్శించుకున్న భక్తులు స్వామివారి దివ్య అనుగ్రహానికి పాత్రులు అయ్యారు. ఎగువ అహోబిలంలో కూడా ప్రతినిత్యం స్వామివారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఆంధ్ర, తెలంగాణ,కర్ణాటక తమిళనాడు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. పూజలలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం వారు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.



# గాయత్రీ దేవిగా శ్రీశ్రీశ్రీ కాళికామాత



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 14, నంది పత్రిక** స్థానిక విశ్వరూప పారిశ్రామిక నగర్ లో వెలసిన శ్రీ కాళికా మాత దేవస్థానము నందు బుధవారం అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి, గాయత్రీ దేవిగా అలంకరించారు. అర్చకులు చంద్రశేఖర్ ఆచార్యులు, లోకేష్ ఆచార్యులు పూజలు నిర్వహించారు. ఉభయదారులుగా దురుగడ్డ సాయి ఆచార్యుల దంపతులు, సాయంత్రం పూజ ఉభయదారులుగా కమ్మరి కేశవాచార్యుల దంపతులు పాల్గొన్నారు. అనంతరం మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం పలుకూరి సురేష్ ఆధ్వర్యంలో మహిళలచే స్టార్ మహిళ వినోదభరిత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు యద్దనపూడి శ్రీనివాసచారులు, ఉపాధ్యక్షులు ముత్తలూరు సురేష్ ఆచార్యులు, ప్రధాన కార్యదర్శి యాడిగోపాలాచార్యులు, కోశాధికారి రామ్మోహన్ ఆచార్యులు, గౌరవాధ్యక్షులు వడ్ల పెద్ద సుబ్బయ్యాచార్యులు, కోటేశ్వరరావు ఆచార్యులు, కమిటీ సభ్యులు, మహిళ కమిటీ అధ్యక్షురాలు కమ్మరి విశాలాక్షి, ఉపాధ్యక్షురాలు వడ్ల లక్ష్మీదేవి, పన్నీరు పుల్లమ్మ, హరీష దేవి, సరస్వతి, పద్మావతి, రాజీ, విజయ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం.

**ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.**

**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** పేద ప్రజలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని, వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యంగా జీవించాలని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. కర్నూలు నగరంలోని 48 వ వార్డు రోజా వీధిలో కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ ఆధ్వర్యంలో వైద్య శిబిరం లో కంటి పరీక్షలు ఈసీజీ, షుగర్ బిపి వంటి పరీక్షలను ఉచితంగా చేశారు. అవసరమైన వారికి కంటి అద్దాలను పరీక్షలను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని అన్నారు ప్రైవేటు హాస్పిటల్ లో అందిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకొని అనారోగ్య సమస్యల నుంచి బయటపడేలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడికవర్ హాస్పిటల్ సిబ్బంది, సన్ షైన్ కంటి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# పాక్ సహా 31 దేశాల పైలట్లపై 'ఎయిర్ ఫ్రాన్స్' నిషేధం

ఇజ్రాయెల్‌కు వెళ్లే తమ విమానాల్లో పనిచేసే సిబ్బంది విషయంలో ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనలను పాటించనున్నట్లు ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఫ్రాన్స్ ధృవీకరించింది. ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు లేని పాకిస్థాన్ సహా 31 దేశాలకు చెందిన పైలట్లు, క్యాబిన్ సిబ్బందిని తమ దేశంలోకి అనుమతించబోమని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎయిర్ ఫ్రాన్స్ తన సిబ్బందికి సమాచారం అందించింది. ఇటీవల ఫ్లైదుబాయ్ విమానంలో చోటుచేసుకున్న భద్రతా సంఘటనే ఈ కఠిన నిబంధనలకు దారితీసింది. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానాన్ని ఒమన్‌కు చెందిన సహ పైలట్ హైజాక్ చేసేందుకు యత్నించిన విషయం తెలిసిందే. బెన్ గురియన్ విమానాశ్రయాన్ని ఢీకొట్టేందుకు ప్లాన్ చేశాడని, ఈ క్రమంలో భారత కెప్టెన్‌పై దాడి చేశాడని తెలిసింది. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే ఇజ్రాయెల్ రవాణా మంత్రిత్వ శాఖ విదేశీ విమానయాన సంస్థలకు ఓ ఆదేశం జారీ చేసింది. పాకిస్థాన్, ఇరాన్, సౌదీ అరేబియా, అల్జీరియా, ట్యూనీషియా, ఒమన్ వంటి 31 ముస్లిం మెజారిటీ దేశాల జాతీయత లేదా ద్వంద్వ పౌరసత్వం ఉన్న సిబ్బందిని ఇజ్రాయెల్‌కు వచ్చే విమానాల్లో నియమించవద్దని స్పష్టం చేసింది. ఈ నిబంధనలను పాటించకపోతే సంస్థతో పాటు ఉద్యోగులు కూడా చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎయిర్ ఫ్రాన్స్ తన అంతర్గత మెమోలో పేర్కొన్నట్లు సమాచారం.

# క్రీడలతో యువతలో నూతనోత్సాహం

**కెపిఎల్ సీజన్1 విజేతలకు ట్రోఫీలు అందజేత**

**క్రీడాకారులను అభినందించిన వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని**

**కర్నూలు సిటి నంది పత్రిక** క్రీడలు యువతలో నూతనోత్సాహాన్ని నింపడంతో పాటు ఐకమత్యం, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి అన్నారు. రెడ్డిపోగు అంజి, పాలకొలను రమేష్ నేతృత్వంలో కర్నూలులోని జోహరాపురం రోడ్డులో ఉన్న మైపర్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన లైట్ టెన్నిస్ క్రికెట్ లీగ్ కేపీఎల్ సీజన్1లో విజయం సాధించిన జట్లకు కాటసాని రామభూపాల్ రెడ్డి ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ టోర్నమెంట్‌లో విజేతగా కృష్ణా నగర్ కు చెందిన జోసెఫ్ 11 జట్టు నిలవగా, రన్నరప్‌గా ముజఫర్ నగర్ ఓల్డ్ స్కూల్ జట్టు నిలిచింది. ఈ సందర్భంగా విజేతలు, రన్నరప్ జట్ల క్రీడాకారులకు కాటసాని రాంభూపాల్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. క్రీడలు యువతలో స్నేహభావం, ఐకమత్యం, క్రమశిక్షణతో పాటు జట్టుగా పనిచేసే స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కేపీఎల్ సీజన్1ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులు రెడ్డిపోగు అంజి, పాలకొలను రమేష్‌లను కాటసాని రామభూపాల్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మైతపు నరసింహులు, సాన శ్రీనివాసులు, నాయకులు వీరయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ మార్గదర్శకాలను సమర్ధవంతంగా అమలు చేయాలి



## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 14 నంది పత్రిక** స్థానిక కలెక్టరేట్ వశిష్ట కాన్ఫిడెన్స్ సమావేశ మందిరంలో మంగళవారం బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ మార్గదర్శకాలను సమర్ధవంతంగా అమలు చేయాలని మరియు ప్రజారోగ్య పర్యావరణాన్ని పరిరక్షించడానికి సిబ్బందికి అవగాహన కల్పించాలని , రికార్డులు నిర్వహణ మరియు నిరంతరం పర్యవేక్షణ అవసరమని సంబంధిత అధికారులు ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రిలో నుండి ఉత్పన్నమైన బయో మెడికల్ వ్యర్థాలను సమర్ధవంతంగా నిర్వహించాలి అన్నారు. మానవ వ్యర్థాలు పసుపు రంగు బ్యాగుల్లో, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎరుపు రంగు బ్యాగుల్లో, గ్లాస్ వ్యర్థాలను నీలం రంగు బ్యాగుల్లో, సిరంజలు, మెటల్స్ తెలుపు రంగు బ్యాగులలో, సేకరించి ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన బయో మెడికల్ స్టోరేజీ రూమ్స్ లో ఉంచాలన్నారు. వాటిని 48 గంటల లోపు కామన్ బయో మెడికల్ ట్రీట్మెంట్ వేస్ట్ ఫెసిలిటీ ఉంగుటూరు సేఫ్ ఎన్విరాల్ వారికి నిర్వహణ నిమిత్తం పంపాలని అన్నారు. అన్ని ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులు యందు వ్యర్థాలను సక్రమముగా విడి విడిగా వేరు చేయడం ముఖ్యమన్నారు.వేస్ట్ బార్ కోడింగ్ సిస్టమును కచ్చితంగా పాటించాలని అన్నారు. 25 పడకలు పైన ఉన్న హాస్పిటల్స్ ,మరియు జిల్లాలోని ఏరియా హాస్పిటల్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, వారందరూ వ్యర్థ నీటిని శుద్ధి



చేసే ప్లాంటులను కచ్చితంగా ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో పశువుల ఆసుపత్రుల లో వచ్చిన వ్యర్థాలను కామన్ బయో మెడికల్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ వారిని సంప్రదించి వ్యర్థాలను పంపే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ఆమె ఆదేశించారు.ఈ సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇ ఇ ఏ ఎస్ రామచంద్ర మూర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం రవిబాబు, డి సి హెచ్ ఎస్ పి.సూర్యనారాయణ, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ఆర్ కె రాజు, ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి తణుకు సూపరింటెంట్ కె. సాయికిరణ్, పబ్లిక్ హెల్త్ ఈ ఈ లు, నర్సింగ్ హోమ్ అసోసియేషన్ డా. సోమరాజు, డా.అనీల్ కుమార్, ఎస్ ఆర్ కె ఆర్ కాలేజీ ప్రొఫెసర్ విశ్వనాథ రాజు, పొల్యూషన్ బోర్డ్ ఏఈ రమేష్, ఎనలిస్ట్ తేజస్వి,తదితరులు పాల్గొన్నారు.

# దసరా శరన్నవరాత్రుల బందోబస్తు ఏర్పాట్లను, సాంకేతిక ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర డి.జి.పి. హరీష్ కుమార్ గుప్తా







## కృత్రిమ మేధా పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నాం......రాష్ట్ర డి.జి.పి. హరీష్ కుమార్ గుప్తా

**విజయవాడ బ్యూరో చీఫ్ ప్ అక్టోబర్ 14 నంది పత్రిక** విజయవాడ నగరంలో ది ఈనెల.11.నుండి.20వరకు వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఈ రోజు రాష్ట్ర డి.జి.పి. హరీష్ కుమార్ గుప్తా కుటుంబ సమేతంగా కనకదుర్గమ్మను దర్శించు కోవడం జరిగింది. ఈ నేపథ్యంలో మోడల్ గెస్ట్ హౌస్ నందు ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ ను పరిశీలించి ఈరోజు రేపు విజయవాడలో జరిగే భారత రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి రూట్ మ్యాప్, కాన్వాయ్ నిర్వహణ, సభా ప్రాంగణాలు మరియు బస చేసే ప్రాంతాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లపై అధికారులకు తగు సూచనలు చేసారు. ఈ సందర్భంగా డి.జి.పి. మాట్లాడుతూ..... ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల భద్రత, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణకు పోలీసు శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తోంది. "పోలీసు శాఖలో కృత్రిమ మేధా పరిజ్ఞానాన్ని ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో ఎక్కువగా వినియోగిస్తున్నాం" భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో సంప్రదాయ పోలీసు బందోబస్తుతోపాటు సాంకేతిక నిఘా వ్యవస్థలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఏఐ ఆధారిత రద్దీ విశ్లేషణ ద్వారా భక్తుల రాకపోకలను అంచనా వేయడం, రద్దీ పెరిగే ప్రాంతాలను గుర్తించడం, అవసరమైన చోట్ల సిబ్బందిని అప్రమత్తం చేయడం లక్ష్యంగా చర్యలు చేపట్టారు. పోలీసు కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా వివిధ ప్రాంతాల పరిస్థితులను సమన్వయంతో పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ మళ్లింపు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన వంటి అంశాల్లో సాంకేతిక సమాచారాన్ని ఉపయోగించుకుంటున్నారు. అవసరమైన సందర్భాల్లో పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో తక్షణ చర్యలు తీసుకునేలా సమన్వయం చేస్తున్నారన్నారు. దసరా ఉత్సవాల్లో ఏఐతోపాటు మానవ పర్యవేక్షణ, క్షేత్రస్థాయి పోలీసు బందోబస్తు, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయం కీలకమని అధికారులు భావిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన అమ్మవారి దర్శనం కల్పించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. భక్తులు పోలీసుల సూచనలు పాటించాలని, క్యూలైన్లలో క్రమశిక్షణతో ముందుకు సాగాలని, అనుమతి లేని మార్గాల్లోకి వెళ్లరాదని అధికారులు సూచిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు, ఇతరుల సహాయం అవసరమైన భక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే సమీప పోలీసు సిబ్బందికి తెలియజేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో

నగర పోలీసు కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు , డి.సి.పి.లు కృష్ణ ప్రసన్న , గుణ్ణం రామ కృష్ణ దేవస్థానం ఈ.ఓ. శీనా నాయక్ ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు

# ఆళ్లగడ్డ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తాం..





## ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పడకండ్లలో 75 లక్షలతో మెయిన్ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టాం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 14 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో గతంలో పాత భవనంలో రోగులు, వైద్యులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం 50 పడకల నూతన ఆసుపత్రి భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతం కావడంతో ఆర్థో వైద్యుల కొరతను పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన వైద్యులను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రమాద బాధితులను నంద్యాలకు తరలించేలోపు ఇబ్బందులు ఎదురుకాకుండా భవిష్యత్తులో ఆళ్లగడ్డ ఆసుపత్రిలోనే అవసరమైన అత్యవసర వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హామీ ఇచ్చారు.అలాగే ఆసుపత్రి ఓపీ విభాగంలో రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, వైద్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుజాత ఆసుపత్రి వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**పడకండ్ల లో 75 లక్షల రూపాయలతో మెయిన్ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టాం**ఆళ్లగడ్డ పట్టణంలోని పడకండ్ల రూ.75 లక్షలతో మెయిన్ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. తెలిపారు. ముందుగా అంతర్గత డ్రైనేజీ పనులు చేపట్టాలని భావించినప్పటికీ, మెయిన్ డ్రైన్ లేకుండా కాలువలు నిర్మిస్తే మురుగు నీరు బయటకు వెళ్లే అవకాశం ఉండదని గుర్తించినట్లు చెప్పారు. దీంతో అదనపు నిధులు సమకూర్చి మెయిన్ డ్రైన్ నిర్మాణాన్ని చేపట్టామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.

మెయిన్ డ్రైన్ పూర్తయిన అనంతరం గ్రామంలోని అంతర్గత రోడ్లు, కాలువల నిర్మాణ పనులు కూడా చేపడతామని అఖిలప్రియ చెప్పారు. ఆళ్లగడ్డ పట్టణంలోనూ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి మురుగు నీరు బయటకు వెళ్లేందుకు సరైన అవుట్‌ఫ్లో వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

కూటమి హ్యామ్ పథకం కింద ఆళ్లగడ్డ పట్టణ అభివృద్ధికి రూ.21 కోట్ల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టామని, రానున్న రోజుల్లో ఆళ్లగడ్డ పట్టణంతో పాటు గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని భూమా అఖిలప్రియ స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి కిషోర్ శానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి టిడిపి నాయకులు మాజీ కౌన్సిలర్ హుస్సేన్ భాష శ్రీనివాసరెడ్డి నాగిరెడ్డిపల్లి శేఖర్ రెడ్డి నాగాంజనేయులు జాఫర్ రెడ్డి పడకండ్ల సుధాకర్ రెడ్డి, మద్దిలేటి, టిడిపి నాయకులు కార్యకర్తలు భూమా అభిమానులు పాల్గొన్నారు

# యూపీఐ ఎండీఆర్ వాయిదా.. కేంద్రం నిర్ణయానికి వ్యాపార సంఘాలు కృతజ్ఞతలు

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ఫేస్ యూపీఐ) లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వాయిదా వేయడంపై వ్యాపార సంఘాలు స్పందించాయి. ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతించాయి. పండగ సీజన్ ముందు దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించిన విషయం తెలిసిందే. యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధించే నిర్ణయాన్ని వాయిదా వేసింది. అక్టోబర్ 15 తర్వాత ఈ ఛార్జీలను అమలు చేయాలని తొలుత భావించినప్పటికీ, వ్యాపారుల నుంచి వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో గడువును పొడిగించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన వ్యాపార సంఘాలు, ఎండీఆర్ ప్రతిపాదనను శాశ్వతంగా రద్దు చేయాలని కూడా విజ్ఞప్తి చేశాయి. యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధిస్తే వ్యాపార నిర్వహణ ఖర్చులు పెరుగుతాయని, ముఖ్యంగా దీపావళి వంటి పండగ సీజన్‌లో డిజిటల్ లావాదేవీలు ఎక్కువగా జరిగే సమయంలో ఇది తమపై అదనపు భారం మోపుతుందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం వ్యాపారులకు ఉపశమనం కలిగించింది.

ఈ నిర్ణయంపై చాందినీ చౌక్ ట్రేడర్స్ కౌన్సిల్ కోశాధికారి రాజీవ్ అగర్వాల్ మాట్లాడుతూ, "ఇది చాలా మంచి నిర్ణయం. ప్రధాని నరేంద్ర మోదీ మొదటి నుంచి వ్యాపారుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారు. ఎండీఆర్ అమలు నిర్ణయం వాస్తవానికి వ్యాపారులపై గానీ, కొనుగోలుదారులపై గానీ పెద్దగా ప్రభావం చూపేది కాదు. అప్పుడు ఆ నిర్ణయాన్ని స్వాగతించాం. ఇప్పుడు దాని వాయిదాను కూడా స్వాగతిస్తున్నాం" అని ఐఏఎన్ఎస్‌కు తెలిపారు. సదర్ బజార్ బారీ మార్కెట్ ట్రేడర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పరమ్‌జీత్ సింగ్ మాట్లాడుతూ "ఇది కచ్చితంగా సరైన నిర్ణయం. మేం దీనిని స్వాగతిస్తున్నాం. ఈ అంశంపై మేం నిరసన తెలిపి, పునఃపరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరాం. పండగ సమయంలో ఈ ఛార్జీల వల్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు" అని అన్నారు. ఢిల్లీ శారీ మర్కంటైల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్ భరద్వాజ్ స్పందిస్తూ.. "ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వ్యాపారులకు, వినియోగదారులకు ఇద్దరికీ ప్రయోజనకరం

# ప్రభుత్వ భూములు ఆక్రమణ పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవు

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 14 నంది పత్రిక** జిల్లాలో ప్రభుత్వ భూములు ఆక్రమణ లకు గురికాకుండా కాపాడవలసిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ సమావేశం నందు రెవిన్యూ, ఇరిగేషన్, డ్రైన్స్, మత్స్యశాఖ, ఎలక్ట్రిసిటీ, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి,మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైతే తక్షణ చర్యలు తీసుకుని, తొలగించాలని అన్నారు. గతంలో ఆక్రమణలు తొలగించి నప్పటికీ, ఆక్రమణలకు, గురైతే అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు చూస్తూ ఉంటే ఊరుకునేది లేదని అట్టి వారిపై చర్యలు తప్పవని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వ భూములు కాపాడే బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణల పట్ల నిర్లక్ష్యంగా వహించే అధికారుల పై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్డీవో దాసిరాజు,మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ డా డి. శ్రీనివాస్, జిల్లా విద్యుత్ శాఖ అధికారి పులి ఉషారాణి, తాహసిల్దార్ షేక్ మహమ్మద్ ఫరూక్, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్, అప్పారావు, ఇరిగేషన్, ట్ డ్రైన్స్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు లోటుపాట్లు లేకుండా నిర్వహించటానికి అధికారులు చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం, బ్యూరో చీఫ్ అక్టోబర్ 14 నంది పత్రిక** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు లోటుపాట్లు లేకుండా నిర్వహించటానికి చర్యలు తీసుకోవా లని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని ఆమె చాంబర్ లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మున్సిపల్, పంచా యతీరాజ్ అధికారు లతో సమీక్ష సమావే శం నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్థానిక సంస్థలు నరసాపురం మున్సిపాలిటీ, ఆకివీడు నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వ హించడానికి ప్రభుత్వం నోటిఫికే షన్ జారీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని నర్సాపూర్ మున్సిపాలిటీ, ఆకివీడు నగర పంచాయతీలో ఈనెల 16 తేదీ నుండి 18వ తేదీ వరకు నామినేషన్ స్వీకరించడం జరుగు తుందన్నారు. 28వ తేదీన పోలింగ్ జరు గుతుందన్నారు. 30వ తేదీ ఎన్నికల కౌంటింగ్ జరుగు తుందని కలెక్టర్ చెప్పారు. పోలింగ్ సిబ్బందికి వెంటనే శిక్షణ ఇవ్వాలని ఆమె చెప్పారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభ మైనందున ఎన్నికల ప్రవర్తన నియమా వళిని అమలు చేయాలని అధికారు లకు చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. అర్.కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి పి. గ్లోరియా, జిల్లా పర్షిత్ సి.ఇ.ఓ రమణ, జిల్లా పంచాయతీ అధికారి దోసిరెడ్డి, భీమవరం మున్సిపల్ కమిషనర్ రామ చంద్రారెడ్డి, నరసాపురం మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి, ఆకివీడు మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ కాత్యాయని దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి.

## దసరా శరన్నవ రాత్రుల ఉత్సవాలు4లో భాగంగా స్వస్తిశ్రీ పరాభావ నామ సంవత్సరం ఆశ్వయుజ శుద్ధ



**బేతంచెర్ల అక్టోబట్ 14 ( నంది పత్రిక ).** : బేతంచెర్ల పట్టణం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయం ( అమ్మవారి శాల ) నందు, దసరా శరన్నవ రాత్రుల ఉత్సవాలులో భాగంగా,స్వస్తిశ్రీ పరాభావ నామ సంవత్సర ఆశ్వయుజ శుద్ధ చవితి బుధవారం నాడు, శ్రీ కాత్యాయని దేవి అలంకారములో భక్తులకు అమ్మ వారిని దర్శనం గావించారు. గుండా గోపాల్ వీరి భార్య జయలక్ష్మి & సన్ కలిసి 2వేల 5 వందల రూపాయలు విలువ గల పట్టు చీరను అమ్మ వారికి సమర్పించారు. కీ.శే.ఇటికేల సుబ్బ రాయుడు శెట్టి వీరి భార్య శేషమ్మ & సన్స్,లగి శెట్టి విశ్వనాదం శెట్టి, ( విగ్నేశ్వర మెడికల్ ఏజెన్సీష్, కర్నూలు ).కందగడ్డల పుల్లయ్య శెట్టి వీరి భార్య సాయమ్మ & సన్స్ ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే కీ. శే. గుండా తాతయ్య శెట్టి వీరి భార్య ప్రమీలమ్మ, కీ. శే. వంకదారి కృష్ణ మూర్తి కుమారుడు కిరణ్ కుమార్ వీరి భార్య కృష్ణ వేణి & సన్స్, గుంతా వెంకట సుబ్బయ్య గుప్త వీరి భార్య ఉషా రాణి & సన్, కీ. శే. గుండా పుల్లయ్య కుమారుడు విజయ భాస్కర్ వీరి భార్య పూజిత & సన్, ఆలం పల్లె మధు సూధన గుప్త వీరి భార్య మాధవిగుప్త & సన్స్ లు కలిసి రాత్రి పూజా కారక్రమాలును జరిపించారు. అధిక సంఖ్యలో ఆర్య వైష్యులు భక్తాదులు పాల్గొన్నారు.



# ఉద్యోగ సంఘాల వినతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

### 13 ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



**నంద్యాల బ్యూరో, అక్టోబరు 14(నంది పత్రిక)–** ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సమర్పించిన వినతులను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిబంధనల మేరకు పరిశీలించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో 13 ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఆమె సమావేశమై వారి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పెండింగ్ మెడికల్ బిల్లులు, స్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధించిన టీఏ, డీఏ, పారితోషికాల విడుదల, ఈ–సర్వీస్ రిజిస్టర్ నమోదు, పీఎఫ్ సమస్యలు, పదోన్నతులు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల కొరత తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఖాళీ పోస్టుల భర్తీ, కార్యాలయాల మరమ్మతులు, కంప్యూటర్లు, నెట్‌వర్క్ సదుపాయాలు, సిబ్బందికి శిక్షణ, పదోన్నతులు వంటి అంశాలను వివరించారు. ఇతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కార్యాలయాల్లో కనీస మౌలిక సదుపాయాలు, పెన్షనర్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, నాలుగో తరగతి ఉద్యోగుల ఖాళీలు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుత ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అమల్లో ఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత అంశాలపై చర్యలు చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఉద్యోగ సంఘాల వినతులను నిబంధనల మేరకు సంబంధిత అధికారుల ద్వారా పరిశీలించేలా చూస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాము నాయక్ కలెక్టరేట్ ఏవో శుభకర రావు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పురపాలక సంఘం లోని అన్ని పోలింగ్ కేంద్రాలు తనిఖీ



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 14, నంది పత్రిక** ఆళ్లగడ్డ పురపాలక సంఘం ఎన్నికల సూపర్వైజింగ్ ఆఫీసర్ పి విశ్వనాథ్ బుధవారం ఆళ్లగడ్డ పురపాలక సంఘం లోని అన్ని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం ఎలక్షన్ ఆఫీసర్స్ అందరితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను క్షుణ్ణంగా మరొకసారి అందరికీ వివరించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, స్టాటిక్ సర్విలెన్స్ టీం అత్యంత పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. అలాగే ఎన్నికల నిర్వహణలో పాల్గొనే అధికారులు అందరూ కూడా నిజాయితీగా నిష్పక్షపాతంగా ఎలాంటి విభేదాలకు తావు లేకుండా పనిచేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి కిషోర్, డిప్యూటీ తాసిల్దార్ నర్సిరెడ్డి సానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి పురపాలక సంఘ సిబ్బంది, ఎలక్షన్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

## జర్మనీలో ఘోర అగ్నిప్రమాదం..

జర్మనీలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. బోచుమ్ నగరంలోని ఓ నివాస భవనంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనలో మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ సంఘటనపై హత్య అనుమానంతో పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

# వెలుగోడు మండలంలో సర్పంచ్ రిజర్వేషన్లు ఖరారు

### వెలుగోడు మేజర్ పంచాయతీ బీసీ మహిళకు.. ఎంపీపీ స్థానం కూడా బీసీ మహిళకే

**వెలుగోడు, అక్టోబర్ 14 (నంది పత్రిక):**వెలుగోడు మండలంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో గ్రామాల్లో రాజకీయ సందడి మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేయడంతో ఇప్పటికే ఎన్నికల బరిలో నిలవాలని ఆశావహులు తమకు అనుకూలంగా రిజర్వేషన్ వస్తుందని ఆశించారు. అయితే రిజర్వేషన్ల ప్రకటనతో కొందరు ఆశావహుల్లో ఉత్సాహం నెలకొనగా, మరికొందరికి నిరాశ ఎదురైంది. వారి గ్రామ పంచాయతీల వారిగా సర్పంచ్ స్థానాలకు కేటాయించిన రిజర్వేషన్ల వివరాలను అధికారులు మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేశారు.

**గ్రామాల వారిగా సర్పంచ్ రిజర్వేషన్లు ఇలా..**

వెలుగోడు మేజర్ గ్రామ పంచాయతీ: బీసీ మహిళ

అబ్దుల్లాపురం: ఎస్సీ జనరల్

వేల్పనూరు: అన్‌రిజర్వుడ్

రేగడగూడూరు: అన్‌రిజర్వుడ్

గుంతకందాల: అన్‌రిజర్వుడ్ మహిళ

మోతుకూరు: బీసీ జనరల్

బోయరేవుల: అన్‌రిజర్వుడ్ మహిళ

మాధవరం: బీసీ మహిళ ఇదిలా ఉండగా, మండల పరిషత్ అధ్యక్షురాలు (ఎంపీ) బీసీ మహిళకు కేటాయించబడింది, వెలుగోడు జడ్పీటీసీ కోసం అన్‌రిజర్వుడ్‌గా ప్రకటన.

**ఆశావహుల్లో మొదలైన రాజకీయ సమీకరణలు**రిజర్వేషన్లు ఖరారు కావడంతో గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై చర్చలు ఊపందుకున్నాయి. అధికార పార్టీతో పాటు ఇతర రాజకీయ పార్టీలు సైతం తమకు అనుకూలమైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు కసరత్తు చేస్తున్నాయి. రిజర్వేషన్లకు అనుగుణంగా కొత్త అభ్యర్థులు తెరపైకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వెలుగోడు మేజర్ పంచాయతీ సర్పంచ్ స్థానం బీసీ మహిళకు గ్రామ స్థానం కేటాయించడంతో ఆ పోటీకి ఎవరెవరు ముందుకొస్తారనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మొత్తంగా రిజర్వేషన్ల ప్రకటనతో మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల వేడి. ఏ గ్రామంలో ఎవరు పోటీ చేస్తారు? ఏ పార్టీ ఎవరికి అవకాశం కల్పిస్తుంది? ప్రజల మద్దతు ఎవరికి లభిస్తుంది? అన్నది రానున్న రోజుల్లో తేలుతుంది.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

**ఎన్నికల విధుల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలి**

**ప్రచార సామగ్రి తొలగింపు, ఎన్నికల నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**అధికారులకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశాలు**

**నంద్యాల బ్యూరో, అక్టోబరు 14(నంది పత్రిక):–** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జిల్లావ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎన్నికల సంసిద్ధత, ఏర్పాట్లపై సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీఆర్ఓ రాము నాయక్, ఏఓ సుభాకర్ రావు, సంబంధిత అధికారులు తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ప్రవర్తనా నియమావళిని అధికారులు ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ ప్రచార చిత్రాలు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల విధులతో సంబంధం ఉన్న అధికారుల బదిలీలు, పోస్టింగులు ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగానే చేపట్టాలని తెలిపారు. కొత్త అభివృద్ధి పనుల మంజూరు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సంబంధించి ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, ప్రభుత్వ వాహనాలు, వనరులను ఎన్నికల ప్రచారానికి వినియోగించకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ అతిథి గృహాలను రాజకీయ ప్రచారానికి ఉపయోగించకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ ఆస్తులపై ప్రచార సామగ్రి ఏర్పాటుకు యజమానుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలి... పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రచార వాహనాలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, బహిరంగ సభలు, ర్యాలీలు, లౌడ్‌స్పీకర్ల వినియోగంలో పోలీసుల అనుమతులు, నిర్ణీత సమయ పరిమితులను పాటించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ప్రచారాన్ని నియంత్రించాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో అభ్యంతరకర ప్రచారాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల సంఘం ఆదేశాలను తు.చ. తప్పకుండా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పూర్తి సంసిద్ధతతో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.



# ఈవీఎం గోదాముల భద్రతలో అలసత్వానికి తావులేదు

**ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పటిష్ట భద్రతా చర్యలు కొనసాగించాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, అక్టోబర్ 14(నంది పత్రిక):–** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. ప్రతి నెల నిర్వహించే తనిఖీల్లో భాగంగా బుధవారం నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డ్‌లో ఈవీఎం గోదాములను కలెక్టర్ పరిశీలించారు. గోదాముల తాళాలు, సీళ్ల పటిష్టత, సీసీటీవీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలు, ఇతర భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. పోలీసు లాగ్‌బుక్‌ను పరిశీలించి విధుల నిర్వహణ వివరాలను తెలుసుకున్నారు. సీసీటీవీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచాలని, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో సబ్ కలెక్టర్ మనీషా, జిల్లా రెవెన్యూ అధికారి డి. రామునాయక్, తహసీల్దార్ సత్య శ్రీనివాసులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## పొలం తగాదాలో ఆరుగురిపై కేసు నమోదు

**కొత్తపల్లి – నందిపత్రిక** పొలం తగాదా విషయంలో ఇంటిపైకి వెల్లి దాడి చేసిన ఆరుగురుపై కేసునమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం రవీంద్రబాబు బుధవారం రాత్రి తెలిపారు. ఆదిన పాత మాడుగుల గ్రామానికి చెందిన గుంపుల జ్యోతి, పెద్ద ఏసన్నలకు, ఎర్రమఠం గ్రామానికి చెందిన శీలం శ్రీనివాసులు, శీలం వెంకటేశ్వర్లు, శీలం లాజర్, శీలం మద్దిలేటి, శీలం మేరమ్మ, శీలం రత్నమ్మలకు పొలం విషయంలో తగాదాలు ఉన్నాయి. అయితే ఈ నెల 11వ తేదిన ఎర్రమఠం గ్రామానికి చెందిన ఆరుమంది కలసి పాతమాడుగుల గ్రామంలోని గుంపుల జ్యోతి ఇంటి వద్దకు వల్లి నీ మొగుడు మా పొలం మేము సాగు చేకుంటుంటే అడ్డు వస్తాడా అని తిడుతూ నిన్ను తంతే నీ మొగుడు వస్తాడు అని ఆమెపై కర్రలతో దాడికి దిగారని తెలిపారు. దీంతో జ్యోతికి, పెద్ద ఏసన్నకు రక్తగాయాలు, మూగ గాయాలు అయ్యాయని తెలిపారు. వారు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొంది బుధవారం పోలీసులను ఆశ్రయించారని తెలిపారు. గుంపుల జ్యోతి పిర్యాదు మేరకు ఆరు మందిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రవీంద్ర వెల్లడించారు.

# హెచ్‌ఎండీఏలో ముడుపుల దందా!

**-లేఅవుట్ అనుమతుల ముసుగులో వసూళ్లు**

**-రూ.20 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన తహసీల్దార్, సర్వేయర్..**

**-క్షేత్రస్థాయి నుంచి హెచ్‌ఎండీఏ వరకు ఇదే తంతు!**



1లేఅవుట్ అనుమతుల ప్రక్రియలో అవినీతి ఆరోపణలు మరోసారి తెరపైకి వచ్చాయి. అబ్దులా ్లపూర్‌మెట్ పరిధిలో పది ఎకరాల భూమికి లేఅవుట్ అనుమతులు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న వ్యక్తిని లంచం కోసం వేధించినట్లు ఆరోపణలు ఎదు ర్కొంటున్న తహసీల్దార్ బి. సుదర్శన్‌రెడ్డి, సర్వేయర్ శ్రీనివాసులు ఏసీబీ అధికారులకు చిక్కారు. జాయింట్ సర్వే నిర్వహించి, భూమికి సంబంధించిన వివరాలను హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో నమోదు చేయడానికి రూ. 30 లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం. చివ రకు రూ. 20 లక్షలకు ఒప్పందం కుదరగా, నగదు తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికా రులు పట్టుకున్నారు.

**-జాయింట్ సర్వే పేరుతో డిమాండ్‌లు**

హెచ్‌ఎండీఏ పరిధిలో లేఅవుట్ అనుమతులు పొందా లంటే పలు దశల్లో అధికారుల పరిశీలన అవసరం. దరఖాస్తు చేసుకున్న భూమిపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహి ంచాలి. భూమికి సంబంధించిన వివాదాలు, నాలా కన్వర్షన్ వంటి అంశాలను పరిశీలించి, అవసరమైన వివరాలను హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే తదుపరి స్థాయి పరిశీలనకు ఫైలు వెళ్తుంది. ఇలాంటి కీలక దశలో కొందరు అధికారులు లంచాల కోసం దరఖా స్తుదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోప ణలు ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ ఘటన కూడా ఈ వ్యవహారంపై చర్చకు దారితీసింది. తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, సర్వేయర్ శ్రీనివాసులు కలిసి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఏసీబీ దర్యాప్తులో వెల్లడయ్యే అంశాలు కీలకం కానున్నాయి.

**-స్థానికంగా పలుకుబడి.. అక్రమ వసూళ్ల ఆరోపణలు**

సుదర్శన్‌రెడ్డి గతంలో వీఆర్వో స్థాయి నుంచి పనిచేస్తూ అదే ప్రాంతంలో తహసీల్దార్ స్థాయికి ఎదిగినట్లు సమాచారం. స్థానికంగా ఉన్న పరిచ యాలను ఉపయోగించుకొని కొందరిని మధ్యవ ర్తులుగా పెట్టుకుని అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వేయర్ శ్రీనివా సులుపైనా ఫీల్డ్ సర్వేల సమయంలో దరఖాస్తుదారుల నుంచి అనవసర సౌకర్యాలు, ముడుపులు ఆశించే వారనే ఫిర్యాదులు ఉన్నట్లు తెలుస్తోంది. అడిగిన మొత్తాలు ఇవ్వకపోతే సర్వే ప్రక్రియలో అభ్యంతరాలు లేవనెత్తుతూ పనులు ఆలస్యం చేస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి.

**-హెచ్‌ఎండీఏలోనూ మధ్యవర్తుల హవా?**

క్షేత్రస్థాయిలో అవసరమైన ప్రక్రియలన్నీ పూర్తి చేసి ఫైలు హెచ్‌ఎండీఏకు చేరిన తర్వాత కూడా దరఖా స్తుదారులకు ఇబ్బందులు తప్పడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్లానింగ్ విభాగంలో ఫైళ్ల పరిశీలన నుంచి ఉన్నతాధికారుల ఆమోదం వరకు వివిధ దశల్లో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు గతంలోనూ వెలుగులోకి వచ్చాయి. గతంలో భారీగా వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న ప్లానింగ్ విభాగం అధికారి ఏసీబీకి చిక్కిన ఘటన కూడా చోటుచేసుకుంది. ఫైళ్లను త్వరగా క్లియర్ చేయిస్తామంటూ కొందరు కన్సల్టెంట్లు మధ్య వర్తులుగా వ్యవహరిస్తూ అధికారులకు డబ్బులు చేరవే స్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేప థ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ ఘటనలో బయ టపడిన వ్యవ హారం ఒక్క ప్రాంతానికే పరిమితమా, లేక అను మతుల ప్రక్రియలో మరిన్ని అక్రమాలు చోటుచేసు కుంటున్నాయా అన్నది విచారణతో తేలాల్సి ఉంది. లేఅవుట్ అనుమతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, లంచాల బెడద లేకుండా చూడాల్సిన అవసరం ఉంది.

## గౌచర్స్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి ఆర్ మమతకు రూ. 35 వేలు ఆర్థిక సహాయం

### వీ హావ్ హ్యుమానిటీ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం



**కర్నూలు సిటీ నంది పత్రిక** గౌచర్స్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఏడేళ్ల చిన్నారి ఆర్ మమత చికిత్సకు సహాయంగా వీ హావ్ హ్యుమానిటీ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో బుధవారం రూ 35,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. చిన్నారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని చికిత్సకు అవసరమైన మొత్తాన్ని సమకూర్చేందుకు సమాజంలోని దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు ముందుకు రావాలని ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి దాతకు, సహాయకుడికి, మానవతావాదికి సంస్థ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అయితే, చిన్నారి శస్త్ర చికిత్సకు ఇంకా ఆర్థిక సహాయం అవసరమని, దాతలు తమకు వీలైనంత సహాయం అందించి ఆ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. చిన్నారి పరిస్థితిని సంబంధిత ప్రభుత్వ అధికారులు గమనించి, అవసరమైన వైద్య సహాయం అందేలా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. మానవత్వమే మన మతంఌ సేవే మన లక్ష్యం అనే ఆశయంతో వీ హావ్ హ్యుమానిటీ హెల్పింగ్ హాండ్స్ నిరుపేదలకు, ఆపదలో ఉన్న కుటుంబాలకు తన వంతు సహాయం అందించేందుకు కృషి చేస్తోంది. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఖాజా, రవి, హరి, ఫాహద్, హరి హరనాథ రెడ్డి, హుస్సేన్, ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.







# మహానందిలో వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు...

**మహానందిలో వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు...**
**'రాజరాజేశ్వరి', 'కూష్మాండ దుర్గ' రూపాల్లో కామేశ్వరి దేవి దర్శనం...**
**కూష్మాండ దుర్గా దేవి దర్శనంతో సకల అరిష్టాలు దూరం : వేదపండితులు రవిశంకర్ అవధాని**

**మహానంది అక్టోబర్ 14 (నంది పత్రిక):-** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో శ్రీ కామేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఉదయం శ్రీ కామేశ్వరి అమ్మవారి మూలమూర్తి భక్తులకు శ్రీ రాజారాజేశ్వరి దేవిగా, సాయంత్రం శేష వాహనంపై కూష్మాండ దుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి, చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర్ పర్యవేక్షణలో యాగశాలలో వేదపండితులు రవిశంకర్ అవధాని బృందం, రుత్వికులు మరియు అర్చకుల ఆధ్వర్యంలో పూజల దాతలతో కలిసి నవదుర్గ కలశ అర్చనలు, శతచండీయాగము, శ్రీచక్ర నవావరణార్చనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.సాయంత్రం వేళ అలంకార మండపంలో అమ్మవారికి కనుల పండుగగా సహస్ర దీపాలంకరణ సేవ, అష్టవిధ మహా మంగళహారతులు, సామూహిక కుంకుమార్చనలు జరిపారు.రాత్రి వేళ శేష వాహనంపై కొలువైన కూష్మాండ దుర్గ అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, మంగళ వాయిద్యాలు, మేళతాళాలు మరియు అశేష జనవాహిని నడుమ గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని మాట్లాడుతూ లోకకల్యాణం కోసం, దుష్టులను శిక్షించడానికి మరియు రాక్షస సంహారానికి దేవి తీసుకున్న అవతారాలలో నాలుగో అవతారం శ్రీ కూష్మాండ దుర్గ అని తెలిపారు.ఈ సృష్టిలోని



సమస్త భూమండలాన్ని అమ్మవారు గుమ్మడికాయ ఆకారంలో చేసి తన చేతుల్లోకి తీసుకుంటుందని పురాణ ప్రశస్తి ఉందని వివరించారు.శ్రీ కూష్మాండ దుర్గ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకోవడం ద్వారా సకల అరిష్టాలు, గ్రహదోషాలు నశిస్తాయన్నారు.భక్తులకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు సిద్ధిస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు,ఏఈఓ మధు,ఆలయ పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి,నీలకంఠేశ్వర రాజు,సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య,అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



# సూర్యాపేట కాంగ్రెస్ పగ్గాలు పటేల్ రమేష్ రెడ్డికేనా..?







**-రేవంత్ రెడ్డి వ్యూహం ఏమిటి?**
**-ఉత్తమ్ కుమార్ రెడ్డి నిర్ణయంపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తికర చర్చ**
**-రెండుసార్లు టికెట్ దక్కకపోయినా పార్టీని వీడని విధేయుడు**
**-సేవా కార్యక్రమాలతో ప్రజల్లో గుర్తింపు**
**-సర్వోత్తమ్ రెడ్డితో కలిసి పనిచేస్తే కాంగ్రెస్‌కు కొత్త బలం**

సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ రాజకీయాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా ఒకటే చర్చ..నియోజకవర్గ పార్టీ పగ్గాలు ఎవరికి అప్పగించబోతున్నారు? అయితే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డికి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందన్న ప్రచారం పార్టీ శ్రేణుల్లో జోరుగా సాగుతుంది.ఈ వ్యవహారంపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందంటూ కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. అయితే,దీనిపై పార్టీ అధిష్ఠానం నుంచి అధికారిక ధృవీకరణ రావాల్సి ఉంది.

**-విధేయతకు గుర్తింపు దక్కనుందా?**

రాజకీయాల్లో పదవులు, టికెట్లు ఆశించడం సహజం. కానీ,ఆశించిన అవకాశం దక్కనప్పుడు పార్టీని అంటిపెట్టుకొని ఉండటం, కార్యకర్తగా తన బాధ్యతలను కొనసాగించడం కొందరికే సాధ్యమవుతుంది.పటేల్ రమేష్ రెడ్డి రాజకీయ ప్రయాణంలోనూ ఈ అంశమే ప్రధాన చర్చగా మారింది. గతంలో రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ దక్కకపోయినా అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి పార్టీ కార్యక్రమాల్లో కొనసాగడం ఆయన విధేయతకు నిదర్శనంగా అనుచరులు పేర్కొంటున్నారు. టికెట్ రాలేదని పార్టీకి దూరం కాకుండా,సూర్యాపేట నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ తన రాజకీయ కార్యకలాపాలను కొనసాగించడం ఆయనకు అనుకూల అంశంగా మారింది.తన సోదరుడు పటేల్ శ్రీధర్ రెడ్డి సహకారంతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలతో సంబంధాలను కొనసాగిస్తున్నారనే అభిప్రాయం స్థానిక రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వం ఆయన సేవలను గుర్తించి కీలక బాధ్యతలు అప్పగిస్తుందా? అన్న ప్రశ్న ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

**-దామోదర్ రెడ్డి తర్వాత నాయకత్వ శూన్యత?**

సూర్యాపేట కాంగ్రెస్ రాజకీయాల్లో దామోదర్ రెడ్డి కీలక నాయకుడిగా వ్యవహరించారు.ఆయన మరణం తర్వాత పార్టీ కార్యకర్తలకు పెద్దదిక్కు లేకుండా పోయిందనే భావన కొంతమంది శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో పార్టీని సమన్వయపరిచి, పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచి, నాయకత్వాన్ని ముందుకు నడిపించే వ్యక్తి అవసరం ఉందనే చర్చ బలపడుతోంది.ఈ నేపథ్యంలో పటేల్ రమేష్ రెడ్డి పేరు తెరపైకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఆయనకు నియోజకవర్గ స్థాయిలో బాధ్యతలు అప్పగిస్తే కాంగ్రెస్ శ్రేణులను ఏకతాటిపైకి తీసుకురావడంతో పాటు పార్టీని మరింత బలోపేతం చేసే అవకాశం ఉందని ఆయన అనుచరులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.అయితే,నాయకత్వ మార్పు లేదా కొత్త నియామకం విషయంలో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే కీలకం కానుంది.

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం చుట్టూ కాంగ్రెస్ రాజకీయాల్లో మరో అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. రామ్‌రెడ్డి దామోదర్ రెడ్డి కుటుంబానికి చెందిన రామ్‌రెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి ఈ స్థానం నుంచి పార్టీ టికెట్ ఖరారైన నేపథ్యంలో, ఆయన గెలుపు కోసం కృషి చేస్తానని పటేల్ రమేష్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు.తామిద్దరం వేర్వేరు వేదికల ద్వారా చట్టసభల్లోకి ప్రవేశించి సూర్యాపేట అభివృద్ధికి కృషి చేయాలనే ఆలోచనతో ఉన్నామని, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని రమేష్ రెడ్డి స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ అభివృద్ధే తమ ప్రధాన ధ్యేయమని ఆయన చెబుతున్న అంశం కూడా చర్చకు వస్తోంది.ఒకవైపు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమ్ రెడ్డి విజయం కోసం కృషి చేయడం, మరోవైపు నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయడం..ఈ రెండు అంశాలు సమన్వయంతో ముందుకు సాగితే పార్టీకి రాజకీయంగా ప్రయోజనం చేకూరుతుందని కాంగ్రెస్ శ్రేణులు కూడా భావిస్తున్నారు. అయితే,ఈ ఐక్యత క్షేత్రస్థాయిలో ఎంతవరకు ఫలితాలను ఇస్తుందనేది భవిష్యత్తు పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

**-రేవంత్ రెడ్డి వ్యూహం ఏమిటి?**

సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీకి పునరుత్తేజం కల్పించడం, స్థానిక నాయకత్వాన్ని బలోపేతం చేయడం పార్టీ రాష్ట్ర నాయకత్వానికి కీలక అంశాలుగా మారాయి.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పటేల్ రమేష్ రెడ్డికి కీలక బాధ్యతలు అప్పగించాలనే ఆలోచనలో ఉన్నారా? తన చిన్ననాటి స్నేహితుడిగా చెప్పబడుతున్న రమేష్ రెడ్డికి రాజకీయంగా అండగా నిలుస్తారా? అన్న చర్చ పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది.అయితే, వ్యక్తిగత సాన్నిహిత్యం ఉందనే ప్రచారం ఒక్కటే పదవుల నియామకానికి ఆధారమని భావించలేం.స్థానిక రాజకీయ సమీకరణాలు,పార్టీకి నాయకుల సేవలు,కార్యకర్తల అభిప్రాయాలు, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలు వంటి అనేక అంశాలను అధిష్ఠానం పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోవాలంటే కాంగ్రెస్ శ్రేణుల మధ్య సమన్వయం, బలమైన స్థానిక నాయకత్వం అవసరమనే అభిప్రాయం కాంగ్రెస్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.ఈ క్రమంలో రమేష్ రెడ్డికి కీలక బాధ్యతలు అప్పగించడం పార్టీ వ్యూహంలో భాగమవుతుందా? అనేది ఆసక్తికరంగా మారింది.

జిల్లా రాజకీయాల్లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయం,స్థానిక నాయకుల మధ్య సమన్వయం కూడా ప్రాధాన్యం కలిగిన అంశాలుగా కనిపిస్తున్నాయి. పటేల్ రమేష్ రెడ్డి త్వరలో ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసే అవకాశం ఉందని,ఆయన మద్దతు లభిస్తే నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతల విషయంలో ముందడుగు పడవచ్చని రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు సాగుతున్నాయి. అయితే,ఈ భేటీ ఖరారైందని, ఉత్తమ్ కుమార్ రెడ్డి అంగీకారం కోసం ముఖ్యమంత్రి ఎదురు చూస్తున్నారని లేదా ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే నియామకం జరుగుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి.ఈ అంశాలపై స్పష్టత రావాలంటే సంబంధిత నాయకుల ప్రకటనలు లేదా పార్టీ అధిష్ఠానం నిర్ణయం వెలువడాల్సి ఉంటుంది.

## స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్లు కరారు - ఎంపీడీఓ మేరీ

**కొత్తపల్లి - నంది పత్రిక :** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబందించిన రిజర్వేషన్లు కరారు అయ్యాయి. బుధవారం రాత్రి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల ఎంపీడీఓ మేరి రిజర్వేషన్ల జాబితాను విడుదల చేశారు. మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి ఎర్రమఠం- అన్ రిజర్వు, శివపురం- బీసీ, కొత్తపల్లి అర్రిజర్వు(మహిళ), కొక్కెరంచ-బీసీ (మహిళ), దుద్యాల-1-ఎస్సీ(మహిళ), దుద్యాల-2- ఎస్సీ, నందికుంట-బీసీ(మహిళ), గోకవరం-అర్రిజర్వు, గువ్వలకుంట్ల- అర్రిజర్వుగా రిజర్వేషన్లు కరారు అయినట్లు వెల్లడించారు.

## పంట నమోదు వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ**



**భీమవరం బ్యూరో చీప్ అక్టోబర్ 14 నంది పత్రిక** పంట నమోదు కార్యక్రమంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా, ప్రతి సర్వే నంబరులో సాగు చేస్తున్న పంట వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.బుధవారం పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల గ్రామంలో క్షేత్రస్థాయిలో నిర్వహించిన ఈ-క్రాప్ సూపర్ చెకింగ్ కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతుల పొలాలకు సంబంధించి చేపట్టిన పంట నమోదు వివరాలను ఆమె క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ-క్రాప్‌లో పంట నమోదు చేసిన 40 సర్వే నంబర్ల వివరాలను పరిశీలించి, సంబంధిత సర్వే నంబర్లలో వాస్తవంగా ఏ పంట సాగు చేస్తున్నారో, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేశారో లేదో అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంట వివరాలతో సరిపోల్చుకోవాలని సూచించారు. పంట రకం, సాగు విస్తీర్ణం, సర్వే నంబర్ తదితర వివరాల్లో ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు తహసీల్దార్ వై. దుర్గా కిషోర్, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్, గ్రామ వ్యవసాయ అధికారులు రైతులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## ప్రకృతి వైపరీత్యానికి ప్రభుత్వంపై నిందలా?



పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరిగితే తెలంగాణ ప్రభుత్వం బాధ్యత వహించాలా? రుతుపవనాలు బలహీనపడి వర్షపాతం తగ్గితే దాని కీ ప్రభుత్వమే కారణమా? తెలంగాణలో ప్రస్తుత వర్షాభావ పరిస్థితులపై రాజకీయ ఆరోపణలు మొదలయ్యే ముందు సమాధానం వెతకాల్సిన ప్రశ్నలు ఇవి.ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే గణనీ యంగా పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులకు దారితీసే ప్రకృతిపరమైన సహజ ప్రక్రియ. దీని ప్రభావం ఒక్క దేశానికో, ఒక్క రాష్ట్రానికో పరిమితం కాదు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతలు, వ్యవసాయం, నీటి వనరులపై దీని ప్రభావం కనిపిస్తుంది. భారతదేశానికి సంబంధించి ఎల్‌నినో నైరుతి రుతుపవనాలపై ప్రభావం చూపే ముఖ్యమైన వాతావరణ కారకం. ఎల్‌నినో ప్రభావం తెలంగాణకు కొత్తేమీ కాదు. 1982--83, 1997--98, 2002--03, 2009--10, 2014--15, 2015--16 వంటి బలమైన ఎల్‌నినో దశల్లో తెలంగాణతో పాటు దేశమంతటా రుతుప వనాల అస్థిరత, వర్షపాత లోటు, వ్యవసాయంపై ప్రతికూల ప్రభావాలు కనిపించాయి. గత 75 ఏళ్లుగా, అంటే 1951 నుంచి 2026 మధ్య నమోదైన 16 ప్రధాన ఎల్‌నినో సందర్భాల్లో... సుమారు 10 సందర్భాల్లో తెలంగాణలో గణనీయమైన వర్షపాత లోటు నమోదైనట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. అంటే ఎల్‌నినో వచ్చిన ప్రతిసారీ కరవు తప్పదని కాదు. అయితే ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పుడు వర్షపాతంలో తీవ్ర హెచ్చుతగ్గులు, లోటు ఏర్పడే అవకాశం పెరుగుతుందని చారిత్రక అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యానికి కొనసాగింపుగానే 2026లోనూ ఈ ప్రభావం తెలంగాణలో స్పష్టంగా కనిపిస్తోంది. వర్షాలు సకాలంలో కురవక పోవడం, ప్రాంతాల మధ్య వర్షపాతంలో తీవ్ర వ్యత్యాసాలు ఉండటం, పలుచోట్ల దీర్ఘకాల పొడి వాతావరణం కొనసాగడం వంటి పరిస్థితులు నెలకొన్నాయి.అక్టోబర్ మొదటి వారం నాటికి తెలంగాణలో నైరుతి రుతుపవనాల వర్షపాతం సాధారణం కంటే సుమారు 20శాతం తక్కువ నమోదైంది. రాష్ట్రంలోని దాదాపు 18 జిల్లాల్లో లోటు వర్షపాతం నమో దుకాగా, సుమారు 235 మండలాల్లో తీవ్రమైన వర్షపాత లోటు నమోదై కరవును తలపించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షపాత లోటు, దాని ఫలితంగా తలెత్తిన నీటి కొరతను పూర్తిగా ప్రభుత్వ వైఫల్యంగా మాత్రమే చిత్రీకరించడం శాస్త్రీయంగా సమంజసం కాదు.ఈ వర్షపాత లోటు కారణంగా భూగర్భ జలాలపై ఒత్తిడి పెరగడంతో పాటు, చెరువులు పూర్తిస్థాయిలో నిండక పోవడం, నదుల ప్రవాహాలు తగ్గడం వంటి పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో చిన్న నీటి వనరుల నుంచి ప్రధాన రిజర్వాయర్ల వరకు నీటి లభ్యత తగ్గి, వ్యవసాయం, తాగునీరు, సాగునీరు, విద్యుత్ ఉత్పత్తి, పశుపోషణ రంగాలపై ఒత్తిడి పెరిగింది. రాష్ట్రంలో తీవ్ర కరవు పరిస్థితులు ఏర్పడే అవకాశాలపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గడం సహజ పరిణామంగానే చూడాలి తప్ప, దానికి రాజకీయ కోణాన్ని ఆపాదించడం సరికాదు. పరిమిత నీటి లభ్యతతో తాగునీరు, సాగునీరు, పారిశ్రామిక అవసరాల మధ్య సమ తుల్యత సాధించడం ప్రభుత్వానికి సవాలుగా మారింది. రైతులకు సాగు నీరు అవసరమైనప్పటికీ, రిజర్వాయర్లలో నిల్వలు తక్కువగా ఉన్నప్పుడు తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వడం అనివార్యమవుతుంది. అందువల్ల ప్రస్తుత నీటి కొరతను కేవలం రాజకీయ విమర్శల కోణంలో కాకుండా, ఎల్‌నినో ప్రభావం, వర్షపాత లోటు, రిజర్వాయర్లలోకి తగ్గిన ఇన్‌ఫ్లో వంటి వాస్తవ పరిస్థితుల నేపథ్యంలో అర్థం చేసుకోవాలి.ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ వ్యవసాయానికి మరో కీలక ప్రశ్న ఎదురైంది. నీటి లభ్యత తగ్గిన ప్రాంతాల్లో అధిక నీటి అవసరం ఉన్న వరి సాగును కొనసాగించాలా? లేక అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలా? ఈ పరిస్థితిని ముందుగానే అంచనా వేసిన ప్రభుత్వం, ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు గత ఏప్రిల్ నుంచే చర్యలు ప్రారంభించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఇప్పటివరకు పన్నెండుసార్లు వివిధ జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమీక్షలు నిర్వహించి, జిల్లాల వారీగా పరిస్థితులను అంచనా వేసి అవసరమైన కార్యాచరణను రూపొందించింది. వర్షపాతంపై భారత వాతావరణశాఖ చేసిన ముందస్తు హెచ్చరికలను పరిగణనలోకి తీసుకుని, వ్యవసాయశాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయ నిపుణుల సూచనలతో అత్యవసర (కంటింజెన్సీ) ప్రణాళికలను సిద్ధం చేసింది. నీటి లభ్యత తగ్గే ప్రాంతాల్లో వరి వంటి అధిక నీటి అవసరం ఉన్న పంటలపై ఆధారపడటాన్ని తగ్గించి, కందులు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు వంటి తక్కువ నీటి అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించేలా సూచనలు చేసింది.

# భయం బతికించే నమ్మకాలు..
# బతకనివ్వని మూఢనమ్మకాలు..!

నమ్మడం తప్పుకాదు..ఎందుకు నమ్ముతున్నామో తెలియకపోవడమే అసలు సమస్య.మనిషి జీవితంలో నమ్మకానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది.మనుషుల మధ్య సంబంధాలు నిలబడాలన్నా, కుటుంబాలు కొనసాగాలన్నా, సమాజం ముందుకు సాగాలన్నా కొంత నమ్మకం అవసరం.కానీ,ఆ నమ్మకం ఎప్పుడు మనిషికి ధైర్యాన్నిస్తుంది? ఎప్పుడు అతడిని భయానికి బానిసను చేస్తుంది? ఎప్పుడు జీవితానికి దారి చూపిస్తుంది? ఎప్పుడు జీవితాన్ని చీకట్లోకి నెట్టేస్తు ంది? అన్నది ఆలోచించాల్సిన అసలు విషయం. జీవితం మీద భయం ఉన్నవాడు నమ్మకాల కోసం వెతుకుతాడు. తనకు ఎదురయ్యే ప్రతి సమస్య వెనుక ఏదో అదృశ్యశక్తి ఉందని భావిస్తాడు.జరగబోయే ప్రమాదాన్ని ముందే తెలుసుకోవాలని,భవిష్యత్తును తనకు అనుకూలంగా మార్చుకోవాలని,తన చేతుల్లో లేని పరిస్థితులను కూడా ఏదో ఒక శక్తి నియం త్రిస్తుందని నమ్మాలని ప్రయత్నిస్తాడు.ఆ ప్రయత్న ంలోనే కొన్నిసార్లు విశ్వాసం పుడుతుంది. మరికొన్ని సార్లు మూఢనమ్మకం పుట్టుకొస్తుంది.జీవితాన్ని సహజంగా స్వీకరించలేని మనిషి, జీవితంలో జరిగే ప్రతి పరిణామానికి కనిపించని కారణాలను వెతుకు తుంటాడు.అనుకున్నది జరిగితే తన నమ్మకం నిజమైందను కుంటాడు.అనుకున్నది జరగకపోతే తన నమ్మకంలో ఏదో లోపం జరిగిందని భావిస్తాడు. చివరికి తన జీవితాన్ని తానే అర్థం చేసుకోవడం మానేసి,తన భయాలకు సమాధానాలు చెప్పే వ్యవ స్థలకు బానిసవుతాడు.కానీ, జీవితాన్ని జీవితంగా స్వీకరించేవాడు ప్రతి సంఘటననూ ఒకే కోణంలో చూడడు.గెలుపు వచ్చినప్పుడు పొంగిపోడు.ఓటమి ఎదురైనప్పుడు కుంగిపోడు.తన చేతుల్లో ఉన్నదాని కోసం ప్రయత్నిస్తాడు.తన చేతుల్లో లేనిదాన్ని ఎదు ర్కొనే ధైర్యాన్ని పెంచుకుంటాడు.ఏది జరిగినా జరిగిపోతుందిలే అని నిర్లక్ష్యంగా కాకుండా,ఏం జరిగినా ఎదుర్కొందామనే ఆత్మవిశ్వాసంతో ముం దుకు సాగుతాడు.అతడికి భయం లేదని కాదు.. భయమే తన జీవితాన్ని నడిపించకూడదని తెలుసు.

### -నమ్మకం ఒకటి..గుడ్డి నమ్మకం మరొకటి

ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. నమ్మడం, నమ్మకపోవడం అనేవి ఈ చర్చలో ప్రధానమైన అంశాలు కావు.అసలు ప్రశ్న ఏమిట ంటే.. దేనిని నమ్మాలి? ఎందుకు నమ్మాలి? ఎప్పుడు నమ్మాలి? ఏ ఆధారంతో నమ్మాలి?ఒక మనిషిని నమ్మడం వెనుక అతడి ప్రవర్తన ఉండవచ్చు.ఒక సిద్ధాంతాన్ని నమ్మడం వెనుక దాని ఆలోచనా విధానం ఉండవచ్చు.ఒక విషయాన్ని విశ్వసించడం వెనుక అనుభవం,పరిశీలన,ఆధారాలు ఉండవచ్చు.అలాంటి నమ్మకాలు మనిషి జీవితానికి ఉపయోగపడతాయి. కానీ,ఏ ప్రశ్నకూ తావివ్వకుండా,ఏ ఆధారాన్నీ పరిశీలి ంచకుండా,ఎవరో చెప్పారని లేదా తరతరాలుగా వస్తోందని ఒక విషయాన్ని గుడ్డిగా అంగీకరించడం మాత్రం ఆలోచనకు సంకెళ్లు వేయడమే.ప్రశ్నించడం అంటే అవమానించడం కాదు. సందేహించడం అంటే వ్యతిరేకించడం కాదు.ఆధారాలు అడగడం అంటే విశ్వాసాన్ని కించపరచడం కాదు.ఒక విషయం నిజమైతే ప్రశ్నలను తట్టుకుని నిలబడగలగాలి. ఆధారాలు ఉంటే పరిశీలనకు భయపడాల్సిన అవసరం ఏముంది? నిజానికి ప్రశ్నలకు భయపడే నమ్మకమే తన బలహీనతను బయటపెట్టుకుంటుంది.

### -కళ్లకు కనిపించేదాన్ని వదిలి.. కనిపించనిదాని వెంట ఎందుకు?

మన సమాజంలో అనేక సమస్యలకు మూలం ఇదే.కళ్లకు కనిపిస్తున్న వాస్తవాలను పట్టించు కోకుండా, వాటికి అతీతంగా ఏదో శక్తి ఉందని నమ్మడంలోనే మనిషి తన విచక్షణను కోల్పోతున్నాడు. రోగం వస్తే దానికి కారణాలను తెలుసుకోవాలి. అవసరమైన వైద్యం చేయించుకోవాలి.కానీ,కొన్నిసార్లు వ్యాధి వెనుక దైవాగ్రహం ఉందని, ఎవరో ఏదో చేశారని,ఏదో శక్తి వెంటాడుతోందని భావించి వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తారు.పరీక్షల్లో బయటపడే కార ణాలకంటే కనిపించని కారణాలకే ప్రాధాన్యమిస్తారు. ఫలితంగా సమస్య పరిష్కారం కావాల్సిన చోట సమస్య మరింత తీవ్రమవుతుంది. వ్యవసాయంలో పంట నష్టపోతే వర్షాభావం,నేల స్వభావం,తెగుళ్లు, సాగునీరు,మార్కెట్ పరిస్థితులు వంటి వాస్తవాలను పరిశీలించాలి. కుటుంబంలో సమస్య వస్తే పరస్పర అవగాహన,ఆర్థిక పరిస్థితులు, వ్యక్తుల ప్రవర్తన వంటి అంశాలను అర్థం చేసుకోవాలి.సమాజంలో అన్యా యం జరిగితే దాని వెనుక ఉన్న అధికార సంబం ధాలను, దోపిడీని,వివక్షను ప్రశ్నించాలి. కానీ, ప్రతిదా నికీ విధి,అదృష్టం, గ్రహదోషం అంటూ సరిపెట్టు కుంటే వాస్తవ కారణాలను గుర్తించే అవకాశమే పోతుంది. కనిపిస్తున్న సమస్యకు పరిష్కారం వెతక కుండా,కనిపించని కారణాన్ని నమ్మి కూర్చోవడం మనిషిని బలహీనుడిని చేస్తుంది. అయితే కళ్లకు కనిపించనిదంతా అసత్యమేనని చెప్పడం కూడా సరైన ఆలోచన కాదు.గాలి, సూక్ష్మజీవులు, గురుత్వాకర్షణ వంటి ఎన్నో విషయాలు నేరుగా కంటికి కనిపించక పోయినా వాటి ఉనికిని ఆధారాల తో తెలుసుకోగ లుగుతున్నాం.కాబట్టి ఒక విషయం కనిపిస్తుందా లేదా అన్నది అసలు ప్రమాణం కాదు. దానికి ఆధారాలున్నాయా? పరీక్షించగలమా? వాస్తవా లతో సరిపోతుందా? అన్నదే అసలు ప్రమాణం.ఇక్కడే శాస్త్రీయ దృక్పథానికి,గుడ్డి నమ్మకానికి మధ్య ఉన్న తేడా స్పష్టమవుతుంది.

### -భయాన్ని వ్యాపారంగా మార్చుకునే వ్యవస్థలు

మనిషికి భయం ఉన్నచోట దానిని ఉపయోగించుకునే వ్యక్తులు కూడా ఉంటారు.రేపు ఏమవుతుందో తెలియని భయం,అనారోగ్యం వస్తుందేమోననే ఆందో ళన, పిల్లల భవిష్యత్తుపై దిగులు,ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు.. ఇవన్నీ మనిషిని మానసికంగా బలహీనపరచగలవు.అలాంటి సమయంలో అతడికి ధైర్యం చెప్పడం ఒక బాధ్యత.సమస్యను అర్థం చేసుకు నేలా చేయడం ఒక సేవ.కానీ,అదే భయాన్ని మరింత పెంచి,దానికి పరిష్కారం తమ దగ్గరే ఉందని చెప్పి డబ్బులు,ఆస్తులు, అధికారాన్ని సంపాదించుకోవడం మాత్రం దోపిడీతో సమానం.మనిషి తన సమస్యకు కారణం తెలుసుకోవాలనుకుంటాడు. భవిష్యత్తు గురిం చి భరోసా కోరుకుంటాడు. ఈ బలహీనతను గుర్తించిన కొందరు అతడి ఆలోచనలను తమ ప్రయోజనాలకు అనుగుణంగా మలుస్తారు. ప్రశ్నించ వద్దంటారు. అనుమానించవద్దంటారు. తాము చెప్పి నదే నిజమని నమ్మమంటారు. అలా వ్యక్తి తన విచ క్షణను పక్కనపెట్టి పరాధీనుడిగా మారిపోతాడు. ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాదు.భయం ఆధారంగా మనుషులను నియంత్రించే సంస్కృతి పెరిగితే కుటుంబాల్లోనూ, సామాజిక సంబంధాల్లోనూ ,ఆర్థిక వ్యవస్థలోనూ దాని ప్రభావం కనిపిస్తుంది. మూఢన మ్మకాలు కేవలం ఒక వ్యక్తి ఆలోచనను మాత్రమే ప్రభావితం చేయవు.కొన్ని సార్లు కుటుంబాల భవిష్యత్తును, పిల్లల విద్యను,మహిళల స్వేచ్ఛను, సమాజపు పురోగతిని కూడా దెబ్బతీస్తాయి.

### -జీవితం అనేది హామీ కాదు..ఒక అవకాశం

మనిషి పుట్టినప్పటి నుంచి చివరి శ్వాస వరకు అన్నీ తన నియంత్రణలో ఉండవు.ఎప్పుడు ఏం జరుగు తుందో పూర్తిగా తెలుసుకునే శక్తి ఎవరికీ లేదు.ప్రతి ప్రమాదాన్ని నివారించలేం.ప్రతి ఓటమిని ముందే ఊహించలేం.ప్రతి విజయాన్ని హామీగా పొందలేం.ఈ వాస్తవాన్ని అంగీకరించడం జీవితంపై భయాన్ని తగ్గించే మొదటి అడుగు.కానీ,అనిశ్చితిని అంగీకరి ంచడం అంటే చేతులు ముడుచుకుని కూర్చోవడం కాదు. ప్రమాదం జరగవచ్చని తెలిసి జాగ్రత్తలు తీసుకోవాలి.అనారోగ్యం రావచ్చని తెలిసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.ఓటమి ఎదురుకావచ్చని తెలిసి మరింత శ్రమించాలి.భవిష్యత్తు మన చేతుల్లో పూర్తిగా లేకపోయినా,దాని కోసం చేసే ప్రయత్నం మాత్రం మన చేతుల్లో ఉంటుంది.జీవితాన్ని ధైర్యంగా అనుభవి ంచేవాడు ప్రతిదాన్నీ తిరస్కరించే వ్యక్తి కావాల్సిన అవసరం లేదు.అతడు తన నమ్మకాలను కూడా పరిశీలించగలగాలి.కొత్త ఆధారాలు ఎదురైతే తన అభిప్రాయాన్ని మార్చుకోగలగాలి.తనకు తెలియనిది ఉందని అంగీకరించగలగాలి.తనకు సమాధానం తెలియని ప్రశ్నకు వెంటనే అతీతమైన వివరణను సృష్టించకుండా,తెలియదని చెప్పగలగాలి.ఎందుకంటే తెలియదని అంగీకరించడం బలహీనత కాదు. తెలియనిదాన్ని తెలిసినట్లు నటించడమే అసలు బలహీనత.

### -చివరికి మనిషిని నడిపించేది నమ్మకమా..విచక్షణా?

ఒక సమాజం ఎంత అభివృద్ధి చెందిందో తెలుసు కోవాలంటే అక్కడ ఎన్ని దేవాలయాలు,ఎన్ని ప్రార్థనా మందిరాలు ఉన్నాయో లెక్కించడం ఒక్కటే సరిపోదు. అక్కడి ప్రజలు ప్రశ్నించగలుగుతున్నారా? పిల్లలు స్వేచ్ఛగా ఆలోచించగలుగుతున్నారా? అనారోగ్యానికి శాస్త్రీయ వైద్యం అందుతోందా? మహిళలకు గౌరవం, స్వేచ్ఛ ఉన్నాయా? బలహీనుల భయాన్ని ఎవరైనా దోచుకుంటే సమాజం దానిని ప్రశ్నిస్తోందా? అన్నది కూడా చూడాలి.వ్యక్తిగత విశ్వాసం ఎవరి హక్కు వారిది. ఒకరు నమ్మే విషయాన్ని మరొకరు నమ్మకపోవచ్చు.ఆ భిన్నత్వాన్ని గౌరవించాలి. కానీ, ఒకరి నమ్మకం మరొకరి జీవితాన్ని ప్రమాదంలోకి నెట్టినప్పుడు, దోపిడీకి సాధనమైనప్పుడు, ప్రశ్నించే హక్కును అణచివేసినప్పుడు మాత్రం దానిపై చర్చ జరగాలి. మనిషికి కావాల్సింది నమ్మకాలన్నింటినీ వదిలేసే సమాజం కాదు.నమ్మకాన్ని వివేకంతో పరిశీ లించే సమాజం.భయంతో తలవంచే మనుషులు కాదు.వాస్తవాలను అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకునే మనుషులు.ప్రశ్నలకు తాళం వేసే వ్యవస్థలు కాదు. ప్రశ్నలను స్వాగతించే ఆలోచనా వాతావరణం. జీవితాన్ని ప్రేమించేవాడు ప్రతి క్షణాన్నీ భయంతో కొలవడు.నమ్మకాన్ని గౌరవించేవాడు ప్రతి నమ్మకాన్నీ నిజమని అంగీకరించడు.ఆలోచించగలిగిన మనిషి తన విశ్వాసాన్నీ ప్రశ్నించగలడు.అందుకే అసలు చర్చ నమ్మకం ఉండాలా? వద్దా? అన్నది కాదు.మన నమ్మకం మనల్ని ముందుకు నడిపిస్తోందా? వెనక్కి లాగుతోందా? మనలో ధైర్యాన్ని పెంచుతోందా? భయాన్ని పెంచుతోందా? మనిషిని స్వతంత్రంగా ఆలోచించేలా చేస్తోందా? మరొకరి చేతిలో కీలుబొమ్మగా మారుస్తోందా? అన్నదే అసలు ప్రశ్న. ఎందుకంటే మనిషి జీవితాన్ని నడిపించాల్సింది అతడి విచక్షణ.భయాలు కాదు.అతడి ఆలోచన.గుడ్డి అనుకరణ కాదు.అతడి అనుభవం, ఆధారాలు, అవ గాహన.

# అమ్మగారిపల్లి గ్రామపంచాయతీలో పశు వైద్య శిబిరం



అశ్వాపురం మండలం అమ్మగారి పల్లి పంచాయతీలో స్కూలు ఆవరణలో బుధవారం అనగా 14-10-2026 రోజున ఉదయం 8 గంటలకు పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది . ఈ శిబిరం ఉమ్మడి ఖమ్మం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో అమ్మగారి పల్లి పంచాయతీ సర్పంచ్ ఇర్పా కవిత మరియు మండల పశు వైద్యులు ఎస్.కె ఫర్వీన్ బేగం సమక్షంలో నిర్వహించడం జరిగింది.ఈ శిబిరంలో పశు వైద్యులు గేదెలకు చూడు పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేయడం, గర్భ కోశ వ్యాధులకు మందులు ఇవ్వడం, దూడలకు మరియు జీవాలకు నట్టల నివారణ మందులు తాగించడం, పాలు ఇచ్చే గేదలను చూసుకోవడం లో రైతులకు తగు చూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది.సర్పంచ్ కవిత మాట్లాడుతూ ఇలా క్యాంపు లు నిర్వహించడం వల్ల పాడి రైతులకు మంచిలాభం చేకూరుతుంది అని, పశువుల పోషణ కూడా బాగుంటుంది అని గ్రామాలలో ఈ క్యాంపు లు నిర్వహించినపుడు పశువులు ఉన్న ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ జామ నాజర్, పంచాయతీ సెక్రటరీ జహిర్, పశు వైద్య సిబ్బంది ఓ.యస్. లు జగదీష్, రాజబాబు, గోపాలమిత్ర నాగరాజు, అరవిందు, రైతులు పకీరా రెడ్డి, నాగిరెడ్డి, రామారావు, నాగరాజు,రమణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, లాల్ బీ, విజయ, రమణ, ఇంకా కొంతమంది రైతులు పాల్గొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com